ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ లో
మీకు నిజం రాసే ధైర్యం ఉందా?
అందుకు
వార్త సంధ్య మీ వేదిక!
రండి — ప్రజల గళంగా,
నిజం కోసం మాతో కలవండి.
ఇప్పుడే రిపోర్టర్ గా చేరండి
vaarthasandhya@gmail.com

RNI TGTEL/25/A5065

vaartha sandhya
# వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు


SEGGEM KIRAN KUMAR
EDITOR & MD
VAARTHA SANDHYA , CM NEWS TV

Published From : Rangareddy, Hyderabad  e - paper.vaarthasandhya.com  సంపుటి : 01  సంచిక : 90  ఆదివారం  15 - 03 - 2026  ఎడిటర్ : సెగ్గెం కిరణ్ కుమార్  పేజీలు : 08  వెల : 6/-
Published From : Rangareddy, Hyderabad  e - paper.vaarthasandhya.com  VOLUME : 01  Issue : 90  Sunday  15 - 03 - 2026  Editor : Seggem Kiran Kumar  Pages : 08  Price : 6/-


## బీసీల రక్షణ కోసం
# ప్రత్యేక చట్టం

- కోర్టుల్లో కేసు వీగిపోకుండా ఉండేలా చట్టం రూపొందుతుంది
- బీసీల అభివృద్ధి మాధ్యేయం
- బీసీ నాయకులు ప్రజా ప్రతినిధుల అభిప్రాయాలు సేకరిస్తాం
- దేశంలోనే మొట్టమొదటి రాష్ట్రం
- ముఖ్యమంత్రి కృత నిశ్చయంతో ఉన్నారు
- మంత్రి సవిత



**వార్త సంధ్య, అమరావతి, మార్చి 14 :**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బీసీల (బ్యాక్‌వర్డ్ క్లాసెస్) రక్షణ కోసం ప్రత్యేక చట్టాన్ని త్వరలో తీసుకురాబోతున్నట్లు రాష్ట్ర మంత్రి సవిత తెలిపారు. బీసీల కుల వృత్తులు లేదా వారి కులాలపై అవమానకర వ్యాఖ్యలు, దూషణలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకునే విధంగా ఈ చట్టాన్ని రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. చట్టం కోర్టుల్లో నిలబడేలా, కేసులు వీగిపోకుండా ఉండేలా అన్ని విధాలుగా బలమైన నిబంధనలతో చట్టానికి తుదిరూపు ఇస్తున్నామని మంత్రి పేర్కొన్నారు.విజయవాడలోని తాటిగడపలో ఉన్న బీసీ డైరెక్టర్ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఈ అంశంపై విస్తృతంగా చర్చ జరిగింది. ఈ సమావేశంలో మంత్రి సవితతో పాటు ప్రముఖ నేతలు అచ్చం నాయుడు కొల్లు రవీంద్ర పాల్గొన్నారు. అదేవిధంగా బీసీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, బీసీ సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు మరియు ఇతర నాయకులతో కూడా చర్చించి వారి అభిప్రాయాలను స్వీకరించారు.సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడిన మంత్రి సవిత మాట్లాడుతూ బీసీల గౌరవం, మానప్రాణాలు కాపాడే లక్ష్యంతో ఈ ప్రత్యేక చట్టాన్ని రూపొందిస్తున్నామని తెలిపారు. సమాజంలో బీసీలపై అవమానకర వ్యాఖ్యలు, కుల వృత్తులపై దూషణలు జరిగితే కఠిన చర్యలు తీసుకునేలా చట్టంలో స్పష్టమైన నిబంధనలు చేర్చుతున్నామని చెప్పారు. కోర్టుల్లో కేసులు బలహీనపడకుండా ఉండేందుకు న్యాయ నిపుణుల సూచనలు కూడా తీసుకుంటున్నామని ఆమె వెల్లడించారు.దేశంలో తొలిసారిగా ఒక రాష్ట్రంలో బీసీల - మిగతా 2 లో

## రెండు రోజుల్లో ఉరుములు,
## మెరుపులతో కూడిన వానలు




- వాతావరణశాఖ అధికారి శ్రీనివాస్ రావు
- రోజురోజుకు రాష్ట్రంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- భద్రాచలం, మహబూబ్‌నగర్ ప్రాంతాల్లో 40 డిగ్రీలుగా నమోదు
- రానున్న రెండు రోజుల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే ఛాన్స్ ఉందన్న వాతావరణశాఖ అధికారి!

**వార్త సంధ్య, హైదరాబాద్, మార్చి 14 :**
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా భానుడి భగభగలు ప్రజలను మార్చిలోనే ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం, మహబూబ్‌నగర్ వంటి జిల్లాల్లో 40 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. - మిగతా 2 లో



2 లో

## లేని గ్యాస్ కొరతను సృష్టించి ప్రజలను భయపెడుతున్నారు

- తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు
- కొంతమంది కావాలనే లేని కొరతను సృష్టించి ప్రజలను భయపెడుతున్నారని ఆరోపించారు
- ప్రధాని మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం భారత్‌లో ధరలను నియంత్రణలో ఉంచిందని గుర్తుచేశారు

## మూసీనదిని
# పునరుజ్జీవనం చేయాలి

- మూసీనదిలో మంచినీరు పారేలా చేస్తామంటే విపక్షాలు అడ్డుకోవడమేంటి
- రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి
- హయత్‌నగర్‌లో రోడ్డు విస్తరణ పనులకు మంత్రి కోమటిరెడ్డి శంకుస్థాపన
- విజయవాడ హైవే కోకపేట్‌కు మించి అభివృద్ధి చెందుతుందన్న మంత్రి
- మూసీనది పునరుజ్జీవనం చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడి
- ఎల్బీనగర్ నుంచి హయత్ నగర్ రేడియో స్టేషన్ వరకు డబుల్ డెక్కర్ నిర్మాణం రాబోతుందన్న మంత్రి
- నాగపూర్‌లో 8 కిలోమీటర్ల తర్వాత అతిపెద్ద డబుల్ డెక్కర్ నిర్మాణం మన ప్రాంతంలో 6 కిలోమీటర్ల వరకు నిర్మిస్తున్నా అన్నారు



**వార్త సంధ్య, హైదరాబాద్, మార్చి 14 :**
హయత్ నగర్, ఇబ్రహీం పట్నం, ఎల్బీనగర్ వాసులకు హైదరాబాద్ - విజయవాడ రహదారి విస్తరణతో కోకాపేట లాంటి డిమాండ్ రాబోతుందని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. ప్రత్యామ్నాయ సిటీగా ఫ్యూచర్ సిటీనీ నిర్మిస్తున్నామని, ఇక్కడ నుండే చెన్నై, బెంగళూరు, ముంబై పూణెను కలుపుతూ హై స్పీడ్ బుల్లెట్ ట్రైన్, హైవే కారిడార్లు రాబోతున్నాయని అన్నారు. హయత్ నగర్ సాయిబాబా టెంపుల్ (తొర్రూర్ × రోడ్) నుంచి జీ స్కూల్ వరకు సుమారు రూ.10 కోట్ల అంచనా వ్యయంతో 2లేన్ నుంచి 4లేన్ రహదారిగా అభివృద్ధి చేస్తున్న పనులకు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఇవాళ శంకుస్థాపన చేశారు. సోమవారం నుంచి పనులు మొదలు అవుతాయన్నారు. - మిగతా 2 లో

## మమత సర్కార్‌కు
# కౌంట్‌డౌన్ ప్రారంభమైంది

- బంగాల్‌లో 'మార్పు అనే తుపానును' ఎవరూ ఆపలేరు
- భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ
- ఎన్నికల వేళ బంగాల్‌లో రూ.18,680 కోట్లతో కనెక్టివిటీ ప్రాజెక్టులు ప్రారంభించిన ప్రధాని మోదీ
- ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే మమతా బెనర్జీ సర్కార్ ఇలా చేస్తోందని విమర్శించారు
- రాష్ట్రంలో టీఎంసీ పాలనలో అదుపులేని అక్రమ వలసల వల్ల అనేక ప్రాంతాల్లో హిందువులు మైనారిటీలుగా మారిపోయారని పేర్కొన్నారు
- బంగాల్‌కు 'మహా జంగిల్‌రాజ్' పాలనను తీసుకొచ్చిన మమతా సర్కార్‌కు కౌంట్‌డౌన్ ప్రారంభమైందన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ



**వార్త సంధ్య, ఢిల్లీ, మార్చి 14 :**
అక్రమ చొరబాటుదారులను రక్షించేందుకే తృణమూల్ కాంగ్రెస్ ఎస్ఐఆర్ (స్టేట్ ఐడెంటిటీ రిజిస్టర్)ప్రక్రియను వ్యతిరేకిస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ ఆరోపించారు. తన ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే మమతా బెనర్జీ సర్కార్ ఇలా చేస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో టీఎంసీ పాలనలో అదుపులేని అక్రమ వలసల వల్ల అనేక ప్రాంతాల్లో హిందువులు మైనారిటీలుగా మారిపోయారని పేర్కొన్నారు. కోల్‌కతాలోని బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన భారీ బహిరంగ సభలో మాట్లాడిన మోదీ, టీఎంసీపై విమర్శల వర్షం కురిపించారు.మరోవైపు, మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాల కోసం హిందూ శరణార్థులకు పౌరసత్వం కల్పించడాన్ని అడ్డుకుంటోందని మోదీ - మిగతా 2 లో

## ఏపీలో ఆరు నెలల్లో
## స్థానిక ఎన్నికలు


2 లో

- చంద్రబాబు సర్కార్ కీలక నిర్ణయం
- ఏపీలో మరోసారి ఎన్నికల వాతావరణం నెలకొననుంది
- రాబోయే స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపు బాధ్యతను ఇన్‌ఛార్జ్ మంత్రులు తీసుకోవాలని ఆయన స్పష్టమైన ఆదేశాలు జారీ
- క్షేత్రస్థాయిలో పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు
- ప్రస్తుతం ఉన్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యుల పదవీకాలం 2026 మార్చి-ఏప్రిల్ నాటికి ముగియనుంది


2 లో

## '58 రోజులు 58 అడుగులు'

- 16న అమరావతిలో పొట్టి శ్రీరాములు విగ్రహావిష్కరణ
- రాజధాని అమరావతిలో అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహం
- పొట్టి శ్రీరాములు 58 రోజుల దీక్షకు ప్రతీకగా 58 అడుగుల విగ్రహం
- పొట్టి శ్రీరాములు 125వ జయంతి ఉత్సవాల ముగింపు సందర్భంగా విగ్రహావిష్కరణ

## మీ కష్టాలు
# వినేందుకే వచ్చా

- గిరిజనుల మధ్య జనసేన ఆవిర్భావ దినోత్సవం
- ప్రజల సమస్యలు తెలుసుకున్న జనసేనాని
- అల్లూరి జిల్లాలో జనసేన పార్టీ పతాకాన్ని ఆవిష్కరించిన పవన్
- ఓసూరు నుంచి నందిగరువుకు కాలినడకన వెళ్తూ రోడ్డు పనులు పరిశీలన
- తాగునీటి వసతులను గిరిజనుల నుంచి అడిగి తెలుసుకున్న పవన్
- 'ఎవరికి ఏ సమస్య ఉన్నా నాతో పంచుకోండి'
- మీ కష్టాలు వినేందుకే వచ్చా' అని జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గిరిజనులకు స్పష్టం
- ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కి ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ శుభాకాంక్షలు



**వార్త సంధ్య, అమరావతి, మార్చి 14 :**
'ఎవరికి ఏ సమస్య ఉన్నా నాతో పంచుకోండి. మీ కష్టాలు వినేందుకే వచ్చా' అని జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గిరిజనులకు స్పష్టం చేశారు. అల్లూరి జిల్లాలో గిరిజనుల మధ్యే జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పవన్ నిర్వహించారు. అడవితల్లి బాట పథకంలో భాగంగా నిర్మించిన రహదారుల పరిశీలనకు పాడేరు మండలం నందిగరువు గిరిజన గ్రామానికి - మిగతా 2 లో

# సంపాదకీయం

## తిప్పలు తప్పని యుద్ధం

ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు మొదలెట్టిన దురాక్రమణ యుద్ధం పదకొండో రోజుకు చేరుకోగా 'ఇంకెంత... త్వరలోనే అది పరిసమాప్తమవుతుంద'ంటూ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూలు మంగళవారం చేసిన ప్రకటనల్ని ఇరాన్ పరిహసించింది. కాల్పుల విరమణకూ, లేదా చర్చల పునఃప్రారంభానికీ అవకాశమే లేదని తేల్చిచెప్పింది. చరిత్ర చెప్పే పాఠం గ్రహించకుండా దుందుడుకు పోకడలకు పోయిన ట్రంప్... మరిన్ని భీకర దాడులకు దిగితే ఇరాన్ సాష్టాంగపడుతుందని భ్రమపడుతున్నారు. ఇప్పటికే బ్రిటన్‌లోని ఫెయిర్‌ఫోర్డ్ స్థావరానికి అరివీర భయంకర యుద్ధ విమానంగా అమెరికా చెప్పుకుంటున్న బి52 బాంబర్‌లు చేరుకున్నాయని బ్రిటన్ మీడియా పతాక శీర్షికలతో గొంతు చించుకుంటోంది. కనుక అది చేసే విధ్వంసం కూడా అసాధారణమైనదే కావొచ్చు. కానీ సంకల్ప బలం దండిగా ఉన్న పక్షాన్ని ఇలాంటి విధ్వంసక శక్తి ఏమాత్రం లొంగదీయలేదు. జయాపజయాలను అంతిమంగా నిర్ణయించేది మనుగడ కోసం పోరాడే మనుషులే తప్ప యుద్ధక్షేత్రంలోని ఆయుధాలు కాదు. రెండు వేల ఏళ్ల క్రితం మధ్యధరా సముద్రంపై ఆధిపత్యం కోసం రోమ్ సామ్రాజ్యం ఆర్థికంగా ఎదుగుతున్న అప్పటి కార్తేజ్ నగరాన్ని ధ్వంసం చేయటానికి సాకులు వెతికేది. అది క్షీణించినా... అప్పటి రోమన్ సెనెటర్ కాటో ఏ సమస్యపై చర్చ మొదలెట్టినా కార్తేజ్‌పై.. కత్తిదూయటం అవసరమంటూ ప్రసంగం ముగించేవాడంటారు. కనీసం కార్తేజ్‌కు రోమ్‌పై దండయాత్ర చేసిన చరిత్రయినా ఉంది. కానీ ఇరాన్‌కు కనీసం ఆ నేపథ్యమైనా లేదు. అయినా అమెరికా, దాని మిత్ర దేశం ఇజ్రాయెల్ అకారణంగా దానిపై విరుచుకుపడటం అలవాటుగా చేసుకున్నాయి. నిరుడు అధికారంలోకొచ్చిన ఆర్నెల్లకే ట్రంప్ అకారణంగా ఇరాన్‌పై 12 రోజులపాటు యుద్ధం సాగించారు. ఈసారి ఒప్పందానికి చేరువలో ఉన్నామని అమెరికా బృందం ప్రకటించిన మర్నాడే దురాక్రమణకు పూనుకున్నారు. ఇరాన్ తదుపరి అధినేతను తానే నిర్ణయించగలనంటూ ట్రంప్ ప్రకటించిన రెండు రోజులకే అలీ ఖమేనీ కుమారుడు మొజ్తబా ఖమేనీని ఎంపిక చేసినట్టు ఆ దేశం ప్రకటించింది. ఇరాన్ మౌలిక సదుపాయాలను ధ్వంసం చేయటం అమెరికా, ఇజ్రాయెల్ దేశాలకు కష్టం కాకపోవచ్చు. కానీ అవి రెండూ యుద్ధం కారణంగా తీవ్రంగా దెబ్బతినటం ఖాయం. యుద్ధం దుష్ప్రభావం స్టాక్ మార్కెట్ పల్టీలు దాటి సాధారణ జనజీవనంపై పడటం మొదలైంది. మన దేశంలో అనేక నగరాల్లో హోటళ్లు, రెస్టారెంట్లు కమర్షియల్ గ్యాస్ కొరత కారణంగా మూతబడ్డాయని వార్తలందుతున్నాయి. బాస్మతి బియ్యం, పండ్లు, కూరగాయల ఎగుమతులు నిలిచిపోయి రైతాంగం నానాకష్టాలూ పడుతోంది. పశ్చిమాసియా దేశాల్లోని దాదాపు కోటిమంది తెలుగు రాష్ట్రాల ప్రజలు ఏమాత్రం వెసులుబాటు దొరికినా స్వస్థలాలకు చేరుకోవాలని ఆత్రుత పడుతున్నారు. హోర్ముజ్ జలసంధి దిగ్బంధంతో వందలాది చమురు, గ్యాస్ రవాణా నౌకలు నిలిచిపోగా, సౌదీ అరేబియా చమురు ఉత్పత్తిపై కోత విధించటంతో బ్యారెల్ చమురు ధర దాదాపు నాలుగేళ్ల గరిష్ఠ స్థాయికి... అంటే వంద డాలర్లకు చేరుకుని భయపెడుతోంది. అది 120 డాలర్లకు చేరుకుంటే తప్ప దేశంలో చమురు ధరలు పెరగబోవని కేంద్రం చెప్పటం స్వల్ప ఊరట.యుద్ధానికి ముందే ట్రంప్ విధానాల పర్యవసానంగా అమెరికా ఆర్థిక వ్యవస్థ గుడ్లు తేలేయటం మొదలుపెట్టింది. ఈ యుద్ధం దాన్ని మరింత కుంగదీస్తుంది. పాశ్చాత్య దేశాలతో ఇప్పటికే దానికున్న పొరపొచ్చాలు పెరగటంతోపాటు పశ్చిమాసియ దేశాలు సైతం మునుపటి మాదిరి అమెరికాకు 'బ్లాంక్ చెక్' ఇచ్చే అవకాశం లేదు. తమ దగ్గరున్న అమెరికా స్థావరాల పరిధులేమిటో, పరిమితులెలా ఉండాలో అవి నిర్ణయిస్తాయి. తాను శత్రువనుకున్న దేశంపై ఏకపక్షంగా దాడులు చేయటానికి అనుమతించబోవు. 'ఇరాన్‌తో యుద్ధం అంతులేనిదీ, దీర్ఘకాలం సాగేదీ కాదు...' అంటూ అమెరికా యుద్ధ శాఖ మంత్రి పీట్ హెగ్సెత్ సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. కానీ ఆయనకు తెలియాల్సింది ఏమంటే... దాన్ని మొదలెట్టింది తామే అయినా ముగింపు నిర్ణయించేది ఇరాన్ మాత్రమే!

## మీ కష్టాలు వినేందుకే వచ్చా

**మొదటిపేజీ తరువాయి** – వచ్చిన ఆయన దారి పొడవునా గిరిపుత్రులతో మమేకమ య్యారు. జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఈసారి ప్రజల మధ్యలోనే నిర్వహించాలని నిర్ణయించిన అధినేత పవన్‌కల్యాణ్ ఈ క్రమంలో గిరిజనుల చెంతకు వచ్చారు. అడవితల్లి బాట పథకంలో భాగంగా నిర్మించిన రహదారులు పరిశీలనతో గిరిపుత్రుల బాగోగులు తెలుసుకునేందుకు ఆయన అల్లూరి జిల్లాలో పర్యటించారు. ముందుగా అల్లూరి జిల్లా ఓనూరు నుంచి నందిగరువుకు కాలినడకన పయనమైన పవన్‌కల్యాణ్ మార్గమధ్యలో పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఓనూరు జంక్షన్ వద్ద పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. పవన్ వెంట పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, అరకు పార్లమెంటు ఇంఛార్జి గంగులయ్య, నేతలు, పార్టీ కార్యకర్తలు ఉన్నారు.ఆ తర్వాత మార్గ మధ్యలో రోడ్డు పనులను పరిశీలించారు. నందిగరువు జంక్షన్, రోడ్డు, తాగునీటి గురించి స్థానికులు మాట్లాడారు, పిల్లలకు బ్యాగులు అందజేశారు. గిరిజనుల తాగునీటి వసతి సౌకర్యాలను స్వయంగా పరిశీలించారు.అల్లూరి జిల్లా నందిగరువులో పార్టీ పతాకాన్ని పవన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గిరిజన కళాకారుల థింసా నృత్యాన్ని పవన్‌కల్యాణ్ ఆస్వాదించారు. పవన్ సమక్షంలో పలువురు జనసేనలో చేరారు. వారికి జనసేన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఓనూరులో అంగన్వాడీ సెంటర్‌ను సందర్శించి చిన్నారులతో ముచ్చటించారు. గర్భిణి స్త్రీలకు పౌష్టికాహారం అందించారు."గత ప్రభుత్వం కనీసం సమస్యలు కూడా విన్న పరిస్థితులు లేవు. మీరెవరూ నన్ను కలిసి రోడ్లు వేయాలని కోరలేదు. మీ కష్టాలు చూసే రహదారుల నిర్మాణానికి ఉపక్రమించా. సరైన రహదారి లేకుండా ఇబ్బంది పడుతుంటే చూసి తట్టుకోలేకపోయా. ఎవరికి ఏ సమస్య ఉన్నా నాతో పంచుకోండి. ప్రజల కష్టాలు విని పరిష్కరించేందుకు మీ ముందుకొచ్చా.శుభాకాంక్షలు తెలియజేసిన సీఎం చంద్రబాబు: జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ అధ్యక్షులు, ఉపముఖ్య మంత్రి పవన్ కల్యాణ్ కి ముఖ్యమంత్రి చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిలో, తెలుగు ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో జనసేన పోషిస్తున్న పాత్ర అభినందనీయమని కొనియాడారు. ప్రజలకు అండగా నిలుస్తూ వారి భవిష్యత్ కోసం పనిచేస్తున్న జనసైనికులకు, వీరమహిళలకు, నేతలకు సీఎం ఈ సందర్భంగా శుభాభినందనలను తెలిపారు. మంత్రి లోకేశ్ విషెస్: జనసేన 13వ ఆవిర్భావ దినోత్సవం సందర్భ ంగా మంత్రి నారా లోకేశ్ శుభాకాంక్షలు తెలిపారు. జనసేన ఏడు సిద్ధాంతాలతో ప్రజా జీవితాల్లో భాగం కావడం చాలా సంతోషమని మంత్రి అన్నారు. ఈ శుభ సందర్భంలో జనసేనాని పవనన్నకు, నేతలు, కార్యకర్తలకులోకేశ్ హృదయపూర్వక అభినందనలను తెలియజేశారు.

## ఏపీలో ఆరు నెలల్లో స్థానిక ఎన్నికలు

**మొదటిపేజీ తరువాయి** – ఏపీలో మరోసారి ఎన్నికల వాతావరణం నెలకొననుంది. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలను రానున్న ఆరు నెలల్లో నిర్వహించేందుకు సీఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం సిద్ధమవుతోంది. మంత్రివర్గ సమావేశం అనంతరం మంత్రులతో ప్రత్యేకంగా భేటీ అయిన చంద్రబాబు ఈ కీలక ప్రకటన చేశారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపు బాధ్యతను ఇన్‌ఛార్జ్ మంత్రులు తీసుకోవాలని ఆయన స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.క్షేత్రస్థాయిలో పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు, సమన్వయం వంటి అంశాలపై ఎప్పటికప్పుడు స్పష్టతనిస్తామని, ఏ ఎన్నిక జరిగినా కూటమి జెండా ఎగరడమే లక్ష్యంగా పనిచేయాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. ప్రస్తుతం ఉన్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు, మున్సిపల్ పాలకవర్గాలు 2021 మార్చిలో జరిగిన ఎన్నికల ద్వారా కొలువుదీరాయి. వీరి ఐదేళ్ల పదవీకాలం 2026 మార్చి-ఏప్రిల్ నాటికి ముగియనుంది. ఈ నేపథ్యంలో గడువు ముగియకముందే ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో జరిగిన విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని తిరిగి గాడిన పెడుతున్నామని, 2026-27 ఆర్థిక సంవత్సరం రాష్ట్ర అభివృద్ధిలో ఒక మైలురాయిగా నిలవాలని సీఎం ఆకాంక్షించారు.ఈ సమావేశంలో పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచే దిశగా చంద్రబాబు మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరం నుంచి మంత్రులు, కార్యదర్శుల పనితీరుపై ఏప్రిల్ 2న రహస్య నివేదికలు (కాన్ఫిడెన్షియల్ రిపోర్టులు) ఇవ్వనున్నట్లు ప్రకటించారు. నిర్దేశిత లక్ష్యాల సాధన, దస్త్రాల పరిష్కారం, కేంద్రం నుంచి నిధులు రాబట్టడంలో చూపిన చొరవ ఆధారంగా ఈ రిపోర్టులు ఉంటాయని వివరించారు. మంత్రు లు సచివాలయానికే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయి పర్యటనలు చేసి ప్రజలతో మమేకం కావాలని సూచించారు.అయితే, ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడ ంలో కొందరు మంత్రుల వైఖరిపై సీఎం చంద్రబాబు అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. "మనం చేసిన మంచి పనులను ప్రజలకు చెప్పుకోకపోతే ఎలా?" అని ఆయన నేరుగా ప్రశ్నించారు. ముఖ్యంగా సామాజిక మాధ్యమాలను సమర్థంగా వినియోగించుకోవడంలో మంత్రులు వెనుకబడ్డారని, సాంకేతికతను అందిపుచ్చుకోకపోతే మెరుగైన ఫలితాలు సాధించలేమని హెచ్చరించారు. పార్టీ కార్యాలయం నుంచి వచ్చే సమాచారాన్ని సోషల్ మీడియాలో వేగంగా ప్రచారం చేయాలని మంత్రి నారా లోకేశ్ కూడా ఇదే సందర్భంగా సూచించడం గమనార్హం.

## '58 రోజులు-58 అడుగులు'

**మొదటిపేజీ తరువాయి** – రాజధాని అమరావతిలో పొట్టి శ్రీరాములు విగ్రహం ఆవిష్కరణకు సిద్ధమవుతోంది. పొట్టి శ్రీరాములు 125వ జయంతి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఈనెల 16న విగ్రహాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆవిష్కరిస్తారు. అమరావతిలో ఏర్పాటవుతున్న పొట్టి శ్రీరాములు స్మారక కేంద్రానికి సంబంధించి కేవలం 5 నెలల్లోనే విగ్రహ ఏర్పాటుతో పాటు మొదటి దశ నిర్మాణం పూర్తి కావటం విశేషం.

**58 అడుగుల కాంస్య విగ్రహం :** తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం ఉండాలని కోరుతూ ఆత్మార్పణ చేసిన పొట్టి శ్రీరాములు త్యాగనిరతిని బావి తరాలకు తెలియ చేసేందుకు కూటమి ప్రభుత్వం ముందుకు వచ్చింది. అమరావతి రాజధానిలో 'స్టాచ్యూ ఆఫ్ శాక్రిఫైస్' పేరుతో పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్మృతివనం నిర్మాణం జరుగుతుంది. పొట్టి శ్రీరాములు 125వ జయంత్యుత్సవాల ముగింపు సందర్భం ఈనెల 16వ పొట్టి శ్రీరాములు విగ్రహ అవిష్కరణ జరగనుంది. తెలుగు రాష్ట్రం కోసం ఆయన 58 రోజులపాటు నిరాహార దీక్ష చేసినందిని గుర్తుగా 58 అడుగుల కాంస్య విగ్రహం రూపుదిద్దుకుంటోంది. కృష్ణా జిల్లా బొమ్ములూరుకు చెందిన కళాకారులు విగ్రహ భాగాలకు ఆకృతినిస్తూ, దశల వారీగా అమరావతికి తరలిస్తున్నారు.

**విగ్రహం లోపల 70 టన్నుల ఇనుప గడ్డర్లు :** రెండంతస్తుల వేదికపై అమరజీవి పొట్టి శ్రీరాముల విగ్రహాన్ని నిర్మిస్తున్నారు. వేదిక, విగ్రహం కలిపి మొత్తం ఎత్తు 110 అడుగులు ఉంటుంది. వేదిక నిర్మిత ప్రాంతం 17 వేల చదరపు అడుగులు ఉంటుంది. గ్రౌండ్ ఫ్లోర్లో 100 మంది కూర్చునేలా మినీ థియేటర్, మ్యూజియం, లైబ్రరీ ఉంటాయి. మొత్తం బరువు 100 టన్నులు కాగా, విగ్రహాన్ని 30 టన్నుల కంచుతో తయారు చేస్తున్నారు. పీఠంపై విగ్రహాన్ని నిలబెట్టేందుకు లోపల 70 టన్నుల బరువైన ఇనుప గడ్డర్లు వాడుతున్నారు. మొదటి దశలో భాగంగా మార్చి 16 నాటికి రెండంతస్తుల వేదిక, విగ్రహం సిద్ధం చేసి విగ్రహావిష్కరణ చేస్తారు. రెండో దశలో మరో 2,000 సీటింగ్ సామర్థ్యంతో ఆడిటోరియం, పార్క్ అభివృద్ధి చేస్తారు.

**'స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైజ్'గా నామకరణం :** పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ దినం(డిసెంబరు 15) సందర్భంగా అమరావతిలో పొట్టిశ్రీరాములు స్మృతి వనం ఏర్పాటు చేస్తున్నట్లు గత ఏడాది సీఎం చంద్రబాబు తెలిపారు. పొట్టి శ్రీరాములు 58 రోజుల దీక్షకు గుర్తుగా రాజధానిలో 58 అడుగుల విగ్రహం ఏర్పాటు చేస్తామన్నారు. ఈ విగ్రహం స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైజ్‌గా నిలుస్తుందని స్పష్టం చేశారు. పొట్టి శ్రీరాములకు గుర్తింపు కోసం పోరాడిన ఏకైక పార్టీ తెలుగుదేశం అని తేల్చిచెప్పారు. పొట్టి శ్రీరాములు ప్రాణాలు వదిలిన భవనాన్ని అన్ని విధాలా పరిరక్షిస్తామని తెలిపారు. నెల్లూరులో పొట్టిశ్రీరాములు పుట్టిన ఇంటిని ఓ మెమోరియల్‌గా తీర్చిదిద్దుతామని సీఎం ప్రకటించారు. తెలుగు జాతిని నెంబర్-1గా నిలబెట్టినప్పుడే పొట్టిశ్రీరాములుకు నిజమైన నివాళి అని గుర్తు చేశారు."రాజధాని అమరావతిలో 58 అడుగుల పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహం ఏర్పాటు చేయటం చాలా సంతోషంగా ఉంది. తెలుగు ప్రజలు బాగుండాలని 58 రోజులపాటు కఠోర దీక్షను చేసి తన ప్రాణాలను ఆత్మార్పణ చేశారు పొట్టి శ్రీరాములు. అలాంటి వ్యక్తికి ఒక స్మృతివనం, దీక్షకు గుర్తుగా 58 అడుగుల విగ్రహం పెట్టాలని అమరజీవి పొట్టి శ్రీరాములు ట్రస్టు తరఫున సీఎం చంద్రబాబును కోరాం. వెంటనే రాజధానిలో 6.8 ఎకరాల భూమి కేటాయించారు. అనంతరం మంత్రి నారా లోకేశ్ శంకుస్థాపన చేసిన రోజు నుంచి కేవలం 5 నెలల్లోనే విగ్రహ ఏర్పాటుతో పాటు మొదటి దశ నిర్మాణం పూర్తి చేశాం. 125వ జయంతి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఈనెల 16న విగ్రహాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆవిష్కరిస్తారు." – దూండి రాకేష్, అమరజీవి పొట్టి శ్రీరాములు ట్రస్టు ఛైర్మన్

**6.8 ఎకరాల్లో మెమోరియల్ ట్రస్ట్ :** రాజధాని ప్రాంతంలోని శాఖమూరులో ప్రభుత్వం 6.8 ఎకరాల్లో పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్, స్మృతి వనాన్ని ఏర్పాటు చేస్తోంది. ఈ స్మృతి వనానికి గత ఏడాది మంత్రి నారా లోకేశ్ శంకుస్థాపన చేశారు. ఈ ఏడాది మార్చి 16న పొట్టి శ్రీరాములు 125వ జయంతి నాటికి ఈ స్మృతివనంలో 58 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో విగ్రహ డిజైన్లను ఇప్పటికే సీఎం చంద్రబాబు పరిశీలించారు. ఈ విగ్రహానికి 'స్టాచ్యూ ఆఫ్ శాక్రిఫైస్'గా నామకరణం చేశారు.

## లేని గ్యాస్ కొరతను సృష్టించి ప్రజలను భయపెడుతున్నారు

**మొదటిపేజీ తరువాయి** – గ్యాస్ కొరత, మూసీ ప్రాజెక్టు అంశాలపై ప్రభుత్వ తీరును తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు తీవ్రంగా ఎండగట్టారు. దేశంలో అసలు గ్యాస్ కొరత అనేదే లేదని స్పష్టం చేసిన ఆయన, కొంతమంది కావాలనే లేని కొరతను సృష్టించి ప్రజలను భయపెడుతున్నారని ఆరోపించారు. ప్రపంచవ్యాప్తంగా యుద్ధ పరిస్థితుల వల్ల అనేక దేశాల్లో ఇంధన ధరలు ఆకాశాన్ని తాకుతున్నా, ప్రధాని మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం భారత్‌లో ధరలను నియంత్రణలో ఉంచిందని గుర్తుచేశారు. గతంలో రూ. 1,200 వరకు ఉన్న గ్యాస్ ధరను రూ. 900లకు తగ్గించి సామాన్యుడిపై భారం తగ్గించిన ఘనత కేంద్రానిదేనని ఆయన ధీమా వ్యక్తం చేశారు.ఇక మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు విషయంలో బీజేపీ వైఖరిని స్పష్టం చేస్తూ, తాము నది శుద్ధికి వ్యతిరేకం కాదని, కానీ ప్రాజెక్టు పేరుతో పేదల ఇళ్లను కూల్చడాన్ని మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని రాంచందర్ రావు హెచ్చరించారు. మూసీ ప్రాజెక్టు కోసం 50 మీటర్ల బఫర్ జోన్ అవసరమే లేదని, కేవలం ఒక గాంధీ విగ్రహం ఏర్పాటు కోసం 100 ఎకరాల భూమిని సేకరించాలని చూడటం విడ్డూరంగా ఉందని ఆయన విమర్శించారు. గుజరాత్‌లో సబర్మతి ప్రాజెక్టును ఎవరికీ నష్టం కలగకుండా ఏ విధంగా పూర్తి చేశారో ప్రభుత్వం గమనించాలని సూచించారు.

## మమత సర్కార్‌కు కౌంట్‌డౌన్ ప్రారంభమైంది

**మొదటిపేజీ తరువాయి** – ఆరోపించారు. హిందూ శరణార్థులు తమకు ఓటు వేయరనే కారణంతోనే తృణమూల్ కాంగ్రెస్ ఇలా చేస్తోందని అన్నారు. ఎన్నికల కమిషన్ లాంటి రాజ్యాంగబద్ధమైన సంస్థలపై టీఎంసీ దాడులకు దిగడం సిగ్గుచేటని మోదీ వ్యాఖ్యానించారు. ప్రభుత్వ, రాజ్యాంగ సంస్థలను నిర్వీర్యం చేస్తోన్న, బంగాల్‌కు 'మహా జంగిల్‌రాజ్' పాలనను తీసుకొచ్చిన మమతా సర్కార్‌కు కౌంట్‌డౌన్ ప్రారంభమైందని అన్నారు. నిరంకుశ టీఎంసీ ప్రభుత్వం ఎంత ప్రయత్నించినా, 'మార్పు అనే తుపాను'ను ఆపలేదని పేర్కొన్నారు. బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లోని భారీ జనసమూహమే ఇందుకు నిదర్శనమన్నారు. బంగాల్‌లో మళ్లీ చట్టబద్ధమైన పాలన వస్తుందని, అప్పుడు దురాగతాలకు పాల్పడిన టీఎంసీ నాయకులను వదిలిపెట్టబోమని హెచ్చరించారు.

### ఎన్నికల వేళ ఘాటు విమర్శలు

'టీఎంసీ ప్రభుత్వం తాను పనిచేయదు, ఇతరులు పనిచేయడానికి అనుమతించదని, అందుకే బంగాల్‌లో అనేక కేంద్ర పథకాలు నిలిచిపోయాయని' మోదీ ఆరోపించారు. బంగాల్‌లో మార్పు ఆసన్నమైందని గ్రహించిన టీఎంసీ కలవరపడుతోందన్నారు. అందుకే ఈ ర్యాలీకి రాకుండా ప్రజలను అడ్డుకునే ప్రయత్నం చేసిందని ఆరోపించారు. అయితే ఎన్ని వ్యూహాలు పన్నినప్పటికీ ప్రజలు ర్యాలీకి హాజరుకాకుండా మమతా సర్కార్ ఆపలేకపోయిందని ఎద్దేవా చేశారు. అంతేకాదు, టీఎంసీ ప్రభుత్వం మహిళలపై అత్యాచారాలకు పాల్పడేవారికి రక్షణ కల్పిస్తోందని, ఇందుకు సందేశ్‌ఖలి, ఆర్‌జీ కర్ ఘటనే నిదర్శనమని అన్నారు. టీఎంసీ ప్రజావ్యతిరేక విధానాల వల్ల, చంద్రకోనకు చెందిన బంగాళాదుంప రైతులు బలవన్మరణానికి పాల్పడ్డారని అన్నారు.రాష్ట్రపతి ద్రౌపది ముర్మును అవమానించి, టీఎంసీ అన్ని హద్దులూ దాటేసిందని మోదీ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'టీఎంసీ కేవలం రాష్ట్రపతినే కాదు, దేశంలోని గిరిజనులను, ప్రజలను, రాజ్యాంగాన్ని అవమానించింది' అని విమర్శించారు. బంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మోదీ, మమతా సర్కార్‌ను లక్ష్యంగా చేసుకుని ఈ ఘాటు వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

### ఎన్నికల కోసం- అభివృద్ధి పనులు!

త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ శనివారం బంగాల్‌లో రూ.18,680 కోట్ల విలువైన రవాణా, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశాభివృద్ధిలో ఒక కొత్త అధ్యాయం ఈ బంగాల్ నుంచే లిఖించబడుతోందని పేర్కొన్నారు. అలాగే ఖరగ్‌పూర్-మోరెగ్రామ్ ఎకనామిక్ కారిడార్‌కు కూడా ఆయన శంకుస్థాపన చేశారు.231 కి.మీ పొడవుతో, నాలుగు వరుసల్లో, ఐదు విభాగాలుగా ఈ ఖరగ్‌పూర్-మోరెగ్రామ్ ఆర్థిక కారిడార్‌ను నిర్మించనున్నారు. దీని వల్ల సుమారు 120 కి.మీ దూరం తగ్గుతుంది. దాదాపు 7-8 గంటల సమయం ఆదా అవుతుంది. ఈ రహదారి పశ్చిమ మేదినీపూర్, బంకురా, హుగ్లీ, పూర్బా బర్ధమాన్, బీర్భూమ్, ముర్షిదాబాద్ జిల్లాల గుండా వెళ్తుంది. ఈ కారిడార్ ఎన్‌హెచ్-16, ఎన్‌హెచ్-19, ఎన్‌హెచ్ -14, ఎన్‌హెచ్-12 వంటి కీలక జాతీయ రహదారులను కలుపుతూ, మల్టీ-కారిడార్ కనెక్టివిటీని బలోపేతం చేస్తుందని అధికారులు చెబుతున్నారు.వీటితో పాటు ఎన్‌హెచ్-14పై 5.6 కి.మీ పొడవైన దుబ్రాజ్‌పూర్ బైపాస్ నిర్మాణానికి, అలాగే కంసాబతి, శిలాబతి నదులపై అదనపు నాలుగు వరుసల ప్రధాన వంతెనల నిర్మాణానికి మోదీ శంకుస్థాపన చేశారు. అంతేకాదు ఎన్‌హెచ్-19, ఎన్‌హెచ్-114 విభాగాలను కూడా ఆయన ప్రారంభించారు. ఇవి రోడ్డు భద్రతను మరింత పెంచి, ప్రయాణ సమయాన్ని, కాలుష్యాన్ని తగ్గిస్తాయని అధికారులు తెలిపారు.

## తెలంగాణ రాష్ట్రంలో ఆల్‌టైమ్ గరిష్ఠానికి విద్యుత్ వినియోగం

**మొదటిపేజీ తరువాయి** – తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ వినియోగం రికార్డు స్థాయికి చేరుకుంది. రాష్ట్రంలో ఈ నెల 13వ తేదీన 341 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం జరిగింది. దీనితో తెలంగాణలో వినియోగం ఆల్ టైమ్ గరిష్ఠానికి చేరుకుంది. వేసవి కాలంలో ఉష్ణోగ్రతలు అధికం కావడం, వ్యవసాయ రంగానికి విద్యుత్ వినియోగం పెరగడంతో రాష్ట్రంలో రోజురోజుకీ విద్యుత్ డిమాండ్ పెరుగుతోంది.ఇదిలా ఉండగా, రాష్ట్రంలో భవిష్యత్తు అవసరాలకు సిద్ధంగా ఉన్నట్లు తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందిలేకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేసిన సిబ్బందికి ఆయన అభినందనలు తెలియజేశారు.

## బీసీల రక్షణ కోసం ప్రత్యేక చట్టం



**మొదటిపేజీ తరువాయి** – రక్షణ కోసం ప్రత్యేక చట్టాన్ని తీసుకురాబోతున్న రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలవబోతుందని మంత్రి తెలిపారు. ఇది బీసీల గౌరవాన్ని కాపాడటంతో పాటు వారి సామాజిక, ఆర్థిక అభివృద్ధికి కూడా దోహదం చేస్తుందని పేర్కొన్నారు. బీసీలను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆమె స్పష్టం చేశారు. ఈ చట్టం రూపకల్పనలో బీసీ సంఘాల అభిప్రాయాలకు ప్రాధాన్యం ఇస్తామని మంత్రి తెలిపారు. గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు ఉన్న బీసీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, మేధావులు అందరి సూచనలు తీసుకొని చట్టాన్ని మరింత బలంగా రూపొందించనున్నట్లు చెప్పారు. చట్టం అమలులో ఎలాంటి లోపాలు లేకుండా ముందుగానే అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని అన్నారు.ఈ సమావేశంలో చర్చించిన అంశాలు, తీసుకున్న నిర్ణయాలపై పూర్తి వివరాలను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లనున్నట్లు మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రితో చర్చించిన అనంతరం త్వరలోనే ఈ చట్టానికి సంబంధించి తదుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.బీసీల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారి హక్కులు, గౌరవం కాపాడే దిశగా మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు కూడా చేపడతామని మంత్రి సవిత తెలిపారు. ఈ చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత బీసీలపై జరిగే అన్యాయాలకు అడ్డుకట్ట పడుతుందని, సమాజంలో సమానత్వం పెంపొందుతుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

## మూసినదిని పునరుజ్జీవనం చేయాలి

**మొదటిపేజీ తరువాయి** – అనంతరం మీడియాతో మాట్లాడారు. తాను ప్రతి రోజు హైదరాబాద్ - విజయవాడ 10లేన్ల జాతీయ రహదారి విస్తరణపై సంప్రదింపులు జరపడంతో పాటు, సమీక్షలు జరుపుతున్నామని కేంద్రం నుంచి అన్ని రకాల అనుమతులు రావడం కోసం కాస్త ఆలస్యం అయిందని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. ఈ ప్రాంతంలో విద్యా, ఇతర పనుల నిమిత్తం ఎక్కువ గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చి స్థిరపడ్డ వారు ఎక్కువ ఉంటారన్నారు. గతంలో హైదరాబాద్ ఎల్బీనగర్ నుంచి మల్కాపూర్ రోడ్డు కోసం కృషి చేశానన్నారు. ఎల్బీనగర్ నుంచి హయత్ నగర్ రేడియో స్టేషన్ వరకు డబుల్ డెక్కర్ నిర్మాణం రాబోతుందని మంత్రి తెలిపారు.నాగపూర్‌లో 8 కిలోమీటర్ల తర్వాత అతిపెద్ద డబుల్ డెక్కర్ నిర్మాణం మన ప్రాంతంలో 6 కిలోమీటర్ల వరకు నిర్మిస్తున్నాం అన్నారు. సుమారు రూ.940 కోట్లతో నిర్మిస్తున్న ఈ డబుల్ డెక్కర్ కారిడార్‌లో రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ.200 కోట్లు చెల్లించేందుకు ఇప్పటికే ఆదేశాలు జారీ అయ్యాయన్నారు. త్వరలో దీనికి సంబంధించిన సమావేశాలు ఉంటాయన్నారు. ఈ డబుల్ డెక్కర్ కారిడార్‌లో పైన మెట్రో రైలు, నేషనల్ హైవే, కింద స్థానికులు వాహనాలు క్రాస్ చేసేందుకు యాక్సిడెంట్స్‌కు ఆస్కారం లేకుండా వెహికిల్ అండర్ పాస్‌లు ఏర్పాటు చేస్తున్నామని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. వచ్చే నెలలో టెండర్లు పూర్తి చేసి రహదారి విస్తరణ పనులు చేపట్టేలా ప్రణాళిక రూపొందించామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనుమతి తీసుకొని రైల్వే స్టేషన్ కలుపుతూ వేసే మరో రోడ్డు రూ.8 కోట్ల పనులకు త్వరలో శంకుస్థాపన చేస్తామన్నారు.మూసీ విషజలాలతో బాధపడుతున్న 40 లక్షల మంది బాధితుల గోస చూడండని, తమ నల్లగొండ ప్రజల ఆరోగ్యం గురించి మానవత్వంతో ఆలోచించండని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. మూసీ విష జలాలతో 30 ఏళ్లకే 60 ఏళ్ల మనుషుల లాగా మారిపోతున్నారని, ప్రజలు కిడ్నీ, క్యాన్సర్ లాంటి భయంకర వ్యాధులతో సతమతం అవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నల్లగొండ అంటేనే ఫ్లోరైడ్ జిల్లా విషపు జలాల జిల్లా అని పేరుందన్నారు. ఇక్కడి ప్రజల గోసను మానవత్వంతో అర్థం చేసుకోవాలని కోరారు. మూసి పునరుజ్జీవనం చేయాలని ఆలోచించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయం భవిష్యత్ తరాలకు మేలు చేస్తుందన్నారు. దాదాపు మూడు గంటల ప్రజెంటేషన్ చూసామని, తమ నల్లగొండ ప్రజల కష్టాలు ఎలా తొలగుతాయి అనేది కళ్లకు కట్టినట్లు చూసామన్నారు.గంగా నదిని, యమునా నదిని శుభ్రం చేస్తున్నారని, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ నాయకులు ఇది గమనించాలని విజ్ఞప్తి చేశారు. మురికి కూపంలా ఉన్న మూసిలో మంచి నీటిని పారేలా చేస్తామంటే అడ్డు కోవడం దేనికి అని ఆయన ప్రశ్నించారు. 10 వేల మంది ఇళ్లు కోల్పోతున్నారని, వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు తప్పకుండా చూస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ప్రజల ఆరోగ్యం కోసం చేస్తున్న మంచి పనిని ప్రతిపక్షాలు రాజకీయం చేయొద్దని విజ్ఞప్తి చేశారు. అభివృద్ధి, ప్రజా సంక్షేమమే తమ ప్రధాన ఎజెండా అని, మళ్లీ వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని స్పష్టం చేశారు. ఎవరెన్ని రాజకీయ విమర్శలు చేసినా ప్రజల ఆరోగ్యం కోసం ఆలోచిస్తున్న ప్రభుత్వమే కావాలని కోరుకుంటారన్నారు. ప్రజల ఆరోగ్యం మాకు ప్రధానం అని దానికి తాము కట్టుబడి ఉన్నామన్నారు.

## రెండు రోజుల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వానలు

"రానున్న రెండు రోజుల్లో ఎండ తీవ్రత గరిష్ఠ స్థాయికి చేరడంతో పాటు అక్కడక్కడ తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉంది. పలు ప్రాంతాల్లో మూడు రోజుల పాటు ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని" వాతావరణ శాఖ అధికారి శ్రీనివాస్ రావుతో ఈటీవీ భారత్ నిర్వహించిన ముఖాముఖిలో తెలిపారు.భద్రాచలంలో అత్యధికంగా 40.2 డిగ్రీలు నమోదయ్యింది. మహబూబ్‌నగర్ జిల్లాలో 40 డిగ్రీలుగా నమోదయ్యాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో 36 నుంచి 40 డిగ్రీల వరకు పగటి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.సాధారణ స్థాయికి మించిన ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంటుందని సీజనల్ ఫోర్‌కేస్ట్‌లో తెలిసింది. దీనికి అనుగణంగానే 3 నుంచి 4 డిగ్రీల వరకు అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వేసవిలో గాలి వీచే దిశలలో మార్పు కారణంగా ఉపరితల ఆవర్తనాలు, ద్రోణులు ఏర్పడి ఉరుములు మెరుపులతో కూడిన వానలు రావడం, వాతావరణం చల్లబడటం అనేది సాధారణ పరిణామం. రానున్న రెండు రోజుల్లో ఇవే పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందన్నారు శ్రీనివాస్ రావు.ప్రస్తుతం నగరంలో 36 నుంచి 39 వరకు ఉష్ణోగ్రతల నమోదుకు అవకాశం ఉంది. ఇదే పరిస్థితి మరో రెండు రోజులు కొనసాగనుందని వాతావరణ శాఖ అధికారి శ్రీనివాస్ రావు ఈటీవీ భారత్ నిర్వహించిన ఇంటర్వ్యూలో తెలిపారు.

RNI TGTEL/25/A5065
vaartha sandhya
వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు



## ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవి రెడ్డి సుధీర్ రెడ్డి



**ఎల్బీనగర్ ప్రతినిధి, మార్చ్ 14 (వార్త సంధ్య):** చంపాపేట డివిజన్ పరిధిలోని గాంధీ విగ్రహం దగ్గర ఎల్.బి.నగర్ నియోజకవర్గ భారస పార్టీ యువజన అధ్యక్షులు రవి ముదిరాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రాండ్ ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మతాలకు అతీతంగా పండుగలను సామరస్యంగా జరుపుకోవాలని ఆయన సూచించారు.ఇట్టి కార్యక్రమంలో పలువురు భారస నాయకులు,ముస్లిం బస్తి మసీదు కమిటీ పెద్దలు రిజ్వాన్ భాయ్,సలీంభాయ్ మరియు పలువురు ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

## శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో పాల్గొనాలని మంత్రి వాకిటి శ్రీహరికి ఆహ్వానం

**మినిస్టర్స్ క్వార్టర్స్‌లో మంత్రిని కలిసి ఆహ్వానించిన భద్రాచలం**

**శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఈవో, అర్చకుల బృందం**

**మంత్రి దంపతులను మంత్రోచ్చారణలతో ఆశీర్వదించిన ఆలయ అర్చకులు**

**బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని ఆహ్వానపత్రికను మంత్రి వాకిటి శ్రీహరికి అందజేసిన ఆలయ ఈవో**



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) మార్చి 14 :** రాబోయే మార్చి 27న జరిగే శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలో నిర్వహించనున్న శ్రీ సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి లివాకిటి శ్రీహరిలిని భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఈవో,ఆలయ అర్చకుల బృందం ఆహ్వానించింది. హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని కోరుతూ ఆహ్వానపత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మంత్రోచ్చారణలతో మంత్రి వాకిటి శ్రీహరి దంపతులను ఆశీర్వదించారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో జరిగే శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం దేశవ్యాప్తంగా ఉన్న భక్తులకు అత్యంత ప్రాధాన్యత కలిగిన ఆధ్యాత్మిక వేడుక అని ఆలయ అధికారులు తెలిపారు.ఆహ్వానాన్ని స్వీకరించిన మంత్రి వాకిటి శ్రీహరి భద్రాచలం శ్రీరాముని ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరికీ శాంతి, సౌభాగ్యం కలగాలని ఆకాంక్షించారు. మంత్రిని ఆహ్వానించిన వారిలో భద్రాచలం ఆలయం ఈవో దామోదర్, ఆలయ ఉప ప్రధానార్చకులు శ్రీనివాస రామానుజం, రామాయణంపారాయణుడు అంతర్వేదికృష్ణమాచార్య, ఏ ఈ ఓభవానీ రామకృష్ణలు ఉన్నారు.

## పదవ తరగతి పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ అంకిత్



**భద్రాద్రి జిల్లా బ్యూరో, మార్చ్ 14 (వార్తా సంధ్య) :** జిల్లాలో నిర్వహిస్తున్న పదవ తరగతి వార్షిక పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. శనివారం పాల్వంచ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరియు జిల్లా పరిషత్ ఉన్నత బాలికల అభ్యుదయ పాఠశాల పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షలు సక్రమంగా నిర్వహించబడుతున్నాయా అనే అంశాలను పరిశీలించి, పరీక్షా కేంద్రాలలో విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలు, సీసీ కెమెరాలు, తాగునీటి వసతి, ఫర్నిచర్ తదితర ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రాలలో విద్యార్థుల హాజరు వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లా పరిషత్ ఉన్నత బాలికల అభ్యుదయ పాఠశాలలో మొత్తం 210 మంది విద్యార్థులకు గాను 209 మంది హాజరుకాగా, ఒకరు గైహాజరయ్యారు. అలాగే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 135 మంది విద్యార్థులకు గాను 131 మంది హాజరుకాగా, నలుగురు గైహాజరయ్యారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురి కాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా పర్యవేక్షణ చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 12,740 మంది విద్యార్థులు నమోదు కాగా, వారిలో 12,701 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. 39 మంది విద్యార్థులు గైహాజరయ్యారు. రెగ్యులర్ విద్యార్థుల్లో 12,720 మందికి గాను 12,687 మంది హాజరుకాగా, 33 మంది గైహాజరయ్యారు. అలాగే ప్రైవేట్ అభ్యర్థుల్లో 20 మందికి గాను 14 మంది హాజరుకాగా, 6 మంది గైహాజరయ్యారు. జిల్లాలో మొత్తం హాజరు శాతం 99.74 శాతంగా నమోదైంది. పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 163 (బి) అమలులో ఉందని, అనుమతి లేని వ్యక్తులు పరీక్షా కేంద్రాల వద్ద గుమిగూడకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తూ పరీక్షలు సజావుగా నిర్వహించాలని తెలిపారు. ఈ తనిఖీలు కలెక్టర్ వెంట సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరామనవమి ఏర్పాట్లకు సి ఎస్ ఆర్ సంస్థల సహకారం అవసరం

**జిల్లా కలెక్టర్ అంకిత్ ఐఏఎస్**



**భద్రాద్రి జిల్లా బ్యూరో మార్చి 14 (వార్తా సంధ్య) :** భద్రాచలంలో ఈ నెల 27న నిర్వహించనున్న శ్రీరామ నవమి వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (జూ=) సంస్థల సహకారం అవసరమని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. శనివారం ఐ డి ఓ సి కార్యాలయంలో వివిధ సంస్థల ప్రతినిధులతో కలెక్టర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటీసీ, నావా లిమిటెడ్, కేటీపీఎస్, ఐసీఐసీఐ బ్యాంక్, యూనియన్ బ్యాంక్, సింగరేణి, టీజీ గ్రామీణ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు గతంలో అందించిన సహకారం, ఈ సంవత్సరం అందించనున్న సహాయంపై వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భద్రాచలంలో జరిగే శ్రీరామ నవమి వేడుకలకు లక్షలాది మంది భక్తులు తరలివస్తారని తెలిపారు. భక్తులకు తాగునీరు, అన్నదానం, వసతి, పారిశుధ్యం వంటి అవసరమైన సౌకర్యాలు మెరుగ్గా కల్పించేందుకు సి ఎస్ ఆర్ సంస్థలు తమవంతు సహకారం అందించాలని కోరారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం ఈఓతో సంప్రదించి అవసరమైన ఏర్పాట్ల వివరాలను సేకరించాలని ముఖ్య ప్రణాళిక అధికారి (సీపీఓ) సంజీవరావును ఆదేశించారు. ఆ అవసరాల మేరకు సి ఎస్ ఆర్ సంస్థల సహకారాన్ని సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో లీడ్ బ్యాంకు మేనేజర్ రామిరెడ్డి, వివిధ సంస్థల ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మూసి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.





**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) మార్చి 14 :** ప్రజల్ని ఆందోళనకు గురిచేసేలా కొంతమంది ఉద్దేశ పూర్వకంగా, మరికొందరు అసంపూర్ణ సమాచారంతో అర్ధసత్యాలను ప్రచారం చేస్తున్నారు అధికారాన్ని కాపలాదారుగా వినియోగిస్తాం తప్పడ ప్రజలపై ఆధిపత్యం చెలాయించడానికి కాదు అనేది మా ప్రభుత్వం నమ్ముతుంది అందుకే ముఖ్యమంత్రిగా ఒక బాధ్యతతో ఈ కార్యక్రమం ద్వారా వాస్తవాలను ప్రజలకు చెప్పాలని భావించాం మానవ నాగరికత నది చుట్టూనే అభివృద్ధి చెందింది ప్రపంచ దేశాలు అభివృద్ధి పథంలో నడుస్తుంటే.. మనం వెనకబడితే భవిష్యత్ తరం మనల్ని క్షమించదు అన్నివర్గాల మేధావులతో సమావేశమై ఎలాంటి అభివృద్ధి చేయాలనే అంశంపై సూచనలు తీసుకున్నాం 1908 మూసీ వరదలు నగరాన్ని ముంచెత్తాయి ఆ సమయంలో ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్యతో సంప్రదించి వరదల నియంత్రణకు హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్ రిజర్వాయర్లను నిజాం నిర్మించారు వందేళ్లుగా వరద ముప్పు నుంచి నగరాన్ని కాపాడటమే కాదు.. నగర ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఆ రిజర్వాయర్లు ఉపయోగపడుతున్నాయి. గొప్ప వారసత్వ సంపద కలిగిన ఈ నగరాన్ని ఇలాగే వదిలేద్దామా? నేను ఎవరినీ విమర్శించదలచుకోలేదు, కానీ విజ్ఞప్తి చేయదలచుకున్నాడపదేళ్లు రాష్ట్రాన్ని పరిపాలించిన వాళ్లు ఎందుకు మూసీ ప్రక్షాళన అడ్డుకుంటున్నారు? అభివృద్ధిని అడ్డుకోవడం సమస్యకు పరిష్కారం కాదు.. ఎందుకు అడ్డుకుంటున్నారో కారణం చెప్పండి.. ఏదైనా తప్పులు ఉంటే సూచనలు చేయండి. పాలకులు మారినా నగర అభివృద్ధి ఆగలేదుడ 1994 నుంచి ఇప్పటి వరకు పరిపాలనలో పాలసీ పెరాలసిస్ ఎప్పుడూ రాలేదు ఎంతో మంది ముఖ్యమంత్రులుగా పనిచేసినా కొంతమందినే గుర్తుంచుకుంటాం దార్శనికతతో అభివృద్ధి ప్రణాళికలు రచించి అభివృద్ధి చేసిన వారే చరిత్రలో గుర్తుంటారు ఆనాడు హైదరాబాద్ నగరాన్ని నిజాం ఎకనామిక్ జోన్ గా తీర్చిదిద్దారు అలాంటి నగరాన్ని కాపాడుకోవడం మన కర్తవ్యం మూసా, ఈసా నదుల సంగమం వద్ద మహాత్మా గాంధీ ఆనాడు అస్థికలు కలిపారు. అంతటి చరిత్ర ఉన్న బాపూ ఘాట్ ను ఎంతమంది పర్యాటకులు సందర్శిస్తున్నారు? కాలుష్యంతో మూసీ నది విషతుల్యంగా మారింది మానవ తప్పిదాలతో నల్లగొండ జిల్లా ప్రజలు శిక్ష అనుభవిస్తున్నారు. రంగారెడ్డి జిల్లాలో పుట్టిన మూసీ నది హైదరాబాద్ కు వచ్చే సరికి కాలుష్యమయంగా మారుతోంది మూసీకి, హైదరాబాద్ నగరానికి ఎంతో గొప్ప చరిత్ర ఉంది రాజకీయ ప్రయోజనాల కోసం ఆ చరిత్రను కాలగర్భంలో కలిపేద్దామా? లేక మూసీనదితో పాటు హైదరాబాద్ నగరాన్ని పునరుజీవింపజేసుకుందామా? ఎవరికో నష్టం కలిగించాలన్నది మా ప్రభుత్వ ఉద్దేశం కాదు.. మూసీ పరివాహక ప్రాంతంలో బుల్డోజర్లు తీసుకెళ్తున్నారని కొందరు అంటున్నారు కేంద్రం తెచ్చిన చట్టాన్ని అమలు చేస్తామంటే కొందరు అడ్డుపడతామంటున్నారు కేవలం ఇది మూసీ పునరుజ్జీవనం మాత్రమే కాదుడ మన సంస్కృతిని, చరిత్రను కాపాడుకోవడం అందులో భాగంగానే నల్ల చెరువు, బతుకమ్మ కుంట బమ్రుక్ ఉద్దౌలా వంటి చెరువులను పునర్దుద్ధరించాం ఇవాళ మూసీ పునరుజ్జీవనాన్ని అడ్డుకుంటున్నవారు మూసీ పరీవాహకంలో నివసించగలరా వాళ్లు ఉంటానంటే అన్ని సౌకర్యాలతో కంటైనర్ హౌస్ ఇస్తా.. మూడు నెలలు అక్కడ ఉండగలరా? ఎందుకు అభివృద్ధిని అడ్డుకుంటున్నారు.. పేదలకు సరైన మౌలిక వసతులు కల్పించొద్దా? బ్లూ కాలర్ జాబ్స్ క్రియేట్ చేయొద్దా? పర్యటక అభివృద్ధి జరగొద్దా? నైట్ ఎకానమి అభివృద్ధి చెందొద్దా? అభివృద్ధిని అడ్డుకుని ఇంకా వెనక్కి రాతి యుగాల వైపు వెళ్ళిపోదామా నిజాం చేసినదాంట్లో పది శాతం కూడా మనం చేయకపోతే చరిత్ర మనల్ని క్షమిస్తుందా? బ్యూటిఫికేషన్.. లూటిఫికేషన్ అని కొందరు మాట్లాడుతున్నారు. 5 వేల కోట్లతో గాంధీ విగ్రహం అంటూ సొంత తెలివి ప్రదర్శిస్తున్నారు ఎంత పెద్ద యుద్ధాన్నైనా శాంతితో గెలవచ్చని మహాత్మా గాంధీ నిరూపించారు. అలాంటి మహాత్ముడి సిద్ధాంతాలను ముందుకు తీసుకెళ్ళాల్సిన బాధ్యత మనపై లేదా? మన చరిత్రను తిరిగి రాసుకునే అవకాశాన్ని మనం వదులుకుందామా? దేవతలు యజ్ఞాలు చేసినపుడు రాక్షసులు భగ్నం చేసే ప్రయత్నం చేశారు సుబాహు, మారీచుడు అడ్డుకునే ప్రయత్నం చేస్తే లోక కళ్యాణం కోసం చేసే యజ్ఞం ఆగిందా? లోకకళ్యాణం కోసం చేసే పనులకు సహకరించకపోయినా ఫరవాలేదు.. కానీ దయచేసి అడ్డుకునే ప్రయత్నం చేయొద్దు.ఈ ప్రాజెక్టు ఎవరికీ వ్యతిరేకం కాదు.. ఎవరి ఆస్తులు గుంజుకునేందుకు కాదు.. ఇది భవిష్యత్తరాల కోసం మనం చేస్తున్న అభివృద్ధి ప్రకృతిని, పర్యావరణాన్ని కాపాడుకోవడం మన కర్తవ్యం.మూసీ పునరుజ్జీవనంతో రాష్ట్రం గ్రోత్ ఇంజన్ గా మారుతుంది ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణం జరిగినపుడు కూడా కొందరు భూములు కోల్పోయారు మూసీ బాధితులకు ఎలాంటి పరిహారం ఇద్దామో చెప్పండి మూసీ పరివాహక నిరాశ్రయుల పూర్తి వివరాలు మా దగ్గర ఉన్నాయి జన ఆందోళన్ సంఘంతో మాట్లాడి మా ప్రభుత్వం ఇండ్లు నిర్మించే ప్రయత్నం చేస్తోంది స్కూల్స్, ఇతర సౌకర్యాలతో పాటు ఆ పరిసర ప్రాంతాల్లో వారికి ఉపాధి కలిగించే ప్రయత్నం చేస్తున్నాం పేదలకు మేలు చేయడానికే మా ప్రభుత్వం ఉంది రేవంత్ రెడ్డి రియల్ ఎస్టేట్ చేస్తున్నారని కొందరు విమర్శిస్తున్నారు రాష్ట్ర ప్రయోజనాల కోసం ప్రభుత్వం రియల్ ఎస్టేట్ చేస్తే తప్పేంటీ? పర్యాటకం అభివృద్ధి చేస్తే తప్పేంది? ప్రపంచమంతా మన హైదరాబాద్ వైపు చూస్తోంది. హైదరాబాద్ సురక్షిత నగరం పేదవాళ్లను నిరాశ్రయులను చేయాలని మేం అనుకోవడంలేదు పేదలతో శత్రుత్వం పెంచుకుంటే ఎవరైనా మళ్లీ అధికారంలోకి వస్తారా?మూసీ పునరుజ్జీవం జరిగితే కాంగ్రెస్ కు, రేవంత్ రెడ్డికి మంచి పేరు వస్తుందని, ఇక వాళ్లకు అధికారం కలగానే మిగులుతుందని అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు కడుపులో కుళ్ళు, మాటల్లో విషం , చూపుల్లో పగ తో అడ్డుకోవాలని చూస్తున్నారు నేను మీలో ఒకడిని.. మీ సలహాలు సూచనలు తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నాం. అందరి సహకారంతో ఈ ప్రాజెక్టును పూర్తి చేసుకుందాం



# ‘డిజిటల్ ఎకానమీ’గా మారేందుకు సహకరిస్తాం..

**కీలక రంగాల్లో వ్యూహాత్మక భాగస్వామిగా ‘తెలంగాణ’**

**ఫార్మా డిస్ట్రిబ్యూషన్ హబ్ ఏర్పాటు సాధ్యసాధ్యాలపై అధ్యయనం**

**టాంజానియా ఉన్నత స్థాయి బృందం భేటీలో మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి**



**పెద్దపల్లి, మంథని, మార్చి 14 (వార్త సంధ్య ) :** డిజిటల్ ఆర్థిక వ్యవస్థగా రూపాంతరం చెందేందుకు టాంజానియాకు అవసరమైన సాంకేతిక సహకారాన్ని అందించేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ఐటీ,టూరిజం, హెల్త్ కేర్,లైఫ్ సైన్సెస్, మహిళా సాధికారత, ఎమర్జింగ్ టెక్నాలజీస్, డిజిటల్ గవర్నెన్స్, డిజిటల్ పబ్లిక్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్, స్టార్టప్, ఇన్నోవేషన్ ఎకో సిస్టం, కెపాసిటీ బిల్డింగ్, స్కిల్ డెవలెప్ మెంట్ తదితర కీలక రంగాల్లో టాంజానియాతో వ్యూహాత్మక భాగస్వామ్యానికి కాంప్రహెన్సివ్ రోడ్డు మ్యాప్ ను సిద్ధం చేస్తామన్నారు. శనివారం డా.బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో టాంజానియా మినిస్టర్ ఆఫ్ కమ్యూనికేషన్,ఐటీ, ఇన్నోవేషన్ ముబ్రిక్ రమదాని సోరాగా నేతృత్వంలోని అత్యున్నత స్థాయి బృందం మంత్రి శ్రీధర్ బాబుతో ప్రత్యేకంగా సమావేశమయ్యింది. ‘తెలంగాణ టాంజానియా‘ మధ్య ద్వైపాక్షిక సహకారాన్ని పెంపొందించేందుకు తీసుకోవాల్సిన చర్యలు, అవకాశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ అంతర్జాతీయ భాగస్వామ్యాల ద్వారా తెలంగాణను దేశంలోని ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్ గా తీర్చి దిద్దాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్ సామాజిక, ఆర్థిక సమ్మిళిత వృద్ధికి బలమైన పునాదిగా మారిందన్నారు. ఆ దిశగా తెలంగాణ వేసిన అడుగులు ప్రపంచ పటంలో మన రాష్ట్రానికి ప్రత్యేక బ్రాండ్ ఇమేజ్ ను క్రియేట్ చేశాయన్నారు. ఇదే స్ఫూర్తితో డిజిటల్ ఆర్థిక వ్యవస్థగా మారేందుకు టాంజానియాకు అవసరమైన సాంకేతిక సహకారం, మెంటార్ షిప్, నైపుణ్య మార్పిడి అందిస్తామన్నారు. అక్కడ ఫార్మా డిస్ట్రిబ్యూషన్ హబ్ ను ఏర్పాటు చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని,అందుకు గల సాధ్యసాధ్యాలపై అధ్యయనం చేసి తదుపరి నిర్ణయం తీసుకుంటామన్నారు. ‘మీ సేవ’ ద్వారా డోర్ స్టెప్ సిటిజన్ సర్వీసెస్ డెలివరీ, ‘వీ హబ్’ మార్గ నిర్దేశంలో మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రోత్సహం,స్టార్టప్ ఎకో సిస్టం బలోపేతం తదితర అంశాల్లో ఒక ‘నాలెడ్జ్ పార్ట్నర్’గా వ్యవహరిస్తామన్నారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ద్వారా స్కిల్లింగ్, రీ స్కిల్లింగ్, అప్ స్కిల్లింగ్ పై మార్గనిర్దేశం చేస్తామన్నారు. బ్లూ ఎకానమీ, టూరిజంలో టాంజానియా అవలంభిస్తోన్న బెస్ట్ ప్రాక్టీసెస్ పై అధ్యయనం చేసి...తెలంగాణలోనూ అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ‘డిజిటల్ ఎకానమీగా మారాలన్న మా లక్ష్య సాధనలో తెలంగాణ లాంటి ప్రగతిశీల రాష్ట్రాల వ్యూహాత్మక భాగస్వామ్యం ఆవశ్యకం. ఐటీ,హెల్త్ కేర్, మెడికల్ టూరిజం, డిజిటల్ గవర్నెన్స్, స్టార్టప్, ఇన్నోవేషన్ ఎకో సిస్టం, లైఫ్ సైన్సెస్ తదితర రంగాల్లో సాధించిన ప్రగతి, చేపట్టిన సంస్కరణలు మాకు స్ఫూర్తిదాయకం. అందుకే...తెలంగాణతో కలిసి పని చేసేందుకు త్వరలోనే ఎంవోయూ కుదుర్చుకుంటాం’ అని టాంజానియా మంత్రి ముద్రిక్ రమదాని సోరాగా పేర్కొన్నారు. ఈ సమావేశంలో టాంజానియా కమ్యూనికేషన్, ఐటీ, ఇన్నోవేషన్ మంత్రిత్వ శాఖ ముఖ్య కార్యదర్శి ఫాత్మా మబ్రూక్ ఖమిస్, జాంజిబార్ ఐసీటీ అథారిటీ సీఈవో శుకూరు అవాద్ సులేమాన్, ప్రెసిడెంట్స్ డెలివరీ బ్యూరో హెడ్ ఆఫ్ టెక్నాలజీ అండ్ ఇన్వెస్ట్ మెంట్స్ జాన్ మహుండి తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో ఎల్పీజీ గ్యాస్ కొరత లేదు

**వినియోగదారులు అపోహలు నమ్మవద్దు**

**హోటళ్లల్లో కమర్షియల్ సిలిండర్లు తప్ప**

**వేరే సిలిండర్లు వాడితే చర్యలు తప్పవు**

**జిల్లా కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్ రాజు**



**భద్రాద్రి జిల్లా బ్యూరో మార్చ్ 14 (వార్త సంధ్య) :** జిల్లాలో ఎల్పీజీ గ్యాస్ కొరత లేదని, గ్యాస్ సరఫరా పూర్తిగా సాధారణంగా కొనసాగుతోందని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. గ్యాస్ కొరత ఉందన్న వదంతులను ప్రజలు నమ్మవద్దని ఆయన స్పష్టం చేశారు. శనివారం ఐడీఓసి కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌తో కలిసి పౌరసరఫరాలు, రెవెన్యూ, విద్య, వైద్య ఆరోగ్య, పోలీస్ శాఖలు, వివిధ సంక్షేమ గురుకులాల అధికారులు, ఎల్పీజీ సేల్స్ అధికారులు, జిల్లాలోని గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ ఏజెన్సీల యజమానులతో గ్యాస్ సరఫరాపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గృహ వినియోగదారులకు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గ్యాస్ సిలిండర్ల సరఫరా జరుగుతోందన్నారు. ఆసుపత్రులు, విద్యా సంస్థలు, ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలు వంటి అత్యవసర సేవలకు గ్యాస్ సరఫరాలో ఎటువంటి అంతరాయం కలగకుండా సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైన చోట్ల అత్యవసర సేవల కోసం అవసరమైన గ్యాస్ సిలిండర్లు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం మొత్తం 26 గ్యాస్ పంపిణీ కేంద్రాలు పనిచేస్తున్నాయని తెలిపారు. అందులో హెచ్‌పీసీఎల్ 14, బీపీసీఎల్ 05, ఐఓసీఎల్ 07 గ్యాస్ పంపిణీ కేంద్రాలు ఉన్నాయని పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 4,69,075 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయని వివరించారు. వాటిలో సింగిల్ సిలిండర్ కనెక్షన్లు 2,41,175, డబుల్ సిలిండర్ కనెక్షన్లు 98,868, దీపం కనెక్షన్లు 53,405, సీఎస్ఆర్ కనెక్షన్లు 2,465, ప్రధాన మంత్రి ఉజ్వల యోజన (పీఎంయూవై) కనెక్షన్లు 73,162 ఉన్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో గ్యాస్ రీఫిల్ బుకింగ్‌కు 45 రోజుల వ్యవధి ఉండగా, పట్టణ ప్రాంతాల్లో 25 రోజుల వ్యవధి అనంతరం మాత్రమే రీఫిల్ బుకింగ్‌కు అవకాశం ఉంటుందని కలెక్టర్ వివరించారు. ఈ విషయంపై గ్యాస్ వినియోగదారులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. గ్యాస్ బుక్ చేసుకున్న వినియోగదారుల రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌కు డెలివరీ అథెంటికేషన్ కోడ్ (ణూజ) వస్తుందని, ఆ కోడ్‌ను గ్యాస్ డెలివరీ ప్రతినిధికి తెలిపిన తరువాతే గ్యాస్ సిలిండర్ అందజేయబడుతుందని తెలిపారు. గ్యాస్ సిలిండర్లను అక్రమంగా నిల్వ చేయడం, బ్లాక్ మార్కెట్‌కు తరలించడం వంటి చర్యలపై కఠిన చర్యలు తీసుకోవాలని పౌరసరఫరాల శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అవసరమైన చోట్ల అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి గ్యాస్ వినియోగాన్ని పర్యవేక్షించాలని సూచించారు. ముఖ్యంగా హోటళ్లు, కమర్షియల్ సంస్థలు గృహ వినియోగానికి కేటాయించిన సబ్సిడీ సిలిండర్లను ఉపయోగిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. హోటళ్లు మరియు కమర్షియల్ ప్రాంతాల్లో గ్యాస్ వినియోగం కోసం కమర్షియల్ సిలిండర్లు లేదా ఇతర ప్రత్యామ్నాయ అవకాశాలను వినియోగించేలా అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో డిస్ట్రిక్ట్ లెవెల్ ఎనర్జీ సప్లై మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. గ్యాస్ సరఫరా ప్రక్రియను పర్యవేక్షించేందుకు ప్రతి గ్యాస్ పంపిణీ కేంద్రం వద్ద అవసరమైతే ఒక విఆర్ఓ, ఒక కానిస్టేబుల్‌ను నియమించి గ్యాస్ డెలివరీలను పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు . డీలర్లు ప్రతిరోజు గ్యాస్ నిల్వలు, బుకింగ్ స్థితి, డెలివరీ వివరాలు వంటి సమాచారాన్ని ప్రభుత్వానికి అందించాలని సూచించారు. జిల్లాలో గ్యాస్ సిలిండర్ల అక్రమ రవాణాను అరికట్టేందుకు, ప్రజలకు పారదర్శకంగా గ్యాస్ సిలిండర్లు అందేలా డివిజన్ స్థాయిలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు ప్రచారం చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చిన్న వ్యాపారాలు చేసే వారికీ అవసరమైన 5కేజీ ల సిలెండర్ లను సప్లై చెయ్యాలన్నారు. ప్రతి వినియోగదారునికి అవసరమైన గ్యాస్ సిలిండర్లు సమయానికి అందేలా డిస్ట్రిబ్యూటర్లు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ గ్యాస్ సరఫరా ప్రక్రియ ప్రజలకు అంతరాయం లేకుండా కొనసాగేందుకు పోలీస్ శాఖ పూర్తిస్థాయిలో సహకారం అందిస్తుందని తెలిపారు. ప్రతి గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గ్యాస్ సిలెండర్ల రవాణా సమయం లో జాగ్రత్తలు పాటించాలని, రోజువారీ గ్యాస్ సిలిండర్ల స్టాక్ రిజిస్టర్‌ను కచ్చితంగా నిర్వహించాలని పేర్కొన్నారు. గ్యాస్ గోదాముల వద్ద భద్రతా చర్యలు కట్టుదిట్టంగా అమలు చేయాలని తెలిపారు. అధికారుల తనిఖీల సమయంలో ఎవరైనా అడ్డంకులు కలిగించినా లేదా దాడులకు ప్రయత్నించినా వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు గ్యాస్ సరఫరా సంబంధిత ఏవైనా ఇబ్బందులు ఎదురైతే సంబంధిత గ్యాస్ ఏజెన్సీలు లేదా అధికారులను సంప్రదించాలని సూచించారు. జిల్లాలో గ్యాస్ సరఫరా పూర్తిగా సాధారణంగా కొనసాగుతోందని, ప్రతి వినియోగదారునికి సమయానికి గ్యాస్ సిలిండర్లు అందేలా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ప్రేమ్ కుమార్, సిపిఓ సంజీవరావు, బీసీ సంక్షేమ శాఖ అధికారి విజయలక్ష్మి, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి శ్రీలత, వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిని స్వర్ణలత లెనినా, జిల్లా వైద్య శాఖ అధికారి తుకారాం రాథోడ్, పౌరసరఫరాల శాఖ అధికారులు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్ఓసి మంజూరు చేయించిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

### చికిత్స కోసం 2 లక్షల ఎల్ఓసి చెక్కు అందజేత



**పెద్దపల్లి, మంథని మార్చి 14 (వార్త సంధ్య) :** తెలంగాణ రాష్ట్ర ఐటి, పరిశ్రమల మరియు శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంథని నియోజకవర్గం లోని మంథని మండలం గుంజపడుగు గ్రామానికి చెందిన ఆకుల రామ్మూర్తి కి రూ 2 లక్షల ఎల్ఓసి ఇప్పించారు. ఆకుల రామ్మూర్తి అనారోగ్యంతో నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా సహాయం కొరకు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కి తెలుపగా వెంటనే సీఎంఆర్ఎఫ్ ద్వారా వైద్య ఖర్చుల నిమిత్తశీ వీరికి 2 లక్షల ఎల్ఓసి మంజూరు చేయించి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆస్పత్రి సహాయకులు శనివారం వీరికి కి హైదరాబాద్ లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో అందజేశారు. అండగా నిలిచినా మంత్రి శ్రీధర్ బాబు కి...వారి కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

## జవహర్ నగర్‌లో ఆటో కార్మికుల నిరసన




**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య ) మార్చి 14 :** జవహర్ నగర్‌లో గ్యాస్ ధరల పెంపుకు వ్యతిరేకంగా 'ఐకమత్యం ఆటో యూనియన్' ఆధ్వర్యంలో ఆటో కార్మికులు నిరసన ర్యాలీ నిర్వహించారు. జిహెచ్ఎంసి మున్సిపల్ కార్యాలయం నుండి ఫైరింగ్ కట్ట గ్యాస్ బంక్ వరకు ర్యాలీ చేపట్టి గ్యాస్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కట్టా కృపావరం మాట్లాడుతూ గ్యాస్ ధరలు పెరగడంతో ఆటో డ్రైవర్లపై భారీ ఆర్థిక భారం పడుతోందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి గ్యాస్ ధరలను నియంత్రించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూరుకుల నర్సింగరావు, వాయిస్ అడ్వైజర్ వెంకటేష్ సహా పలువురు నాయకులు, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

## బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి అజయ్ కుమార్



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) మార్చి 14 :** రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య తన కుటుంబసభ్యులతో కలిసి ప్రధాని మోదీని మర్యాదపూర్వకంగా కలిసారు. ప్రధానమంత్రితో బీసీల సమస్యల గురించి ఆయన దృష్టికి తీసుకెళ్లాగా ప్రధాని సానుకూలంగా స్పందించి బీసీల డిమాండ్లు నెరవేరుస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రధాని .. డాక్టర్ అరుణ్ బాబు విద్యావంతుడు, ఐఏఎస్ ఇంటర్వ్యూ వరకు వెళ్ళారు. రాష్ట్రంలో దేశంలో జరుగుతున్న బీసీ సమస్యలపై పూర్తి అవగాహన ఉన్న డాక్టర్ అరుణ్ బాబు కు బీసీ ఉద్యమాన్ని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులుగా బాధ్యతలు అప్పగించాలని సూచించినట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాణాల అజయ్ కుమార్ తెలిపారు.

## రాజకీయ భీష్ముడు మాజీ మంత్రి జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ రాజీనామా...?



**జగిత్యాల జిల్లా బ్యూరో రిపోర్టర్ ఫిబ్రవరి 14(వార్త సంధ్య):–** తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి జగిత్యాల జిల్లాలో భారీ షాక్ తగలబోతోంది. సీనియర్ నేత, మాజీ మంత్రి జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసేందుకు రెడీ అయ్యారని సమాచారం. త్వరలోనే హస్తం పార్టీకి రాజీనామా చేస్తారంటూ జోరుగా ప్రచారం సాగుతోంది. అంతేకాక మార్చి 20 తర్వాత జీవన్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీలో చేరతారని సమాచారం. ఇప్పటికే జీవన్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లతో సంప్రదింపులు జరుపుతున్నారని తెలుస్తోంది. జీవన్ రెడ్డి గత కొంత కాలంగా కాంగ్రెస్ పార్టీ తీరుపై అసంతృప్తిగా ఉన్న సంగతి తెలిసిందే. కాంగ్రెస్ పార్టీలో తనకి గౌరవం, సముచిత స్థానం లేదని కొన్ని రోజుల క్రితం సన్నిహితుల వద్ద ఆయన ఆవేదన వ్యక్తం చేశారని సమాచారం. సోషల్ మీడియా గ్రూపులకు కాంగ్రెస్ పేరు తొలగించి జీవన్ రెడ్డి పేరుతో కొనసాగిస్తున్నారు. గౌరవం లేని చోట కొనసాగాలా వద్దా అనే దానిపై ఆలోచన చేస్తున్నానని.. త్వరలోనే దీనిపై నిర్ణయం తీసుకుంటానని జీవన్ రెడ్డి ఇప్పటికే ప్రకటించారు. ఈ క్రమంలోనే ఆయన పార్టీకి రాజీనామా చేయబోతున్నారని విశ్వసనీయ వర్గాల సమాచారం. గత కొంత కాలంగా కాంగ్రెస్ పార్టీలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ కే ప్రాధాన్యత ఇవ్వడంతో జీవన్ రెడ్డి తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. దీనిపై బహిరంగంగానే తన విమర్శలు చేశారు. ఈ పరిణామాలపై సన్నిహితులు, ఆప్తులతో సమావేశం అయిన తరువాత రాజీనామా చేయాలని భావిస్తున్నట్టు సమాచారం. జగిత్యాలలో సభ నిర్వహించి పార్టీ మారాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కూడా జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల తరపున ప్రచారం చేయలేదు. ఈ నేపథ్యంలోనే త్వరలోనే ఆయన పార్టీకి రాజీనామా చేస్తారని తెలుస్తోంది.

## రాయికల్ మున్సిపల్ చైర్మన్‌కు రాజ్యాంగ పీఠిక అందజేత.




**జగిత్యాల జిల్లా బ్యూరో రిపోర్టర్ ఫిబ్రవరి 14 (వార్త సంధ్య):** రాయికల్ మున్సిపల్ చైర్మన్‌గా ఇటీవల ఎన్నికై బాధ్యతలు స్వీకరించిన కట్కంశీ రవీందర్ మున్సిపల్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది. 'సంవిధాన్ మిత్ర ఆర్గనైజేషన్' వ్యవస్థాపకులు శ్రీపతి పవన్ మరియు శ్రీపతి లక్ష్మీనారాయణ కలిసి మున్సిపల్ చైర్మన్ కట్కంశీ రవీందర్ శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం భారత రాజ్యాంగ పీఠిక ప్రతిని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్య స్ఫూర్తికి ప్రతీకగా నిలిచిన భారత రాజ్యాంగ పీఠికలోని సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం, న్యాయం వంటి మూలాలను స్థానిక పాలనలో ఆచరణలో పెట్టాలని కోరారు. ప్రతి వర్గానికి సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం అందేలా మున్సిపల్ పాలన సాగించాలని సూచించారు. పట్టణ అభివృద్ధి, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, మౌలిక సదుపాయాల విస్తరణ, యువత మరియు మహిళల సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రాజ్యాంగ పీఠికలోని ఆశయాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించే కార్యక్రమాలు నిర్వహించాలని కూడా కోరారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ కట్కంశీ రవీందర్ మాట్లాడుతూ రాజ్యాంగ విలువలకు అనుగుణంగా పారదర్శకంగా పనిచేస్తూ ప్రజా సమస్యలకు ప్రాధాన్యం ఇస్తానని, పట్టణ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

# మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి

### రోడ్డు భద్రత, సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

**పెద్దపల్లి, మంథని, మార్చి 14 (వార్త సంధ్య ) :** ప్రజాపాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమాల్లో భాగంగా పిల్లల భద్రత,"మత్తు పదార్థాల వినియోగంఅనర్థాలు",సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం మంథని పోలీసులు నిర్వహించారు. శనివారం స్థానిక నృసింహ శివ కిరణ్ గార్డెన్ లో మంథని పోలీస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమానికి నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి, గోదావరిఖని ఏసిపి ఏం. రమేష్, ప్రవచనకర్త నాయక్ మహారాజ్, మంథని మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుదల వెంకన్న, మంథని మున్సిపల్ కమిషనర్ మనోహర్ రెడ్డి హాజరయ్యారు. ముందుగా మంథని ఎస్ఐ రమేష్ ముఖ్య అతిథులకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ,మత్తు పదార్థాలకు బానిసలైతే ఎవరి భవిష్యత్తైనా నాశనం అవుతుందని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థి దశ నుంచే లక్ష్యాలను ఏర్పరచుకుని వాటిని సాధించే దిశగా ప్రతి ఒక్కరూ కష్టపడి చదువుకోవాలని సూచించారు. యువత చేతుల్లోనే దేశ భవిష్యత్తు ఉందని, ప్రతి ఒక్కరూ మంచిగా చదువుకుని తమ ప్రాంతానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు.





యువతలో సహజంగా ఉన్న ఉత్సాహం,శక్తిని క్రీడలు, చదువు, సమాజ అభివృద్ధి కోసం ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ వయసులో శారీరకంగా, మానసికంగా ఎక్కువ శక్తి ఉంటుందని,ఆ శక్తిని మత్తు పదార్థాల వైపు మళ్లిస్తే ముందుగా ఆరోగ్యం దెబ్బతింటుందని, తరువాత జీవితమే ప్రమాదంలో పడుతుందని హెచ్చరించారు. మత్తు పదార్థాల వినియోగాన్ని పూర్తిగా దూరం పెట్టాలని, ఎవరికైనా అలాంటి అలవాటు ఉన్నట్లు తెలిసితే ముందుగా వారిని మార్చే ప్రయత్నం చేయాలని, మార్పు రాకపోతే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. మత్తు పదార్థాల అక్రమ రవాణా, వినియోగంపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అలాగే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా యువతలోనే జరుగుతున్నాయని పేర్కొన్నారు. నివేదికల ప్రకారం రోడ్డు ప్రమాదాల్లో 60 నుంచి 70 శాతం వరకు యువకులే బాధితులవుతున్నారని తెలిపారు. వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారును నడిపే సమయంలో సీటు బెల్ట్ ధరించాలని సూచించారు. ఎప్పుడూ రహదారి ఎడమ వైపునే ప్రయాణించాలని, భారీ వాహనాలను దాటేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. ముఖ్యంగా మద్యం సేవించి వాహనం నడపడం ప్రమాదాలకు ప్రధాన కారణమని హెచ్చరించారు. సైబర్ నేరాల విషయంలో కూడా విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అపరిచితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, ఓటీపీలు అడగడం, అనుమానాస్పద లింకులు పంపడం వంటి మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. గతంలో తల్లిదండ్రులు అపరిచితులు ఇచ్చే చాక్లెట్‌లను తీసుకోవద్దని చెప్పేవారని,ఇప్పుడు అదే మోసం మొబైల్ ఫోన్ ద్వారా వచ్చే లింకులు, మెసేజ్‌ల రూపంలో జరుగుతోందని వివరించారు. మొబైల్ ఫోన్ ద్వారా ప్రపంచంతో అనుసంధానం సాధ్యమవుతున్నప్పటికీ, అదే సమయంలో సైబర్ నేరస్థులకు కూడా అవకాశం కలుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మంథని మున్సిపల్ పాలకవర్గ సభ్యులు, గ్రామ సర్పంచులు, మాజీ సర్పంచులు, పోలీస్ సిబ్బంది,సుమారు 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు.కు లక్షలాది మంది భక్తులు తరలివస్తారని తెలిపారు. భక్తులకు తాగునీరు, అన్నదానం, వసతి, పారిశుధ్యం వంటి అవసరమైన సౌకర్యాలు మెరుగ్గా కల్పించేందుకు సి ఎస్ ఆర్ సంస్థలు తమవంతు సహకారం అందించాలని కోరారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం ఈఓతో సంప్రదించి అవసరమైన ఏర్పాట్ల వివరాలను సేకరించాలని ముఖ్య ప్రణాళిక అధికారి (సీపీఓ) సంజీవరావును ఆదేశించారు. ఆ అవసరాల మేరకు సి ఎస్ ఆర్ సంస్థల సహకారాన్ని సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో లీడ్ బ్యాంకు మేనేజర్ రామిరెడ్డి, వివిధ సంస్థల ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



# చరిత్ర సృష్టించిన తెలంగాణ విద్యుత్ శాఖ

### విద్యుత్ వినియోగంలో ఆల్ టైమ్ రికార్డ్
### ఈ నెల 13న ఒక్క రోజే 341 మిలియన్ యూనిట్ల సరఫరా
### భవిష్యత్ అవసరాలకు సిద్ధంగా ఉన్నాం
### విద్యుత్ సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలిపిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య ) మార్చి 14 :** తెలంగాణ విద్యుత్ సంస్థలు చరిత్రలో ఒకే రోజున అత్యధికంగా 341.08 మిలియన్ యూనిట్లు (వీఖ) విద్యుత్ సరఫరా చేసి రికార్డు సృష్టించింది. మార్చి 13, 2026 న ఉదయం 11:17 గంటలకు 18,228 మెగావాట్ల గరిష్ట డిమాండ్ ను తట్టుకుని విజయవంతంగా సరఫరా చేసింది. మార్చి 13, 2026న తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ వినియోగం చరిత్రలోనే అత్యధిక స్థాయికి చేరుకుంది. ఆ రోజున రాష్ట్రం 341.08 మిలియన్ యూనిట్ల విద్యుత్ సరఫరా చేసి, గత రికార్డు అయిన 335.19 మిలియన్ యూనిట్లు (18.03.2025) ను అధిగమించింది. అదే విధంగా, 18,228 మెగావాట్ల గరిష్ట విద్యుత్ డిమాండ్ ను కూడా విజయవంతంగా తీర్చింది. ఇది గతంలో నమోదైన 17,162 మెగావాట్ల గరిష్ట డిమాండ్ (20.03.2025) కంటే ఎక్కువ. ఉష్ణోగ్రతలు పెరగడం వ్యవసాయ అవసరాలు అధికమవడం వల్ల విద్యుత్ అవసరం మరియు గరిష్ట లోడ్ రెండూ పెరిగాయి. భవిష్యత్తు అవసరాలకు సిద్ధంగా రాష్ట్ర విద్యుత్ వ్యవస్థ రాబోయే రోజుల్లో పెరుగుతున్న విద్యుత్ అవసరాలను సమర్థవంతంగా తీర్చేందుకు రాష్ట్ర విద్యుత్ సంస్థలు తమ వ్యవస్థలను మరింత బలోపేతం చేస్తూ కొనసాగుతాయి. రోజుకు 350కు పైగా మిలియన్ యూనిట్ల విద్యుత్ అవసరం మరియు సుమారు 19,000 మెగావాట్ల గరిష్ట లోడ్ ను నిర్వహించేందుకు తెలంగాణ సిద్ధంగా ఉంది. బలమైన విద్యుత్ గ్రిడ్ మరియు సమన్వయంతో కూడిన కార్యాచరణ ప్రణాళికతో ఈ అవసరాలను ఎదుర్కొనే సామర్థ్యం రాష్ట్రానికి ఉంది. ఈ అధిక డిమాండ్ సమయంలో నిరంతర విద్యుత్ సరఫరాను కొనసాగించినందుకు రాష్ట్రంలోని అన్ని విద్యుత్ సంస్థల సిబ్బందిని ఉప ముఖ్యమంత్రి అభినందించారు.

## తెలంగాణను ఆయిల్ పామ్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం చర్యలు మంత్రి తుమ్మల

- నర్మేట్టలో రూ.300 కోట్లతో అత్యాధునిక పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణం
- కేవలం 18 నెలలలోనే ఫ్యాక్టరీ పనులు పూర్తి చేశాము - మంత్రి తుమ్మల
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా త్వరలో ప్రారంభం కానున్న నర్మేట్ట ఫ్యాక్టరీ
- పామాయిల్ సాగుతో రైతులకు దీర్ఘకాలిక ఆదాయం మంత్రి తుమ్మల
- నర్మేట్ట ఫ్యాక్టరీతో పెరగనున్న రైతుల ఆదాయం ఉపాధి అవకాశాలు



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) మార్చి 14 :** తెలంగాణను దేశంలోనే ఆయిల్ పామ్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక చర్యలు తీసుకుంటోందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుచూపు, ప్రోత్సాహంతో రాష్ట్రవ్యాప్తంగా ఆయిల్ పామ్ సాగును విస్తరించి రైతులకు స్థిరమైన ఆదాయం కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. రైతుల ఆర్థికాభివృద్ధికి దీర్ఘకాలిక భరోసా ఇచ్చే పంటగా ఆయిల్ పామ్ నిలుస్తోందని, ఒకసారి నాటితే 25 నుండి 30 సంవత్సరాలపాటు నిరంతర ఆదాయం అందించే ఈ పంట తెలంగాణ రైతులకు బంగారు భవిష్యత్తును అందించగలదని మంత్రి పేర్కొన్నారు. శనివారం సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మేట్టలో తెలంగాణ ఆయిల్ ఫెడ్ ఆధ్వర్యంలో రూ.300 కోట్ల వ్యయంతో నిర్మించిన అత్యాధునిక ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీని మంత్రి పొన్నం ప్రభాకర్, ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి మరియు అధికారులతో కలిసి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరిశీలించారు. ఫ్యాక్టరీ ట్రయల్ రన్ విజయవంతం కావడంతో అధికారులను, సిబ్బందిని అభినందించిన మంత్రి, ఈ ఫ్యాక్టరీ తెలంగాణలో ఆయిల్ పామ్ సాగుకు కొత్త దశను తీసుకువస్తుందని పేర్కొన్నారు. అత్యాధునిక మలేషియా సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించిన ఈ ఫ్యాక్టరీ దేశంలోనే అత్యాధునికమైన వాటిలో ఒకటిగా నిలుస్తుందని తెలిపారు. గంటకు 30 నుండి 120 టన్నుల వరకు ఆయిల్ పామ్ గెలలను ప్రాసెస్ చేసే సామర్థ్యంతో నిర్మించిన ఈ ఫ్యాక్టరీ రైతులకు ఎంతో ఉపయోగకరంగా మారుతుందని అన్నారు.మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ ఆయిల్ పామ్ పనులు ప్రారంభించి, కేవలం 18 నెలల రికార్డు సమయంలోనే పనులు పూర్తి చేయడం జరిగిందని మంత్రి తెలిపారు. త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఈ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. నర్మేట్ట పామాయిల్ ఫ్యాక్టరీలో క్రూడ్ పామ్ ఆయిల్, పామ్ కర్నల్ ఆయిల్ తయారీతో పాటు 4 మెగావాట్ల సామర్థ్యంతో బయో పవర్ ప్లాంట్, జీరో లిక్విడ్ డిశ్చార్జ్ విధానంలో పనిచేసే నీటి శుద్ధి కేంద్రం వంటి అత్యాధునిక సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. ఆయిల్ పామ్ గెలల నుంచి నూనె ఉత్పత్తి ప్రక్రియలో మిగిలే వ్యర్థాలను వినియోగించి విద్యుత్ ఉత్పత్తి చేసే విధానాన్ని కూడా ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ ఫ్యాక్టరీ ద్వారా ఆయిల్ పామ్ రైతుల ఆదాయం పెరగడంతో పాటు స్థానికంగా ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని చెప్పారు. మంత్రి తుమ్మల మాట్లాడుతూ ప్రస్తుతం పంట మార్పిడి అవసరం ఏర్పడిందన్నారు. రైతులు వరి పంటపైనే ఎక్కువగా ఆధారపడుతున్నారని, ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు మరియు సన్నాలకు ఇచ్చే బోనస్ కారణంగా దేశంలోనే అత్యధికంగా వరి పండిస్తున్న రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందన్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు పరిమితులు విధిస్తున్న నేపథ్యంలో రైతులు వరి మాత్రమే కాకుండా ఉద్యానపంటలు, కూరగాయలు, పామాయిల్ వంటి వాణిజ్య పంటలను సాగు చేయాలని సూచించారు. రైతులకు అధిక ఆదాయం పొందే ప్రత్యామ్నాయ పంటగా పామాయిల్ పంట ఎంతో ఉపయోగకరమని ఆయన పేర్కొన్నారు. ఆయిల్ పామ్ తోటల్లో అంతర పంటలుగా కోకో, జాజికాయ, మెకడామియా వంటి పంటలను కూడా సాగు చేసుకోవచ్చని మంత్రి తెలిపారు. దీంతో రైతులకు అదనపు ఆదాయం పొందే అవకాశం ఉంటుందని చెప్పారు. మార్కెట్ పరంగా కూడా ఈ పంట రైతులకు సులభంగా ఉండే పంటగా నిలుస్తుందని, పండిన గెలలను ఫ్యాక్టరీకి విక్రయించిన తరువాత మూడో రోజుకే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని తెలిపారు. ధాన్యం అమ్మకాలలో కొన్ని సందర్భాల్లో చెల్లింపులు ఆలస్యం అయ్యే పరిస్థితులు ఉండొచ్చని, అయితే పామాయిల్ రైతులకు వేగంగా చెల్లింపులు జరుగుతాయని చెప్పారు. అదేవిధంగా ఆయిల్ పామ్ పంటకు కోతుల బెడద, అడవి పందుల బెడద, అలాగే వాతావరణ పరిస్థితుల వల్ల పంట నష్టపోయే సమస్యలు తక్కువగా ఉంటాయని మంత్రి పేర్కొన్నారు.పామాయిల్ సాగు చేయాలనుకునే రైతులకు రూ.50,921 వరకు సబ్సిడీ అందిస్తున్నామని మంత్రి తెలిపారు. మొక్కలను ఉచితంగా అందజేస్తున్నామని, డ్రిప్ పరికరాలను కూడా ప్రభుత్వం అందిస్తున్నట్లు చెప్పారు. తాను మంత్రి బాధ్యతలు చేపట్టిన సమయంలో పామాయిల్ ధర టన్నుకు రూ.12,000 మాత్రమే ఉండేదని, కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరిపి దిగుమతి సుంకాన్ని పెంచేలా చేయడంతో ప్రస్తుతం టన్నుకు రూ.21,546 కు చేరిందన్నారు. దీనిని రూ.25,000కు పెంచాలని ప్రధానమంత్రిని కోరుతున్నామని తెలిపారు. నర్మేట్ట పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణంతో ఆయిల్ పామ్ సాగుపై రైతుల్లో మరింత నమ్మకం పెరుగుతుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణలో పామాయిల్ సాగు విస్తరణకు ఈ ఫ్యాక్టరీ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.





అదేవిధంగా ఇక్కడ ఏర్పాటు చేయనున్న ఆయిల్ రిఫైనరీ యూనిట్‌కు గౌరవ ముఖ్యమంత్రిగారు త్వరలో శంకుస్థాపన చేయనున్నట్లు వెల్లడించారు.ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో సుమారు 2.91 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు కొనసాగుతుండగా రాష్ట్రవ్యాప్తంగా 14 కంపెనీలు ఆయిల్ పామ్ సాగు అభివృద్ధికి పనిచేస్తున్నాయని మంత్రి తెలిపారు. తెలంగాణ ఆయిల్ ఫెడ్ పరిధిలోనే దాదాపు 42758 మంది రైతులు 1.8 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేస్తున్నారని పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లాలోనే 14361 ఎకరాల్లో 4,469 మంది రైతులు ఆయిల్ పామ్ సాగు చేపట్టగా, జనగామ, యాదాద్రి భువనగిరి, గద్వాల్, నారాయణపేట, మహబూబాబాద్ జిల్లాల్లో కలిపి 49376 ఎకరాల్లో 13479 మంది రైతులు సాగు చేస్తున్నారని వివరించారు. భారతదేశంలో వంట నూనెలకు భారీ డిమాండ్ ఉన్న నేపథ్యంలో ప్రతి సంవత్సరం సుమారు 164 లక్షల టన్నుల వంట నూనెలు దిగుమతి అవుతున్నాయని మంత్రి తెలిపారు. అందులో దాదాపు 59 శాతం పామాయిల్ వాటానే అని పేర్కొన్నారు. గత ఏడాది మాత్రమే దేశం లక్షా 38 వేల కోట్ల రూపాయల విలువైన వంట నూనెలను దిగుమతి చేసుకోవాల్సి వచ్చిందని, ఇందులో పెద్ద భాగం పామాయిల్‌దేనని చెప్పారు. ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని దేశం స్వయం సమృద్ధి సాధించాలంటే ఆయిల్ పామ్ సాగును విస్తరించడం అత్యవసరమని మంత్రి పేర్కొన్నారు. నర్మేట్ట పామాయిల్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవానికి ముందు రైతులకు అవగాహన కల్పించే ఉద్దేశంతో మూడు రోజుల పాటు ప్రత్యేకంగా రైతుల సందర్శన కార్యక్రమం ఏర్పాటు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ సందర్భంగా ఫ్యాక్టరీ వద్ద వివిధ స్టాల్స్ ఏర్పాటు చేసి ఆయిల్ పామ్ సాగు, ప్రాసెసింగ్ విధానాలపై రైతులకు వివరాలు అందించాలన్నారు. అలాగే ఆదర్శ రైతులు, శాస్త్రవేత్తలతో రైతులు నేరుగా చర్చించేలా డైరెక్ట్ ఇంటరాక్షన్ కార్యక్రమాన్ని కూడా ఏర్పాటు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఆయిల్ పామ్ సాగు రైతులకు దీర్ఘకాలిక ఆదాయం అందించే పంటగా నిలుస్తుందని మంత్రి తెలిపారు. ఎకరానికి సుమారు 57 మొక్కలు నాటాల్సి ఉంటుందని, నాలుగో ఏడాది నుంచి దిగుబడి ప్రారంభమవుతుందని చెప్పారు. ఒకసారి సాగు ప్రారంభమైతే 25 నుండి 40 సంవత్సరాలపాటు దిగుబడి ఇస్తుందని వివరించారు. అంతర పంటలుగా కోకో, జాజికాయ, మెకడామియా వంటి పంటలను సాగు చేసి రైతులు అదనపు ఆదాయం పొందవచ్చని సూచించారు. పామాయిల్ సాగు ద్వారా రైతుల జీవితాల్లో పెద్ద మార్పు తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రోత్సాహంతో రానున్న రోజుల్లో తెలంగాణలో పది లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు విస్తరించే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఈ లక్ష్యం సాధ్యమైతే తెలంగాణ దేశంలోనే ఆయిల్ పామ్ సాగులో ముందంజలో నిలవడమే కాకుండా దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ రైతాంగం అభివృద్ధి చెందడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఆయిల్ పామ్ సాగు విస్తరణతో రైతుల ఆదాయం పెరిగి గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

## కెఎల్ఆర్‌ను కలిసిన కాంగ్రెస్ నేత గుడ్ల శ్రీనివాస్
## పార్టీ బలోపేతం, జీహెచ్ఎంసీ ఎన్నికల వ్యూహంపై చర్చ



**బడంగ్పేట్ , వార్త సంధ్య :** మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే కె.ఎల్.ఆర్‌ను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గుడ్ల శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సంద ర్భంగా పలు రాజకీయ, అభివృద్ధి అంశాలపై చర్చించినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతం, రానున్న జీహెచ్ ఎంసీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, అలాగే బడంగ్‌పేట్ ప్రాంత అభివృద్ధి అంశాలపై విస్తృతం గా చర్చించినట్లు గుడ్ల శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ అంశాలపై కెఎల్ఆర్ సానుకూలంగా స్పందిం చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పుట్టగాళ్ల జగన్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## మునగనూరులో నూతన సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం ప్రారంభం

**ప్రారంభించిన ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో । వార్త సంధ్య:** ఆదిబాట్ల సర్కిల్ పరిధిలోని మునగనూరులో శనివారం నాడు నూతనంగా ఏర్పాటు చేసిన సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యాలయం ప్రారంభంతో మునగనూరు, తొర్రూరు, రాగన్నగూడ, తుర్కయంజాల్, మన్నెగూడ తదితర గ్రామాల ప్రజలు రిజిస్ట్రేషన్ పనుల కోసం ఇకపై వనస్థలిపురం వెళ్లాల్సిన అవసరం ఉండదని తెలిపారు.ప్రజలకు రిజిస్ట్రేషన్ సేవలు సులభంగా అందుబాటులోకి రావాలనే ఉద్దేశంతో నూతన సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలను ఏర్పాటు చేస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఇప్పటివరకు ఈ ప్రాంత ప్రజలు రిజిస్ట్రేషన్ పనుల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేదని, ఇప్పుడు ఈ కార్యాలయం ప్రారంభంతో సమయం మరియు ఖర్చు రెండూ తగ్గి ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు.ప్రభుత్వం ప్రజలకు పారదర్శకంగా, వేగంగా సేవలు అందించేందుకు కట్టుబడి ఉందని, ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని ఎమ్మెల్యే తెలిపారు. రిజిస్ట్రేషన్ కార్యాలయం మునగనూరుకు రాకుండా అడ్డుకునేందుకు కొందరు ప్రయత్నాలు చేసినప్పటికీ పట్టుదలతో ఈ కార్యాలయాన్ని మునగనూరుకు తీసుకువచ్చానని ఎమ్మెల్యే తెలిపారు. కార్యాలయానికి వచ్చే ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పించాలని, ఎలాంటి అవినీతి చోటుచేసుకోకుండా అధికారులు పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రాం రెడ్డి, స్థానిక మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## నగరంలో ఫైర్ సేఫ్టీపై ప్రత్యేక తనిఖీలు
## 252 భవనాల పరిశీలన జీహెచ్ఎంసీ చర్యలు









**హైదరాబాద్ । వార్త సంధ్య:** గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో అగ్ని భద్రత (ఫైర్ సేఫ్టీ) చర్యలను సమీక్షిస్తూ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక తనిఖీలు చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈ తనిఖీలను నగరంలోని ఆరు జోన్లలో టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మొత్తం 252 భవనాలను అధికారులు పరిశీలించారు. ప్రధాన రహదారుల వెంట ఉన్న వాణిజ్య సముదాయాల్లో అగ్ని భద్రత నిబంధనలు పాటిస్తున్నారా అనే అంశాన్ని సమీక్షించారు. తనిఖీల సమయంలో భవనాల్లో అమలులో ఉన్న ఫైర్ సేఫ్టీ ఏర్పాట్లను పరిశీలించడంతో పాటు భవన యజమానులు, నిర్వాహకులకు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా సెల్లార్‌లలో ప్రమాదకర పదార్థాలు నిల్వ ఉంచుతున్నారా లేదా అనే అంశాన్ని కూడా అధికారులు పరిశీలించారు. ఎక్కడైనా ప్రమాదకర పదార్థాలు ఉన్నట్లు గుర్తిస్తే వెంటనే తొలగించాలని యజమానులకు సూచనలు ఇచ్చారు. అలాగే ఫైర్ సేఫ్టీ పరికరాలు లేకపోవడం లేదా పనిచేయని పరిస్థితుల్లో ఉన్న చోట్ల వాటిని వెంటనే ఏర్పాటు చేయాలని లేదా మరమ్మతులు చేయాలని నోటీసులు జారీ చేశారు. తనిఖీలలో చాలా వాణిజ్య భవనాల్లో అగ్ని భద్రత ఏర్పాట్లు ఉన్నట్లు గుర్తించగా, కొన్నిచోట్ల లోపాలు కనిపించినట్లు అధికారులు తెలిపారు. అలాంటి భవనాలను ఫాలోఅప్ చేస్తూ నిబంధనలకు అనుగుణంగా అగ్ని భద్రత చర్యలు అమలు అయ్యేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. నగరంలో అగ్ని ప్రమాదాలను నివారించేందుకు ఇటువంటి తనిఖీలు కొనసాగుతాయని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ తెలిపారు.

## ప్రజలకోసం ప్రజా ప్రభుత్వం అభివృద్ధి కోసం ప్రగతి ప్రణాళిక

**గ్రామాల్లో సమస్యలు తెలుసుకున్న ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి**






**రంగారెడ్డి జిల్లా బ్యూరో । వార్త సంధ్య:** యాచారం మండలంలోని యాచారం మండలం-గున్ గల్, మొండి గౌరెల్లి, యాచారం, చౌదర్ పల్లి, చింతుళ్ళ, గ్రామాల్లో నిర్వహించిన "ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి శనివారం పాల్గొన్నారు.గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల వద్దకే పాలనను అందిస్తుందని ఆయన తెలిపారు. ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించడానికే రాష్ట్ర ప్రభుత్వం "ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక" పేరుతో 99 రోజుల ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అధికారులు ప్రజల సమస్యలపై దృష్టి సారించి, వారి గడపదాకా వెళ్లి సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకం పేదలకు చేరాలని, అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని తెలిపారు. ఈ సందర్భంగా గృహ జ్యోతి పథకంలో జీరో బిల్లు రావడం లేదని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, సమస్యను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. అధికారులు సంక్షేమ పథకాలపై ప్రజలకు స్పష్టంగా వివరించాలని, పథకం వస్తుందా లేదా రాకపోతే దానికి గల కారణాన్ని కూడా వారికి అర్థమయ్యేలా చెప్పాలని సూచించారు. కొంతమంది అధికారులు అలసత్వం వీడాలని హెచ్చరించారు.పని చేసే అధికారులను గౌరవిస్తామని, కానీ పని చేయని వారిని ఉపేక్షించబోమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

## పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా అన్ని చర్యలు

**పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ సి నారాయణ రెడ్డి**



**రంగారెడ్డి జిల్లా బ్యూరో । వార్త సంధ్య:** జిల్లాలో పదవ తరగతి పరీక్షలు ప్రశాంతమైన వాతావరణంలో సజావుగా సాగేందుకు అన్ని చర్యలు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి తెలిపారు. శనివారం మొదటి రోజు పరీక్షల సందర్భంగా గచ్చిబౌలి లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరీక్షల నిర్వహణను పరిశీలించిన కలెక్టర్ విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు.పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు తాగునీరు, ప్రథమ చికిత్స మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. తరగతి గదుల్లో తగినంత వెంటిలేషన్ ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఎక్కడా ఎలాంటి చిన్న తప్పిదానికి అవకాశం ఇవ్వకుండా విద్యార్థులు ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాసేలా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే విద్యుత్ అంతరాయం కలుగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు.పరీక్షా కేంద్రాల్లో వసతులపై అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ జరపాలని కలెక్టర్ సూచించారు.


## ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక లో 99 రోజుల కార్యక్రమంలో

**ఇందిరమ్మ ఇండ్ల పెండింగ్ బిల్లుల క్లియరెన్స్**

**2764 మంది లబ్ధిదారులకు ప్రయోజనం**

**1200 మంది ఎల్-3 కేటగిరీ లబ్ధిదారులకు ఊరట**

**హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరక్టర్ వి.పి. గౌతం**



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) మార్చి 14 :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా హౌసింగ్ కార్పొరేషన్ లో ఇందిరమ్మ ఇండ్ల బిల్లుల క్లియరెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గత వారం రోజుల్లో 2764 మంది లబ్ధిదారులకు సంబంధించి సుమారు రూ.28.50 కోట్ల పెండింగ్ బిల్లులను క్లియర్ చేశామని చేసినట్లు హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరక్టర్ శ్రీ విపి గౌతం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రతి విభాగంలోనూ చేపట్టాలన్న ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు 99 రోజుల కార్యక్రమంలో , వివిధ కారణాలతోఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల బిల్లుల విడుదలలో జాప్యం జరుగుతున్న అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని గృహ నిర్మాణ శాఖ శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టంగా నిర్దేశించారు. దీంతో 99 రోజుల కార్యక్రమం మొదటి వారం రోజుల్లో ఇందిరమ్మ ఇండ్ల పెండింగ్ బిల్లులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు.ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఆయా ఇండ్ల నిర్మాణ పురోగతిని అనుసరించి విడతల వారీగా బిల్లులను నేరుగా వారి ఖాతాల్లో జమ చేస్తున్న సంగతి తెలిసిందే. అయితే లబ్ధిదారుల ఆధార్ నెంబర్ బ్యాంక్ అక్కౌంట్ లకు అనుసంధానించకపోవడం, వారి పేర్లలో తేడాలు ఉండటం, ఆన్ లైన్ లో అప్ లోడ్ చేసిన ఫోటోలు సరిగా లేకపోవడం, ఎఐ పరిశీలనలో అభ్యంతరాలు రావడంతోపాటు, గత పథకాల్లో లబ్ది పొంది ఉండటం, ఎల్-3 కేటగిరి నుంచి ఎల్-1 కేటగిరీ జాబితాల్లోకి వచ్చిన వారి వివరాల పరిశీలన, ఇలా పలు కారణాలతో లబ్ధిదారులకు బిల్లుల విడుదలలో ఆలస్యం అనివార్యమవుతున్నది. ఈనేపథ్యంలో ప్రజా ప్రాలన ప్రగతి ప్రణాళిక లో మొదటి వారం రోజుల పాటు పెండింగ్ లో ఉన్న బిల్లులను ను క్లియర్ చేయాలన్నలక్ష్యాన్ని నిర్దేశించుకున్నామని ఎండి శ్రీ విపి గౌతం తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి పెండింగ్ లో ఉన్న బిల్లుల పై ప్రత్యేక దృష్టి సారించి నిశితంగా పరిశీలించి క్లియర్ చేశామని ఆయన వివరించారు. ప్రత్యేక డ్రైవ్ లో భాగంగా గత వారం రోజుల్లో క్లియర్ చేసిన బిల్లులలో ఎల్-3 జాబితాలో ఉన్న 1200 మందికి సంబంధించి రూ.12.06 కోట్ల విడుదల, బిల్లులు విడుదలైనప్పటికీ వివిధ కారణాలతో బ్యాంక్ వద్ద పేమెంట్ ఫెయిల్ 653 మంది లబ్ధిదారులకు చెందిన రూ. 7 కోట్ల మేర మొత్తాన్ని విడుదల చేసినట్లు మేనేజింగ్ డైరక్టర్ వివరించారు. వీటితో పాటు పలు అభ్యంతరాలు, నిశిత పరిశీలన నిమిత్తం పెండింగ్ లో ఉన్న మరో 911 మంది లబ్ధిదారులకు రూ.9.40 కోట్లను కూడా విడుదల చేసేలా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. బ్యాంకుల ద్వారా చెల్లింపుల విషయంలో భవిష్యత్తులో సమస్యలు రాకుండా ఉండాలంటే లబ్ధిదారులు, బ్యాంకులకు వెళ్లి తమ ఆధార్ అనుసంధానం, పేర్లు తదితర వివరాలను ఒకసారి సరి చూసుకోవాలని ఎండి విజ్ఞప్తి చేశారు.

## రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి త్వరలో ప్రారంభించనున్న
## సిద్ధిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెట్ట గ్రామంలో 300 కోట్ల రూపాయలతో నిర్మించిన

**ఆయిల్ ఫెడ్ వారి ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీని పరిశీలించిన రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమశాఖ మాత్యులు పొన్నం ప్రభాకర్, ఆయిల్ఫేడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి. జిల్లా కలెక్టర్ కె.హైమావతి, ఆయిల్ పెడ్ ఎండి యాష్మిన్ భాషా, సిద్దిపేట కమిషనర్ ఆఫ్ పోలీస్ సాధన రష్మీ పెరుమాళ్ తదితరులు.**





**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) మార్చి 14 :** ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ పరిశీలన అనంతరం మీడియా సమావేశంలో మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. దేశంలోనే అత్యధిక టెక్నాలజీ తో నర్మిటలో నిర్మించిన ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీని ఈనెల 22వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి గారి చేతుల మీదుగా ప్రారంభించేందుకు ముఖ్యమంత్రి గారిని సమయం కోరడం జరిగిందని అన్నారు. అదే రోజు 40 కోట్ల రూపాయలతో ఆయిల్ రిఫైనరీ యూనిట్ నిర్మాణానికి కూడా శంకుస్థాపన చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటివరకు రాష్ట్రంలో గల ఆయిల్ పంప్ ఫ్యాక్టరీలో క్రూడ్ ఆయిల్ మాత్రమే తీయడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అందించిన ప్రోత్సాహం, అద్భుతమైన భూగర్భ జలాలు, మద్దతు ధర, సన్న వడ్లకు బోనస్ ఇవ్వడం మూలంగా మన రాష్ట్రంలో వరిని అత్యధిక శాతం పండిస్తున్నారని దాంతో దేశంలోనే అత్యధిక వరి పండే రాష్ట్రంగా తెలంగాణ రాష్ట్రం నిలిచిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో పండే బియ్యాన్ని కొనని తెగేసి చెప్పిందని ఈ సమయంలో పంట మార్పిడి చేసుకోవాల్సిన ఆవశ్యకత రైతులకు ఎంతైనా ఉందని అన్నారు. ముఖ్యంగా ఎలాంటి చీడ, పీడ బాధలు, అడవి పందులు, కోతులు, వడగండ్ల వానల బాధలు లేని రైతుకు స్థిరమైన అధిక ఆదాయాన్ని సమకూర్చే ఆయిల్ ఫామ్ తోటల పెంపకానికి రైతులు ముందుకు రావాలని అన్నారు. రైతులు ధైర్యంగా ముందుకు వచ్చి ఆయిల్ ఫామ్ పంటలు పండించాలని అన్నారు. వ్యవసాయ శాఖ మంత్రిగా మొదటి సంతకం నర్మెట్ట ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ నిర్మాణానికి చేశానని అప్పుడు 12000 ఉన్న ధర ఇప్పుడు 21 546 కు చేరిందని అన్నారు. 25 వేల పెంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నానని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని వాతావరణం ఆయిల్ ఫామ్ పంటలు పండడానికి అనుకూలమైనవని, రాష్ట్రంలో 20 లక్షల ఎకరాలలో, దేశవ్యాప్తంగా 70 లక్షల ఎకరాల్లో పంటలు పండించడానికి అనుకూలమని అన్నారు. వంట నూనెల కోసం ప్రతి సంవత్సరం మన దేశం లక్ష కోట్ల రూపాయలు ఖర్చు చేసి మలేషియా, ఇండోనేషియా లాంటి దేశాల నుండి ఆయిల్ ను దిగిమతి చేసుకుంటుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి సెంట్రల్ పాయింట్ లో ఉన్న సిద్దిపేట లో నిర్మించిన ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల ఆయిల్ ఫామ్ రైతులకు అందుబాటులోకి ఉంటదని తెలిపారు. ఫ్యాక్టరీ ని ప్రారంభించడంతోపాటు 20, 21, 22 తేదీలలో ఫ్యాక్టరీ ఆవరణలో రైతు మేళా నిర్వహించి, వ్యవసాయ పనిముట్ల ను ప్రదర్శించి వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు మరియు అనుభవం గల ఆయిల్ ఫామ్ రైతులచే రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుందని అన్నారు.

**మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ...**

ఈ మధ్య గుజరాత్ వెళ్లినప్పుడు అక్కడ పాల సేకరణ గ్రామీణ స్థాయి నుండి జరుగుతుంది..అక్కడి అమూల్ పాలు దేశ వ్యాప్తంగా వ్యాపించాయి. ఇక్కడ ఆయిల్ ఫామ్ కి తుమ్మల నాగేశ్వరరావు స్టార్ట్ చేశారు.. ప్రతి జిల్లాలకు ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ప్రారంభించాలని బావిస్తున్నారు..ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ గతంలో ప్రతిపాదనలు జరిగినప్పటికీ 300 కోట్లు కేటాయించి తుమ్మల నాగేశ్వరరావు పనులు పూర్తి చేయించారు..ఈ ప్రాంత రైతాంగానికి ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ఎంతగానో ఉపయోగపడుతుంది..ఈ ప్రాంత రైతులు ఆయిల్ ఫామ్ పై దృష్టి సారించాలి..మా ప్రాంతంలో ఆయిల్ ఫామ్ పంట పండదు అనే అపోహ నుండి తుమ్మల బయటకు తీసుకొచ్చారు..ఇక్కడి రైతులు ఆయిల్ ఫామ్ పై ఆసక్తి చూపుతున్నారు..ప్రకృతి వైపరీత్యాల దృష్ట రైతులు ఆయిల్ పామ్ సాగు చేయాలనీ ఈ ప్రాంత రైతులను కోరుతున్నానని ఈ ఆయిల్ ఫ్యాక్టరీ కి రూపం తెచ్చిన మంత్రికి ధన్యవాదములు అని తెలిపారు.

**ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి మాట్లాడుతూ..**

ఆయిల్ ఫామ్ అంటేనే తుమ్మల నాగేశ్వరరావు అని, ఫ్యాక్టరీ నిర్మాణం త్వరగా పూర్తి అయ్యేందుకు ప్రత్యేక చొరవ చూపారని అన్నారు. రైతులు సంతోషంగా ఉండాలంటే ఆయిల్ ఫామ్ పంటలను వేసుకోవాలని అన్నారు.

**జిల్లా కలెక్టర్ కె హైమావతి మాట్లాడుతూ..**

సాధారణంగా వరిని పండించడం రైతులకు అలవాటైందని, పంట మార్పిడి చేసుకోక పోతే భవిష్యత్తులో ఇబ్బంది పడతారని అన్నారు. ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ నిర్మాణం అనేది ప్రభుత్వ మంచి సంకల్పం అని, లాభదాయకంగా వ్యవసాయం కొనసాగించాలంటే తప్పనిసరిగా ఆయిల్ ఫామ్ సాగు వైపు రైతులు ముందు రావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట ఆర్డీవో సదానందం, జిల్లా వ్యవసాయ అధికారి స్వరూపారాణి, ఆయిల్ ఫేడ్ అధికారులు సుధాకర్ రెడ్డి, శ్రీకాంత్ ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చెరువుల్లో గుఱ్ఱపుడెక్క ఆకు పేరుకుపోవడంపై ఎమ్మెల్యే ఆందోళన

**పెద్ద చెరువు, కుమ్మరికుంట చెరువులను పరిశీలించిన ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి**





**ఎల్బీనగర్ ప్రతినిధి । వార్త సంధ్య:** ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవి రెడ్డి సుధీర్ రెడ్డి శుక్రవారం తన నియోజకవర్గ పరిధిలోని చెరువులను పరిశీలించారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని పెద్ద చెరువు, హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని కుమ్మరికుంట చెరువుల్లో పేరుకుపోయిన గుఱ్ఱపుడెక్క ఆకును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న వాకర్స్ మాట్లాడుతూ చెరువుల్లో పెరుగుతున్న గుఱ్ఱపుడెక్క ఆకుతో దోమలు అధికంగా పెరిగాయని, వాకింగ్‌కు రావడానికి కూడా భయపడుతున్నామని తెలిపారు. దోమల కారణంగా మలేరియా, డెంగీ వంటి వ్యాధులు వస్తాయేమోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రజా సమస్యలను దృష్టిలో ఉంచుకుని చెరువుల్లో గుఱ్ఱపుడెక్క ఆకు పెరగకుండా చర్యలు తీసుకున్నామని గుర్తు చేశారు. దోమల నివారణ కోసం డ్రోన్ సాంకేతికతను ఉపయోగించి చెరువుల్లో మందులు పిచికారీ చేసినట్లు తెలిపారు. అలాగే దోమల లార్వాను నివారించేందుకు గంబూజియా జాతికి చెందిన వేలాది చేప పిల్లలను చెరువుల్లో వదిలినట్లు చెప్పారు. ఈ చర్యల వల్ల దోమల వ్యాప్తిని నియంత్రించగలిగామని ఆయన పేర్కొన్నారు. కానీ ప్రస్తుతం ప్రభుత్వం చెరువుల్లో పెరుగుతున్న గుఱ్ఱపుడెక్క ఆకును తొలగించడంలో నిర్లక్ష్యం చూపుతోందని విమర్శించారు. ప్రజలు విషజ్వరాలతో బాధపడుతున్నప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదని అన్నారు.ప్రస్తుతం ఉదయం, సాయంత్రం వాకింగ్‌కు వచ్చే ప్రజలు దోమల దాడి కారణంగా భయపడుతున్నారని తెలిపారు. కొందరు కాంగ్రెస్ నాయకులు చిల్లర రాజకీయాలు చేస్తూ ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. జంట నగరాల అభివృద్ధి గురించి గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం ప్రస్తుతం ఉన్న నగరాన్నే కాపాడుకోలేకపోతుందని ఆయన అన్నారు. అయితే త్వరలోనే చెరువుల్లో పేరుకుపోయిన గుఱ్ఱపుడెక్క ఆకును రెండు మూడు రోజుల్లో తొలగించి, చుట్టుపక్కల కాలనీల్లో దోమల నివారణ కోసం స్ప్రే చేయించేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు కొప్పుల విఠల్ రెడ్డి, సామ తిరుమల రెడ్డి, చెన్నగొని శ్రీధర్ గౌడ్, జగదీష్ యాదవ్, టంగుటూరి నాగరాజు, జక్కిడి రఘువీర్ రెడ్డి, భాస్కర్ సాగర్, గోరిగే ప్రదీప్ తదితర నాయకులు, కాలనీ వాసులు, పలువురు వాకర్స్ పాల్గొన్నారు.

## జిల్లాలో గ్యాస్ సిలిండర్లకు ఎలాంటి కొరత లేదు

**ప్రజలు ఆందోళన చెందవద్దు**

**కృత్రిమ కొరత సృష్టిస్తూ గ్యాస్ సిలిండర్లను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే కఠిన చర్యలు**

**: అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి**

**రంగారెడ్డి జిల్లా బ్యూరో । వార్త సంధ్య:** జిల్లాలో గృహ అవసరాలకు వినియోగించే ఎల్పిజి గ్యాస్ సిలిండర్లకు ఎలాంటి కొరత లేదని ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి తెలిపారు. శనివారం సరూర్‌నగర్ తహసీల్దార్ కార్యాలయంలో జిల్లాలో గ్యాస్ సరఫరా పరిస్థితిపై పోలీస్, సివిల్ సప్లై, రవాణా, విద్య, వైద్య ఆరోగ్య శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా






జిల్లాలో గ్యాస్ సరఫరా పరిస్థితులను అధికారులతో తెలుసుకుని అవసరమైన దిశానిర్దేశం చేశారు. గ్యాస్ సిలిండర్ల సరఫరాలో ప్రజలకు ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలు, పాఠశాలల్లో గ్యాస్ సరఫరా నిరంతరంగా కొనసాగాలని సూచించారు. ప్రతి హాస్టల్, విద్యాసంస్థలను సందర్శించి పరిస్థితిని పరిశీలించాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రులకు అవసరమయ్యే గ్యాస్ సరఫరాపై వైద్యాధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఆస్పత్రుల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లాలో ఎవరైనా కృత్రిమ కొరత సృష్టిస్తూ గ్యాస్ సిలిండర్లను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీస్ మరియు రవాణా శాఖలు ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లను కమర్షియల్ అవసరాలకు ఉపయోగిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. రాష్ట్ర పౌర సరఫరాలు, సాగునీటి శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలో గ్యాస్ సరఫరా పర్యవేక్షణ కోసం డిస్ట్రిక్ట్ ఎనర్జీ సప్లై మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా, జిల్లా సివిల్ సప్లై అధికారి కన్వీనర్‌గా మొత్తం 12 మంది సభ్యులతో కమిటీ పనిచేస్తుందని పేర్కొన్నారు. ఈ కమిటీ గ్యాస్ సరఫరాపై నిరంతరం పర్యవేక్షణ చేస్తూ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. అనంతరం సరూర్‌నగర్‌లోని ఐశ్వర్య గ్యాస్ ఏజెన్సీ, వనస్థలిపురంలోని శ్రీనివాస్ గ్యాస్ ఏజెన్సీ గోదాములను అదనపు కలెక్టర్ తనిఖీ చేసి సరఫరా యథావిధిగా కొనసాగించాలని సూచించారు. ఈ సమావేశంలో కందుకూరు ఆర్డీఓ జగదీశ్వర్ రెడ్డి, జిల్లా సివిల్ సప్లై అధికారి వనజాత, జిల్లా వైద్యాధికారి లలితాదేవి, సంక్షేమ శాఖ అధికారులు, ఎల్పిజి డిస్ట్రిబ్యూటర్లు మరియు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రశాంత వాతావరణంలో పదో తరగతి పరీక్షలు

కేంద్రాల వద్ద 144 సెక్షన్

ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు

ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పరీక్షలు

అరగంట ముందుగానే పరీక్షా కేంద్రంలోకి విద్యార్థులకు అనుమతి



రాష్ట్రవ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. ఉదయం 8 గంటలకే విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. నేటి నుంచి ఏప్రిల్ 16 వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. హైదరాబాద్‌లోని నాంపల్లి, అబిడ్స్‌లో అరగంట ముందుగానే పరీక్షా కేంద్రంలోకి విద్యార్థులను అనుమతించారు. ఎగ్జామ్ సెంటర్‌లో అధికారులు మౌలిక వసతులు ఏర్పాటు చేశారు. కుత్బుల్లాపూర్ మండల పరిధిలోని పరీక్షా కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు.

**ఈ పరికరాలు అనుమతి లేదు :** పదో తరగతి పరీక్షలు మొదటి రోజు కావడంతో విద్యార్థులు తమ తల్లిదండ్రులతో పరీక్ష కేంద్రానికి చేరుకున్నారు. పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బోర్డుపై విద్యార్థులు తమ హాల్ టికెట్ నెంబర్‌తో వారికి కేటాయించిన ఎగ్జామ్ హాల్ వివరాలు తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి లోపలికి పంపించారు. కేంద్రంలోకి ఎలక్ట్రానిక్ పరికరాలు, స్మార్ట్ వాచ్‌లను అనుమతించ లేదు. కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కొంతమంది విద్యార్థులు ఆలస్యంగా వచ్చినప్పటికీ, పరీక్ష ప్రారంభమైన తర్వాత ఐదు నిమిషాల్లోపు వచ్చిన వారికి అధికారులు అనుమతి ఇచ్చి పరీక్షకు హాజరయ్యేలా చేశారు.

**విద్యార్థుల కోసం ప్రత్యేక సౌకర్యాలు :** పదో తరగతి పరీక్షల నేపథ్యంలో చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, అడిషనల్ డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్లలతో పాటు సిట్టింగ్ స్క్వాడ్లు పరీక్ష కేంద్రాల్లో తనిఖీ చేయనున్నారు. విద్యార్థుల కోసం కేంద్రాల్లో నీరు, విద్యుత్ సౌకర్యాలను ఏర్పాటు చేశారు. పరీక్ష సమయంలో విద్యార్థులు అస్వస్థతకు గురైతే తక్షణమే చికిత్స అందించేందుకు ప్రతి కేంద్రం వద్ద వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రథమ చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేసి బీఎన్ఎస్ఎస్ 163 చట్టాన్ని అమలు చేశారు. కేంద్రాల్లో మాస్ కాపీయింగ్ జరగకుండా స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించి, విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాసుకునేలా అన్ని ఏర్పాటు చేశామని అధికారులు పేర్కొన్నారు.

**పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు :** యాదాద్రి భువనగిరి జిల్లా గత ఏడాది రాష్ట్రంలో 7వ స్థానంలో ఉందని, ఈసారి మొదటి స్థానం వచ్చేలా లక్ష్యంగా పెట్టుకున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి తెలిపారు. పరీక్షల నిర్వహణకు 572 మంది ఇన్విజిలేటర్లను నియమించినట్లు వెల్లడించారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని జిల్లా పోలీసు యంత్రాంగం తెలిపింది. అలాగే డీఈవో కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఏమైనా సందేహాలు ఉంటే 9281423623 నెంబర్ కి ఫోన్ చేయవచ్చని విద్యా శాఖ అధికారులు స్పష్టం చేశారు.


**రాత్రి తండ్రి మరణం - ఉదయం కుమారుడి పరీక్ష :** ఓ విద్యార్థి తండ్రి మరణాన్ని దిగమింగుకొని పుట్టెడు దుఃఖంతో శనివారం ఉదయం పదో తరగతి పరీక్షకు హాజరయ్యాడు. ఈ విషాధ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లాలో చోటు చేసుకుంది. ఆ అబ్బాయి స్థానిక సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియంలో 10వ తరగతి చదువుతున్నారు. ఇవాళ ఉదయం వార్షిక పరీక్షలు రాయాల్సింది ఉండగా, శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో తన తండ్రి కూరెళ్ల ఎల్లయ్య గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన గుండాల మండలంలోని ఎంపీపీఎస్ వస్తకొండూరులో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. శుక్రవారం రాత్రి అకస్మాత్తుగా ఛాతీలో నొప్పి రావడంతో నల్గొండలో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించగా, పరిస్థితి తీవ్రంగా ఉందని హైదరాబాద్‌కు తరలించాలని వైద్యులు సూచించారు. అనంతరం హైదరాబాద్‌కు వెళ్లే మార్గంమధ్యలోనే ఆయన తుదిశ్వాస విడిచాడు.

# 'ఎలా ఉరి వేసుకోవాలో సూచనలిచ్చి, నవ్వుతూ వీడియో'

భార్యను బలి తీసుకున్న భర్త

కడప జిల్లా రాజంపేటలో వివాహిత ఆత్మహత్య కేసులో సంచలన విషయాలు

భార్య ఉరి వేసుకుంటుండగా అడ్డుకోవాల్సిన భర్త ఆమెను ఆత్మహత్యకు ప్రేరేపించిన వైనం



వైఎస్సార్ కడప జిల్లా రాజంపేటలో వివాహిత ఆత్మహత్య కేసులో సంచలన విషయాలు వెలుగు చూస్తున్నాయి. భార్య ఉరి వేసుకుంటుండగా అడ్డుకోవాల్సిన భర్త ఆమెను ఆత్మహత్యకు ప్రేరేపించినట్లు వీడియో బయటికి రావడం కలకలం రేపుతోంది.పూర్తి వివరాల్లోకి వెళ్తే, ఒంగోలుకు చెందిన శ్రీరామ్ శ్రీనివాస్ రైల్వేశాఖలో లోకో పైలట్‌గా పని చేస్తున్నాడు. 2016లో రైలు కిందపడి మొదటి భార్య చనిపోయాక ఆ విషయాన్ని దాచి పెట్టి నందలూరుకు చెందిన కృష్ణవేణిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొంతకాలంగా దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నట్లు సమాచారం.'ఎలా ఉరి వేసుకోవాలో సూచనలు చేస్తూ, నవ్వుతూ వీడియో తీస్తూ'.బయట నిలబడి నవ్వుతూ వీడియో చిత్రీకరణ : ఉద్యోగం చేస్తూనే శ్రీరామ్ శ్రీనివాస్ రాజంపేట బోయినపల్లిలో రైల్వే కోచింగ్ సెంటర్ కూడా నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో ఇటీవల మరోసారి దంపతుల మధ్య గొడవ జరిగింది. తీవ్ర ఆవేశానికి లోనైన కృష్ణవేణి గదిలోకి వెళ్లి తలుపు వేసుకుని ఫ్యాన్‌కు ఉరి వేసుకునేందుకు ప్రయత్నించింది. అయితే ఆమెను ఆపాల్సిన భర్త శ్రీనివాసులు బయట నిలబడి, ఉరి ఎలా వేసుకోవాలో సూచనలు చేస్తూ, నవ్వుతూ వీడియో చిత్రీకరించడంపై తీవ్ర కలవరం రేపింది. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విమర్శలకు దారి తీసింది. భార్యను తీవ్రంగా వేధిస్తున్నాడని బాధితురాలి కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు.భార్య మృతి చెందాక మద్యం సేవించి? : భార్య ఉరి వేసుకుని మృతి చెందిన అనంతరం శ్రీనివాసులు బయటకు వెళ్లి మద్యం సేవించినట్లు సమాచారం. అనంతరం తన భార్య మరణించిన విషయాన్ని ఒంగోలులోని తన కుటుంబ సభ్యులకు తెలియజేశాడు. సాయంత్రం తీరిగ్గా రాజంపేట పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పంచనామా నిమిత్తం రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు."శ్రీరామ్ శ్రీనివాస్‌కు పెళ్లై ఇద్దరు పిల్లలు ఉన్నారు. మొదటి భార్యను రైలు కిందకుతోసి చంపేశాడు. అనంతరం మా ఆడబిడ్డను వివాహం చేసుకున్నాడు. ఇది రెండో పెళ్లని మాకు తెలీదు. రోజూ తాగివచ్చి భార్యను తీవ్రంగా వేధించేవాడు. ఈ విషయాలను కృష్ణవేణి మాకు చెప్పేది కాదు. ఈ వేధింపులు భరించలేక కృష్ణవేణి చివరకు ఆత్మహత్యకు యత్నించింది. ఆమెను ఆపాల్సిన భర్త ఎలా ఉరి వేసుకోవాలో సూచనలు చేస్తూ, నవ్వుతూ వీడియో తీశాడు. తనకు ఉద్యోగం ఉందనే అహంకారంతోనే ఇలా చేశాడు." - మల్లేశ్వరి, మృతురాలి బంధువు

**తల్లీకుమార్తె మృతి :** మరో ఘటనలో వివాహ సంబంధిత అంశంపై మనస్తాపానికి గురైన తల్లీకుమార్తె విషం తీసుకుని బలవన్మరణం చెందిన ఘటన బాపట్ల జిల్లా ద్రోణాదుల గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న యువతికి కొద్ది రోజుల క్రితం వివాహ నిశ్చయ తాంబూలాలు అందుకున్నారు. ఈ క్రమంలో కొద్దిపాటి విషయమై మనస్తాపానికి గురైన తల్లీకుమార్తె ఈ నెల 4న ఎలుకల మందు తిని, శీతలపానీయంలో పురుగు మందు కలుపుకొని తాగినట్లు యువతి తండ్రి గుర్తించారు.ప్రాథమిక చికిత్స కోసం చిలకలూరిపేటలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అనంతరం వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించగా చికిత్స పొందుతూ గురువారం ఉదయం యువతి, మధ్యాహ్నం ఆమె తల్లి ప్రాణాలు విడిచినట్లు డాక్టర్లు నిర్ధారించారు. సమాచారం అందుకున్న మార్టూరు పోలీసులు గుంటూరు ఆసుపత్రికి వెళ్లి శవ పంచనామా నిర్వహించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. యుద్ధం నేపథ్యంలో అమెరికా నుంచి యువతి సోదరుడు రాకపై సందిగ్ధత నెలకొంది.

# లిక్కర్ స్కాం లంచాలతో స్థిరాస్థుల కొనుగోలు


ఏ1 రాజ్ కెసిరెడ్డిదే అగ్రభాగం

రూ.184.36 కోట్ల విలువైన స్థిరాస్తులు కూడబెట్టిన రాజ్ కెసిరెడ్డి

లంచాల్ని వేర్వేరు వ్యక్తులతో తన సంస్థల ఖాతాల్లోకి జమ

తర్వాత స్థిరాస్తి వ్యాపారంలోకి మళ్లించారన్న ఈడీ

స్కామ్‌లో రూ.3,500 కోట్ల లంచాలు వసూలు



వైఎస్సార్సీపీ హయాంలో జరిగిన మద్యం స్కామ్‌లో ఇటీవల ఈడీ జప్తు చేసిన 441 కోట్ల ఆస్తుల్లో ఏ1 రాజ్ కెసిరెడ్డిదే అగ్రభాగం. ఆయన మొత్తంగా రూ. 270 కోట్లకు పైగా ఆస్తులు కూడబెట్టగా అందులో రూ. 184 కోట్లతో స్థిరాస్తులు కొన్నట్లు ఈడీ గుర్తించింది. డొల్ల కంపెనీల్లోకి లంచాల సొమ్ము పంపి వాటి ద్వారా స్థిరాస్తి లావాదేవీలు నిర్వహించినట్లు తెలిపింది.వైఎస్సార్సీపీ హయాంలో జరిగిన వేల కోట్ల మద్యం కుంభకోణం కేసులో ప్రధాన నిందితుడైన రాజ్ కెసిరెడ్డి లంచాల సొమ్మును వివిధ మార్గాల్లో మనీలాండరింగ్ చేయించి రూ. 184.36 కోట్ల విలువైన స్థిరాస్తులు కూడబెట్టినట్లు ఈడీ దర్యాప్తులో తేలింది. డిస్టిలరీలు, మద్యం సరఫరా కంపెనీల నుంచి వసూలు చేసిన సొత్తును వేర్వేరు వ్యక్తుల ద్వారా తన సంస్థల ఖాతాల్లోకి జమ చేయించుకుని స్థిరాస్తి వ్యాపారంలోకి మళ్లించినట్లు వెల్లడైంది. మద్యం కుంభకోణంలో రూ. 3,500 కోట్ల లంచాలు వసూలు చేశారని గుర్తించిన ఈడీ అందులో రూ. 1,048 కోట్ల మూలాలను గుర్తించి రూ. 441 కోట్ల విలువైన ఆస్తులు జప్తు చేసింది. ఆ మొత్తంలో రూ. 270 కోట్లకు పైగా ఆస్తులు రాజ్ కెసిరెడ్డివే.వాటితో స్థిరాస్తుల కొనుగోలు: 2019లో అధికారం చేపట్టిన వైఎస్సార్సీపీ ప్రభుత్వం లంచాల వసూళ్లకు వీలుగా నూతన మద్యం విధానం తీసుకొచ్చిన కొన్నాళ్లలోనే రాజ్ కెసిరెడ్డి పలు సంస్థలు స్థాపించి, మనీ లాండరింగ్‌కు పాల్పడినట్లు ఈడీ గుర్తించింది. 2020 అక్టోబరులో రాజ్ కెసిరెడ్డి ఈడీ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ నెలకొల్పారు. అందులో రాజ్, ఆయన తల్లి సుభాషిణి డైరెక్టర్లుగా రూ. 10 లక్షలు పెట్టుబడి పెట్టారు. కొద్ది రోజుల్లోనే సంబంధం లేని వ్యక్తులు, సంస్థల నుంచి ఈడీ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఖాతాల్లోకి భారీగా డబ్బులు జమయ్యాయి. అక్కడి నుంచి ఆ సొత్తు రాజ్ కెసిరెడ్డి ఖాతాల్లోకి మళ్లింది. వాటితో ఆయన పలు స్థిరాస్తులు కొన్నారు. ఈడీ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై పలు సినిమాలు తీశారు.ప్రస్తుతం ఈడీ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఖాతాలో, ఫిక్స్‌డ్ డిపాజిట్లలో కలిపి రూ. 7.31 కోట్లు ఉన్నట్లు ఈడీ గుర్తించి, జప్తు చేసింది. రాజ్ కెసిరెడ్డి 2021 సెప్టెంబరులో స్థిరాస్తి వ్యాపారం కోసమంటూ ఈషాన్వీ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌ను ఏర్పాటు చేశారు. 2022 జనవరి-మార్చి మధ్య ఈ సంస్థ ఖాతాల్లో రూ. 4.73 కోట్లు జమయ్యాయి. మద్యం లంచాల సొమ్మును మనీ లాండరింగ్ చేయడానికి రాజ్ దీన్ని వాడుకున్నారు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో రాజ్ కెసిరెడ్డికి సంబంధించిన సైట్ డెవలప్‌మెంట్ కోసమంటూ ఎస్‌బీఎల్ డ్రీమ్ హోమ్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఈషాన్వీ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ మధ్య ఒప్పందం కుదిరింది. సెక్యూరిటీ డిపాజిట్ పేరిట ఎస్‌బీఎల్ డ్రీమ్ హోమ్స్ ఖాతాలో కోటి జమ చేశారు. వాస్తవంగా ఎలాంటి డెవలప్‌మెంట్ జరగలేదు. మద్యం లంచాల సొమ్ము రూటింగ్ కోసం ఎస్‌బీఎల్‌ను వాడారు. నగదు రూపంలో వసూలు చేసిన సొమ్మును రాజ్ తన మనుషుల ద్వారా తాళ్ల అవినాష్‌గౌడ్‌కు చేర్చేవారు. ఆయన టీఏజీ డెవలపర్స్, సాయి మెటల్స్ తదితర సంస్థల బ్యాంకు ఖాతాల నుంచి ఆ సొమ్ము రాజ్ చెప్పిన వారి ఖాతాల్లోకి మళ్లించేవారు. భూములు కొన్నప్పుడు ఈ ఖాతాల ద్వారానే డబ్బులు చెల్లించారు.

**అంతా మద్యం ముడుపుల సొమ్ముతోనే:** రాజ్ కెసిరెడ్డి 2021 ఆగస్టు నుంచి 2021 డిసెంబరు మధ్య తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం మాచన్‌పల్లి గ్రామంలోని వివిధ సర్వే నంబర్లలో రూ. 120.51 కోట్ల విలువైన 16.56 ఎకరాల భూమి కొన్నారు. 2023 మే 22న హైదరాబాద్‌లోని షేక్‌పేట్‌లో రూ. 3.25 కోట్ల విలువైన 108.42 గజాల స్థలం కొనుగోలు చేశారు. రాజ్ కెసిరెడ్డి తల్లి సుభాషిణి పేరిట మాచన్‌పల్లిలో రూ. 4.38 కోట్ల విలువైన ఆస్తుల్ని కొన్నారు. తన ప్రధాన అనుచరుడైన బూనేటి చాణక్య పేరిట రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం చిప్పలపల్లెలో దాదాపు రూ. 18 కోట్ల విలువైన సుమారు 4 ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. ఇవన్నీ మద్యం ముడుపుల సొమ్ముతో కొన్నవేనని ఈడీ గుర్తించి జప్తు చేసింది.

# వరకట్నం ఇవ్వొద్దు, తీసుకోవద్దు

కోలం ఆదివాసి తెగ వినూత్న తీర్మానం

సమాజంలో ఆర్థిక ఆడంబరాల వేడుకగా పెళ్లిళ్లు

గొప్పలకు పోయి అప్పుల పాలవుతున్న కుటుంబాలు

ప్రత్యేక కార్యక్రమానికి బీజం వేసిన ఆదివాసి తెగ

వరకట్నం నిషేధిస్తూ తీర్మానం చేసిన ఆదివాసి తెగ



పెళ్లంటే నూరేళ్ల పంట. ఐతే ప్రస్తుతం డీజే చప్పుళ్లు, రెడీమేడ్ పందిళ్లు, వరకట్నం దగ్గర తగ్గేదేలే అంటున్నారు. పట్టువిడుపులకు పోతున్నారు. ఈ నేపథ్యంలో ఆదిలాబాద్ జిల్లాలోని ఆదిమ కొలాం గిరిజన తెగ అప్రమత్తమైంది. వరకట్నం తీసుకోవద్దు వధువు కుటుంబంపై ఆర్థిక భారం వేయొద్దంటూ ప్రత్యేక తీర్మానం చేసింది. ఆ గిరిజన తెగంతా ఎందుకు ఇలాంటి నిర్ణయం తీసుకుంది? వీటి వెనుక కారణాలేంటి? అనే విషయాలను ఇప్పుడు తెలుసుకుందాం.

**వధువు కుటుంబాలపై ఆర్థిక భారం పడకుండా :** పెళ్లంటే ఆర్థిక ఆడంబరాల వేడుకగా మారిపోతోంది. పేదలు, సామాన్య కుటుంబాలక ఓ పరీక్షగా తయారవుతోంది. ఆడపిల్లల తల్లితండ్రులను ఆర్థికంగా కుంగుబాటుకు గురిచేస్తోంది. కుటుంబ పెద్దలకు పెళ్లికి ముందున్న సంతోషం పెళ్లి తర్వాత లేకుండా పోతోంది. ఒక్కోసారి అప్పులు అనర్థాలకు దారితీస్తున్నాయి. ఇలాంటి విపత్కర పరిస్థితుల ప్రభావం కుటుంబాలపై పడకూడదనే ఆలోచనతో ఆదిలాబాద్ జిల్లాలోని ఆదిమ కొలాం తెగ కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. వరకట్నం తీసుకోవద్దు వధువు కుటులుంబాలపై ఆర్థికభారం పడనీయవద్దు అంటూ తొమ్మిది అంశాలతో తీర్మానం చేసింది.

**బహుమతిగా డబ్బులే ఇవ్వాలి :** వరకట్నాలకు తావీయకుండా కట్టుబాట్లతో కూడిన పెళ్లి పేరంటాల నిర్వహణను ఎలా నిర్వహించాలనే దానిపై ఆదిమ కొలాం తెగ పెద్దలు ఆదిలాబాద్ జిల్లా సాత్నాల మండలం టెంగ్రీగూడలో సమావేశమయ్యారు. పెళ్లి, నిశ్చితార్థం అంటూ ఆడంబరాలకు వెళ్లి అనవసర ఖర్చులు చేయకుండా కొంతమంది సమక్షంలో పూర్తి చేయాలని నిర్ణయించారు. పెళ్లికి ఖరీదైన రెడీమెడ్ మండపాన్ని ఏర్పాటు చేయకుండా పచ్చనిపందిరి వేసి సంప్రదాయరీతిలో చేసుకోవాలని తీర్మానించారు. బంధువులు వధూవరులకు బహుమతిగా డబ్బులే ఇవ్వాలని సూచించారు. ఈ తీర్మానానికి జైనథ్, సాత్నాల, బేల, ఆదిలాబాద్ గ్రామీణ మండలాలకు చెందిన కొలాం తెగ పెద్దలు అంగీకరించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతోపాటు రాష్ట్రవ్యాప్తంగా కొలాం తెగలో అమలు చేయాలనే సమాలోచన చేశారు."ఆదిమ గిరిజన కొలాం సేవాసంఘంలో రాష్ట్రవ్యాప్తంగా పూర్తిగా దీనిని అమల్లోకి తీసుకువస్తాం. ఈ రోజు నుంచి కట్నకానుకలు ఏవీ పెట్టకుండా రెండు వందలు లేదా ఐదు వందలు వధూవరులతోనే సమర్పించి, వాళ్లకు ఒక మంచి జీవితం కొనసాగించేవిధంగా చేస్తాం. ఈ రోజు నుంచి కట్న కానుకలను నిషేధిస్తున్నామని తెలియపరుస్తున్నాం. ఈ తీర్మానం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆదివాసీలందరినీ చైతన్య పరిచే విధంగా ప్రతి పెళ్లిళ్లలో, మహాజర్లలో కలిసి ఈ విషయాలను చెబుతూ కట్నకానుకలు నిషేధించాలని కోరుతాం. గ్రామగ్రామానికి సందర్శించి అందికీ తెలియపరుస్తాం"-కొలాం తెగ పెద్దలు

కొలం గిరిజన తెగ నాయకులు చేసిన తీర్మానాలివే :

కట్నం ఇవ్వొద్దు, అడగొద్దు. ఎంగేజ్‌మెంట్‌ను అవసరానికి అనుగుణంగా చేసుకోవాలి.

పెళ్లిళ్లలో ఆడంబరాలకు పోయి అప్పులపాలు కావొద్దు.

పెళ్లిపందిరి సంప్రదాయ పద్ధతిలో మాత్రమే ఉండాలి.

రూ.వేలు, లక్షలు ఖర్చుచేసి రెడీమెడ్ పెళ్లి పందిళ్లు వేయొద్దు.

పెళ్లిచేసే పురోహితులు, కుటుంబ సభ్యులు, పెద్దలు మద్యం, గంజాయి సేవించరాదు.

పెళ్లిళ్లలో ఆర్భాటంగా డీజే బాక్సులు పెట్టరాదు. డోలు, పెంప్రీ వాయిద్యాలతోనే వేడుకలు నిర్వహించుకోవాలి.

వరకట్నాలు ఇచ్చుకోలేక చాలా కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులకు గురవుతుండటంతోనే ఈ మేరకు తీర్మానం చేసి ఈ సంవత్సరం నుంచి అమలు చేయాలని నిర్ణయించినట్లుగా కొలాం సంఘ రాష్ట్ర అధ్యక్షుడు సోనేరావు, జిల్లా అధ్యక్షుడు గోవిందరావు, ఉపసర్పంచి కొడప అయ్యు తెలిపారు.ఇటీవల కాలంలో వరకట్న వేధింపులతో ఆయా కుటుంబాల్లో మనస్పర్థలు ఏర్పడి విచ్ఛిన్నమవుతున్నాయి. అలాంటి ఘటనలను దృష్టిలో ఉంచుకునే కొలాం గిరిజన తెగకు చెందిన వారు ఇలాంటి నిర్ణయం తీసుకున్నట్లుగా తెలుస్తోంది.

# ఉద్దానం ప్రజలకు ఊరట - విజయవంతంగా కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్స

కూటమి ప్రభుత్వం చొరవతో ఉద్దానానికి కొత్త ఊపిరి

ఉద్దానం కిడ్నీ ఆసుపత్రిలో తొలిసారి కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్స విజయవంతం

కుమార్తెకు మూత్రపిండం దానం చేసిన తండ్రి



కిడ్నీ సంబంధిత వ్యాధితో బిక్కు బిక్కుమంటూ కొన్ని సంవత్సరాలుగా జీవిస్తున్న ఉద్దానం బాధితులకు భరోసానిచ్చేందుకు కూటమి ప్రభుత్వం అడుగులు వేసింది. అందుకు ఉదాహరణే పలాసలోని కిడ్నీ ఆసుపత్రిలో తొలిసారి కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్స. ఎటువంటి అవాంతరాలు ఎదురుకాకుండా సజావుగా ఆపరేషన్ పూర్తైంది.శ్రీకాకుళం జిల్లా ఉద్దానం ప్రజలకు ఊరట లభించింది. పలాసలోని కిడ్నీ ఆసుపత్రిలో తొలిసారి కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్స విజయవంతంగా పూర్తైంది. కిడ్నీ వ్యాధి నిపుణులైన రవిరాజు, ఉమామహేశ్వరరావుల ఆధ్వర్యంలో వైద్యుల బృందం సుమారు నాలుగు గంటల పాటు శ్రమించి శస్త్ర చికిత్స విజయవంతం చేశారు. అంతేకాకుండా రోగి, దాత ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు ఈ సందర్భంగా వెల్లడించారు. ఇందుకుగాను వైద్యుల బృందానికి పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ధన్యవాదాలను తెలియజేశారు.

**దేశంలోనే తొలిసారి:** సోంపేటకు చెందిన హేమ శ్రీ అనే యువతి మూత్రపిండాలు పాడవడంతో ఆమె తండ్రి మోహనరావు కిడ్నీని దానం చేశారు. శస్త్రచికిత్స అనంతరం బాధిత మహిళ బాగానే పని చేస్తోందని, మరొక 15 రోజులపాటు పోస్టు ఆపరేషన్ వైద్యసేవలు నిర్వహించాల్సి ఉందని వైద్యులు తెలిపారు. గ్రామీణ ప్రాంతమైన ఉద్దానంలో దేశంలోనే తొలిసారి కిడ్నీ పరిశోధనా కేంద్రం ఆసుపత్రిలో మూత్రపిండం మార్పిడి శస్త్రచికిత్సను విజయవంతం చేసిన సంబంధిత వైద్య బృందానికి రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అభినందనలను తెలియజేశారు. ఊపిరి పీల్చుకున్న ఉద్దానం ప్రజలు: అత్యంత మారుమూల ప్రాంతంలో కిడ్నీ మార్పిడి చేయడంతో ఉద్దానం ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఆసుపత్రిని తామే నిర్మించామని హెచ్చులకు పోయిన గత వైఎస్సార్సీపీ సర్కారు ఒక్క డయాలసిస్ కేంద్రాన్ని సైతం ఏర్పాటు చేయలేకపోయారు. ఈ శస్త్రచికిత్స ప్రతి ఒకరిలో భావోద్వేగాన్ని కలిగించింది.వైద్యకళాశాలకు అనుబంధంగా లేని పలాస కిడ్నీ హాస్పిటల్‌లో అవయవ మార్పిడి జరగడం ఇదే తొలిసారని భావిస్తున్నట్లు నెఫ్రాలజిస్ట్ డాక్టర్ రవిరాజ్ పేర్కొన్నారు. ఉద్దానంతో ఎక్కువగా ఈ వ్యాధి లక్షణాలు కనిపిస్తున్నాయని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కిడ్నీ మార్పిడి ఏర్పాటు చేయడం అభినందనీయమని నెఫ్రాలజిస్ట్ రవిరాజ్ అభిప్రాయపడ్డారు.' 'మారుమూల ప్రాంతమైన ఉద్దానంలో కిడ్నీ మార్పిడి చేయడంతో ఎంతో హర్షణీయం. ఆసుపత్రిని తామే నిర్మించామని గొప్పలకు పోయిన గత వైఎస్సార్సీపీ సర్కారు ఒక్క డయాలసిస్ కేంద్రాన్ని సైతం ఏర్పాటు చేయలేకపోయారు. ఈ శస్త్రచికిత్స ప్రతి ఒకరిలో భావోద్వేగాన్ని కలిగించింది. ఇందుకుగాను వైద్యుల బృందానికి ప్రజలందరి తరపున ప్రత్యేక ధన్యవాదాలను తెలియజేస్తున్నాను. "వైద్యకళాశాలకు అనుబంధంగా లేని పలాస కిడ్నీ హాస్పిటల్‌లో అవయవ మార్పిడి జరగడం ఇదే తొలిసారని అనుకుంటున్నా. ఉద్దానంతో ఎక్కువగా ఈ వ్యాధి మూలాలు కనిపిస్తుండటం విచారకరం. రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కిడ్నీ మార్పిడి ఏర్పాటు చేయడం అభినందనీయం. కిడ్నీ మార్పిడి ద్వారా బాధితుల జీవితానికి మళ్లీ పునర్జన్మను ప్రసాదించినట్లే. ఈ సందర్భంగా మా బృందానికి సహాయ సహకారాలను అందజేసిన స్థానిక ప్రజాప్రతినిధులకు, ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు.

# మాట నిలబెట్టుకున్న ఇరాన్.. హర్మ్యూజ్‌ను దాటిన రెండు భారత ఎల్పీజీ నౌకలు



పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న తరుణంలో భారత్‌కు భారీ ఊరట లభించింది. కీలకమైన హర్మ్యూజ్ జలసంధిలో భారత నౌకలకు సురక్షిత మార్గం కల్పిస్తామని ఇరాన్ ఇచ్చిన హామీ మేరకు రెండు భారతీయ ఎల్పీజీ ట్యాంకర్లు ఆ జలసంధిని విజయవంతంగా దాటాయి. 'శివాలిక్', 'నందా దేవి' అనే ఈ రెండు నౌకలు ప్రస్తుతం సురక్షిత జలాల్లోకి ప్రవేశించాయి.ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం, 'శివాలిక్' నౌక ప్రస్తుతం భారత నౌకాదళం పర్యవేక్షణలో ఉంది. మరో రెండు రోజుల్లో ఇది ముంబై లేదా కాండ్లా ఓడరేవుకు చేరుకునే అవకాశం ఉంది. ఇక రెండో నౌక అయిన 'నందా దేవి' కూడా జలసంధిని దాటింది. ఈ నౌకలో దేశ ఇంధన సరఫరా వ్యవస్థకు అత్యంత కీలకమైన 46,000 మెట్రిక్ టన్నుల ద్రవీకృత పెట్రోలియం గ్యాస్ (ఎల్పీజీ) ఉంది. ఈ రెండు నౌకల ప్రయాణాన్ని మన నౌకాదళం నిశితంగా పర్యవేక్షిస్తూ, వాటి భద్రతను చూస్తోంది.ఈ సానుకూల పరిణామం వెనుక ఉన్నతస్థాయి దౌత్యపరమైన చర్చలు ఉన్నాయి. ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఇరు దేశాల మధ్య వస్తువులు, ఇంధన రవాణాకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని ఈ సందర్భంగా చర్చించారు. ఈ చర్చల ఫలితంగానే ఇరాన్ భారత నౌకలకు సురక్షిత మార్గాన్ని కల్పించింది.భారత్ తమకు మిత్రదేశమని, ఇరు దేశాలకు ఈ ప్రాంతంలో ఉమ్మడి ప్రయోజనాలు ఉన్నాయని భారత్‌లోని ఇరాన్ రాయబారి మహమ్మద్ ఫతాలీ స్పష్టం చేశారు. "యుద్ధం తర్వాత కూడా భారత ప్రభుత్వం మాకు అనేక విధాలుగా సహాయం చేసింది. భారత్ మా మిత్రదేశం" అని ఆయన వ్యాఖ్యానించారు. ఆయన ప్రకటన చేసిన కొన్ని గంటల్లోనే భారత నౌకలకు మార్గం సుగమం కావడం గమనార్హం.ప్రపంచంలోని మొత్తం చమురు, గ్యాస్ ఎగుమతుల్లో 20 శాతం హర్మ్యూజ్ జలసంధి గుండానే జరుగుతుంది. అందుకే ఇది ప్రపంచంలోనే అత్యంత కీలకమైన సముద్ర మార్గం. ప్రస్తుతం ఈ ప్రాంతంలో 28 భారత నౌకలు, 778 మంది భారత సిబ్బంది ఉన్నారని, వారి భద్రతను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని షిప్పింగ్ మంత్రిత్వ శాఖ తెలిపింది. తాజా పరిణామంతో పశ్చిమాసియా సంక్షోభం వేళ భారత్ తన ఇంధన భద్రత విషయంలో ఒక కీలక ముందడుగు వేసినట్లయింది.

# పశ్చిమాసియా ఉద్రిక్తతల ప్రభావం

**పెరుగుతున్న విమాన టికెట్ ధరలు**

**సర్‌ఛార్జ్ పెంచిన ఇండిగో**

**విమాన ఇంధన ధరలు పెరగడంతో ప్రయాణికులపై అదనపు భారం**

**ఇండిగో ఫ్యూయల్ సర్‌ఛార్జ్ రూ.425 నుంచి రూ.2300 వరకు**

**ఇప్పటికే ఎయిరిండియా కూడా టికెట్లపై ఇంధన ఛార్జీలు అమలు**

**అంతర్జాతీయ మార్గాల్లో డాలర్లలో అదనపుఛార్జీలు**



పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్నాయి. ముఖ్యంగా ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితులు అంతర్జాతీయ చమురు మార్కెట్‌పై ప్రభావం చూపడంతో విమాన ఇంధన ధరలు (ఏటీఎఫ్) పెరుగుతున్నాయి. దీని ప్రభావం ఇప్పుడు విమానయాన రంగంలో స్పష్టంగా కనిపిస్తోంది. ఇంధన ధరలు పెరగడంతో విమానయాన సంస్థలు నిర్వహణ వ్యయాలను సమతుల్యం చేసుకునేందుకు ప్రయాణికులపై అదనపు ఛార్జీలు విధించడం ప్రారంభించాయి.ఇప్పటికే టికెట్ ధరలను పెంచిన విమానయాన సంస్థలు ఇప్పుడు ఫ్యూయల్ సర్‌ఛార్జ్ పేరిట కొత్తగా అదనపు భారం మోపేందుకు సిద్ధమయ్యాయి. దేశీయంగా పెద్ద విమానయాన సంస్థలలో ఒకటైన ఇండిగో కూడా ఇంధన సర్‌ఛార్జ్ అమలు చేయాలని నిర్ణయించింది. మార్చి 14 నుంచి ఈ కొత్త ఛార్జీలు అమల్లోకి రానున్నట్లు సంస్థ ప్రకటించింది. ఇండిగో ప్రకటించిన వివరాల ప్రకారం, ఒక్కో విమాన టికెట్‌పై రూ.425 నుంచి రూ.2300 వరకు ఫ్యూయల్ సర్‌ఛార్జ్ వసూలు చేయనున్నారు. దీనివల్ల ఇప్పటికే పెరిగిన విమాన టికెట్ ధరలు మరింత పెరగనున్నాయి. ప్రయాణించే మార్గాన్ని బట్టి ఈ అదనపు ఛార్జీలు వేరువేరుగా ఉండనున్నాయి.

**టికెట్లపై అదనపు ఫ్యూయల్ ఛార్జీ**

దేశీయ మార్గాల్లో ప్రయాణించే విమాన టికెట్లపై రూ.425 చొప్పున అదనపు ఫ్యూయల్ ఛార్జీ విధించనున్నారు. మధ్యప్రాచ్య దేశాలకు వెళ్లే విమాన టికెట్లపై రూ.900 చొప్పున సర్‌ఛార్జ్ వసూలు చేయనున్నారు. అలాగే ఆగ్నేయాసియా, చైనా, పశ్చిమాసియా ప్రాంతాలకు వెళ్లే విమానాలకు రూ.1800 వరకు అదనపు ఛార్జీ విధించనున్నారు. యూరప్‌కు వెళ్లే విమాన టికెట్లపై అయితే రూ.2300 వరకు ఫ్యూయల్ సర్‌ఛార్జ్ వసూలు చేయనున్నట్లు ఇండిగో తెలిపింది.విమానయాన సంస్థల నిర్వహణ వ్యయాల్లో ఇంధనం కీలక పాత్ర పోషిస్తుంది. మొత్తం నిర్వహణ వ్యయాల్లో దాదాపు 40 శాతం వరకు ఇంధన వ్యయం ఉంటుందని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. అంతర్జాతీయంగా ఏటీఎఫ్ ధరలు పెరగడంతో విమానయాన సంస్థలపై ఆర్థిక భారం పెరుగుతోంది. ఈ నేపథ్యంలో తప్పనిసరి పరిస్థితుల్లో స్వల్ప మొత్తంలో ప్రయాణికులపై అదనపు ఛార్జీలు విధించాల్సి వచ్చిందని ఇండిగో సంస్థ తన ప్రకటనలో వెల్లడించింది.

**రూ.399 చొప్పున ఇంధన సర్‌ఛార్జ్ వసూలు!**

ఇక మరోవైపు ఎయిరిండియా కూడా ఇప్పటికే టికెట్లపై ఇంధన సర్‌ఛార్జ్ అమలు చేస్తున్నట్లు ప్రకటించింది. ఎయిరిండియా, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ సంస్థలు మార్చి 12 నుంచి దేశీయ, అంతర్జాతీయ మార్గాల్లో ప్రయాణించే టికెట్లపై అదనపు ఫ్యూయల్ ఛార్జీలు విధిస్తున్నాయి. దేశీయ మార్గాలు, సార్క్ దేశాలకు వెళ్లే విమాన టికెట్లపై రూ.399 చొప్పున ఇంధన సర్‌ఛార్జ్ వసూలు చేస్తున్నారు. అలాగే పశ్చిమాసియా దేశాలకు వెళ్లే విమాన టికెట్లపై 10 డాలర్లు అదనంగా వసూలు చేస్తున్నారు. ఆఫ్రికా దేశాలకు వెళ్లే టికెట్లపై 30 నుంచి 90 డాలర్ల వరకు అదనపు సర్‌ఛార్జ్ విధించారు.ఆగ్నేయాసియా ప్రాంతాలకు వెళ్లే విమాన టికెట్లపై 20 నుంచి 60 డాలర్ల వరకు అదనపు ఛార్జీలు అమలు చేస్తున్నారు. ఇక మార్చి 18 నుంచి యూరప్‌కు వెళ్లే విమాన టికెట్లపై సర్‌ఛార్జ్ మరింత పెరగనుంది. ప్రస్తుతం ఉన్న ఛార్జీపై మరో 25 డాలర్లు పెంచి మొత్తం 125 డాలర్లుగా నిర్ణయించారు. అలాగే ఆస్ట్రేలియా, అమెరికాకు వెళ్లే విమాన టికెట్లపై కూడా సర్‌ఛార్జ్ పెంచనున్నారు. ఈ మార్గాల్లో అదనంగా 50 డాలర్లు పెరిగి మొత్తం 200 డాలర్ల వరకు ఇంధన ఛార్జీ ఉండనుంది. ఇలా అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు పెరగడం వల్ల విమానయాన రంగంపై ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. పెరుగుతున్న ఇంధన ధరలు విమానయాన సంస్థలకు భారీ ఆర్థిక భారంగా మారుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ఆ భారం కొంతమేర ప్రయాణికులపై మోపాల్సిన పరిస్థితి ఏర్పడిందని పరిశ్రమ నిపుణులు చెబుతున్నారు.

# క్రెడిట్ కార్డుతో ఇన్ని కాంప్లిమెంటరీ బెనిఫిట్స్ పొందొచ్చా

**కొత్త క్రెడిట్ కార్డ్ ఇలా సెలెక్ట్ చేసుకోండి**

**డిస్కౌంట్లు, క్రెడిట్ పాయింట్లతో వేల రూపాయలు ఆదా!**

నేటి రోజుల్లో క్రెడిట్ కార్డులు వాడేవారి సంఖ్య ఎప్పటికప్పుడు పెరుగుతూనే ఉంది. చేతిలో డబ్బు లేకున్నా సరే అవసరాలు తీర్చుకోవడం, నచ్చిన వస్తువు కొనుగోలు చేసే వెసులుబాటు ఉండడంతో చాలా మంది క్రెడిట్ కార్డు తీసుకుంటున్నారు. అయితే, క్రెడిట్ కార్డు వాడితే అప్పుల్లో కూరుకుపోతారనే భయం కూడా కొందరిలో ఉంటుంది. ఈ నేపథ్యంలోనే క్రెడిట్ కార్డు ఎలా వాడాలో ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. సరిగా వాడితే చాలా ప్రయోజనాలు ఉంటాయంటున్నారు. ఇంతకీ, క్రెడిట్ కార్డులతో ఎలాంటి బెనిఫిట్స్ ఉంటాయో? ఖర్చులను ఆదా చేయడంలో ఎలా ఉపయోగపడతాయో? ఈ స్టోరీలో తెలుసుకుందాం.క్రెడిట్ కార్డు సంస్థలు కొత్తగా కార్డు తీసుకునే వారికి అనేక రకాల బెనిఫిట్స్‌తోపాటు కాంప్లిమెంటరీ ప్రయోజనాలు కూడా కల్పిస్తుంటాయి. ఇవి క్యాష్‌బ్యాక్, రివార్డులు, భోజనం, వినోదం, ట్రావెల్ బెనిఫిట్స్ మొదలైన రూపాల్లో తగిన బెనిఫిట్స్‌ను అందిస్తుంటాయి. ముఖ్యంగా మెజార్టీ పీపుల్ క్రెడిట్ కార్డులను ఎక్కువగా నెలవారీ కిరాణాసామాగ్రి, షాపింగ్, పెట్రోల్ బంకులు, ఫుడ్ ఆర్డర్లు, యుటిలిటీ బిల్లుల చెల్లింపు, ఆన్‌లైన్ షాపింగ్‌లకు వినియోగిస్తుంటారు. ఇదే క్రమంలో కస్టమర్లను ఆకర్షించేందుకు క్రెడిట్ కార్డు సంస్థలు ఆయా బిల్లులపై క్యాష్ బ్యాక్‌లు, రివార్డులను ఇస్తుంటాయి. ఉదాహరణకు, మీరు ఒక కార్డు ద్వారా నెలవారీగా రూ.10వేలు ఖర్చు చేస్తే, దానిపై 5% క్యాష్‌బ్యాక్ లభించినప్పుడు ప్రతి నెలా మీరు రూ.500 (సంవత్సరానికి రూ.6,000) వరకు ఆదా చేసుకోవచ్చు.

**భోజనం, వినోదం :**

ఈ మధ్యకాలంలో రెస్టారెంట్లలో భోజనం, వినోదానికి సంబంధించిన ఖర్చులు చేసేవారు చాలా ఎక్కువయ్యారు. మీరు క్రెడిట్ కార్డులను రెస్టారెంట్లు, సినిమా థియేటర్లలో ఎక్కువగా వాడుతుంటే డైనింగ్, ఎంటర్‌టైన్‌మెంట్ క్రెడిట్ కార్డులు తీసుకోవచ్చు. ఎందుకంటే చాలా రెస్టారెంట్లు క్రెడిట్ కార్డు సంస్థలతో భాగస్వామ్యాన్ని కలిగి ఉన్నాయి. కాబట్టి, అలాంటి క్రెడిట్ కార్డులు ఉంటే కొన్ని రెస్టారెంట్లు, సినిమా థియేటర్లు 10 నుంచి 40 శాతం వరకు డిస్కౌంట్లు ఇస్తున్నాయి. అంతేకాకుండా, కొన్ని కంపెనీలు ఫ్రీ మూవీ టికెట్స్ ఆఫర్లు కూడా ఇస్తుంటాయి. ఇందుకోసం క్రెడిట్ కార్డు కంపెనీలు స్విగ్గీ, ౯ాం= వంటి సంస్థలతో కలిసి ఈ ఆఫర్లను ఇస్తున్నాయి. ఇలాంటివి తీసుకోవడం ద్వారా మీ మొత్తం బిల్లులో కొంతమేర డబ్బును ఆదా చేసుకోవచ్చంటున్నారు.

**ట్రావెల్ బెనిఫిట్స్ :**

మీరు తరచూ ప్రయాణాలు చేస్తుంటే ట్రావెల్ క్రెడిట్ కార్డులను తీసుకోవడం బెటర్. ఎందుకంటే కొన్ని క్రెడిట్ కార్డులు అనేక ట్రావెల్ సంబంధిత ప్రోత్సాహకాలతో వస్తాయి. ఇలాంటి కార్డులను యూజ్ చేసి విమాన టిక్కెట్లపై మంచి తగ్గింపులను పొందొచ్చు. అంతేకాకుండా ప్రయాణాల విషయంలో బహుళ ప్రయోజనాలను అందిస్తాయిఉదాహరణకు ఒకవేళ ఐఆర్‌సీటీసీ క్రెడిట్ కార్డు తీసుకున్నట్లయితే ఆ కార్డుతో ట్రైన్ టికెట్లు బుక్ చేసుకుంటే 5% నుంచి 10% డిస్కౌంట్ పొందవచ్చంటున్నారు నిపుణులు. అలాగే, ఎఱఖీజ, కోటక్ బ్యాంకులు అందించే 'కా-చింగ్ క్రెడిట్ కార్డు'తో ఇండిగో ఫ్లైట్స్ బుకింగ్‌కు స్పెషల్ డిస్కౌంట్‌తోపాటు రివార్డు పాయింట్లు కూడా లభిస్తాయి. ఎక్కువగా ట్రావెల్ చేసేవారికి ఇలాంటి క్రెడిట్ కార్డులు బెస్ట్ ఆప్షన్‌గా చెప్పుకోవచ్చంటున్నారు నిపుణులు.




**ఫ్రీ లాంజ్ యాక్సెస్ :**

కొన్ని క్రెడిట్ కార్డులు ఎయిర్ పోర్టుల్లో లాంజ్ యాక్సెస్‌ను ఉచితంగా అందిస్తుంటాయి. వాటి ద్వారా దేశీయ, అంతర్జాతీయ కాంప్లిమెంటరీ విమానాశ్రయ లాంజ్ యాక్సెస్ పొందవచ్చంటున్నారు నిపుణులు. అలాగే, ఫ్రీ ఫుడ్, వైఫై యాక్సెస్‌లను ఇస్తాయి. అలాంటి కార్డులు మీతో ఉంటే వేల రూపాయల వరకు ఆదా చేసుకోవచ్చంటున్నారు.

**బీమా కవరేజ్ :**

కొన్ని క్రెడిట్ కార్డులు ట్రావెల్ బీమా కవరేజ్, లగేజీ డ్యామేజ్ కవరేజ్, అత్యవసర సమయాల్లో వైద్య సదుపాయాన్ని కూడా కవర్ చేస్తుంటాయి. ఎక్కువగా వీసా కార్డులు ఇలాంటి ఆఫర్లు అందిస్తుంటాయి. అలాగే, కొన్ని కార్డులు ఇంధన ఖర్చులపై తగ్గింపునూ ఇస్తుంటాయి. భారత్ పెట్రోలియం కార్డు, ఎఱఖీజ బ్యాంక్ ఇండియన్ ఆయిల్ కార్డులు వంటివి ఇందుకు మంచి ఉదాహరణంగా చెప్పుకోవచ్చు. అలాంటి కార్డులు తీసుకుంటే మీ ఫ్యూయల్ ఖర్చులపై కొంతమేర డబ్బు ఆదా చేసుకోవచ్చంటున్నారు నిపుణులు.

**హెల్త్ అండ్ వెల్‌నెస్ బెనిఫిట్స్ :**

ప్రీమియం క్రెడిట్ కార్డులు ఉచిత హెల్త్ అండ్ వెల్‌నెస్ ప్రయోజనాలను అందిస్తున్నాయి. వీటిలో ఉచిత హెల్త్ చెకప్‌లు, జిమ్ ఫీజులలో డిస్కౌంట్‌లు, వెల్‌నెస్ ప్రోగ్రామ్స్‌కు యాక్సెస్‌ను కల్పిస్తాయి. వీటితో మీ వైద్య, ఫిట్‌నెస్ ఖర్చులపై కొంతమేర డబ్బును ఆదా చేసుకోవచ్చని చెబుతున్నారు నిపుణులు. అలాగే, ఈ కార్డులతో హాస్పిటల్, ఫార్మసీ బిల్లులపై కూడా డిస్కౌంట్లు ఉంటాయి. ఎస్‌బీఐ కార్డ్‌ప్లస్, యస్ బ్యాంక్ వెల్‌నెస్ కార్డు, అపోలో ఎస్‌బీఐ కార్డు లాంటివి ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చంటున్నారు.చివరగా మీ అలవాట్లు, అవసరాలకు తగ్గట్లుగా ఎలాంటి క్రెడిట్ కార్డు అవసరమో దాన్నే ఎంచుకోవడం ద్వారా ఏటా వేల రూపాయలను సేవ్ చేసుకోవచ్చని సూచిస్తున్నారు. వీటితో పాటు మీరు క్రెడిట్ కార్డు తీసుకునే ముందే వివిధ బ్యాంకులు అందించే కో బ్రాండెడ్ క్రెడిట్ కార్డుల గురించి ఎంక్వైరీ చేయాలి. అప్పుడు మీకు అధిక ప్రయోజనాలు అందుతాయంటున్నారు నిపుణులు.

# భారత్ బయోటెక్‌కు 30 ఏళ్లు

**ప్రత్యేక లోగో ఆవిష్కరించిన కృష్ణ ఎల్లా**

**మూడు దశాబ్దాల ప్రయాణాన్ని సూచించేలా ప్రత్యేక వార్షికోత్సవ లోగో ఆవిష్కరణ**

**ఈ కార్యక్రమంలో సంస్థ ఉద్యోగులు, కార్మికులు భారీగా హాజరు**

కోవాక్సిన్ తయారు చేసి అనేక మంది ప్రాణాలను కాపాడిన ప్రముఖ ఔషధ తయారీ సంస్థ భారత్ బయోటెక్ 30 ఏళ్లు పూర్తి చేసుకుంది. ఆ మైలురాయిని గుర్తుచేసుకుంటూ కంపెనీ మూడు దశాబ్దాల ప్రయాణాన్ని సూచించేలా ప్రత్యేక వార్షికోత్సవ లోగోను కంపెనీ ఆవిష్కరించింది. సంస్థ వ్యవస్థాపకులు, ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డాక్టర్ కృష్ణ ఎల్లా, మేనేజింగ్ డైరెక్టర్ శ్రీమతి సుచిత్ర ఎల్లా లోగోను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఉద్యోగులు, కార్మికులు భారీగా హాజరయ్యారు. ఈ క్రమంలోనే సంస్థ ప్రయాణాన్ని వివరిస్తూ భవిష్యత్‌లో చేపట్టబోయే కార్యక్రమాలపై క్యాలెండర్‌ను విడుదల చేసింది.30 సంవత్సరాల క్రితం భారతీయ సైన్స్ ప్రపంచ ఆరోగ్య సవాళ్లను పరిష్కరించగలదనే శక్తిమంతమైన నమ్మకంతో భారత్ బయోటెక్‌ను ప్రారంభించాం. మా బలం ఎల్లప్పుడూ మా శాస్త్రవేత్తలు, మేము తీసుకునే యాజమాన్య సాంకేతికతలు, ఆవిష్కరణలు. మేము అభివృద్ధి చేసిన ప్రతి టీకాలో ఆరోగ్య సంరక్షణ ఒక హక్కని, ఒక ప్రత్యేక గౌరవం కాదని నమ్మే బృందాల కృషి ఉంటుంది."భారత్ మరొకరిని అనుసరించకుండా సొంతంగా నాయకత్వం వహించాలని మేము నమ్మి మా సొంత మేధో సంపత్తిని, మా స్వంత తయారీ వేదికలను నిర్మించుకున్నాము. ఇంకా అధునాతన సెల్, జన్యు చికిత్సలోకి ప్రవేశించినప్పుడు మేము అదే లక్ష్యం ద్వారా మార్గనిర్దేశంతో ముందుకు సాగుతున్నాం." అని భారత్ బయోటెక్ మేనేజింగ్ డైరెక్టర్ సుచిత్రా కె ఎల్లా అన్నారు.జీనోమ్ వ్యాలీ పితామహుడిగా పిలిచే డాక్టర్ కృష్ణ ఎల్లా, సుచిత్ర ఎల్లా అధ్వర్యంలో 1996లో భారత్ బయోటెక్‌ను స్థాపించారు. భారతదేశంలో ప్రపంచ స్థాయి పరిశోధన ఆధారిత వ్యాక్సిన్‌లను రూపొందించాలనే లక్ష్యంతో దీనిని ప్రారంభించారు. ఈ ప్రాంతంలో ప్రారంభమైన తొలి పరిశ్రమల్లో ఒకటిగా భారత్ బయోటెక్ నిలిచింది. ఈ ప్రాంతాన్ని జీనోమ్ వ్యాలీగా మార్చడంలో ఈ కంపెనీ కీలక పాత్ర పోషించింది. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఈ బయోటెక్నాలజీ హబ్, ఇప్పుడు ఆసియాలో అతిపెద్ద లైఫ్ సైన్సెస్ క్లస్టర్‌గా మారింది. ప్రపంచంలో సరసమైన, అధిక నాణ్యత గల వ్యాక్సిన్ల సరఫరాదారుగా విశ్వసనీయ ఆవిష్కర్తగా భారత్‌ను నిలబెట్టడంలో మూడు దశాబ్దాలుగా భారత్ బయోటెక్ కృషి చేస్తోంది.ముఖ్యంగా 19 మహమ్మారి సమయంలో భారత్ బయోటెక్ భారతదేశంలో మొట్టమొదటి స్వదేశీ వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేసింది. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (×జవీ=) సహకారంతో ప్రభుత్వ- ప్రైవేట్ భాగస్వామ్యంలో అభివృద్ధి చేసిన కోవ్యాక్సిన్ భారత శాస్త్రీయ సామర్థ్యం, స్వావలంబనకు నిదర్శనంగా నిలిచింది. ఈ వ్యాక్సిన్ భారత్‌తో పాటు అనేక దేశాల్లో అత్యవసర వినియోగ అధికారాన్ని పొందింది. ఫలితంగా ఆధునిక చరిత్రలో అత్యంత సవాలుగా ఉన్న ప్రజారోగ్య సంక్షోభ సమయంలో ఈ అర్థవంతమైన పాత్ర పోషించింది.భారత్ బయోటెక్ ప్రపంచ స్థాయి, బయో-సేఫ్టీ లెవల్ 3 తయారీ, ఇంటిగ్రేటెడ్ సెల్, జీన్ థెరపీ సౌకర్యాలను నిర్వహిస్తోంది. భారత్ బయోటెక్ ఇప్పటివరకు 415 పేటెంట్ల కోసం దాఖలు చేయగా సుమారు 220 కంటే ఎక్కువ మంజూరయ్యాయి. ఇంకా 125 కంటే ఎక్కువ దేశాల్లో 20 వ్యాక్సిన్‌లు, 4 బయోథెరప్యూటిక్స్‌తో బలమైన ట్రాక్ రికార్డ్ ఉంది. ప్రపంచ వ్యాప్తంగా 9 బిలియన్లకు పైగా వ్యాక్సిన్ డోసులను పంపిణీ చేసింది. ఇందులో ఇన్ఫ్లుఎంజా ఎ1చీ1, రోటవైరస్, జపనీస్ ఎన్సెఫాలిటిస్, రేబిస్, చికెన్ గున్యా, జికా, కలరా, మలేరియా, ముఖ్యంగా టైఫాయిడ్ కోసం ప్రపంచంలోనే మొట్టమొదటి టెటనస్-టాక్సాయిడ్ కంజుగేటెడ్ వ్యాక్సిన్ (టైప్‌బార్ ౹జ్బ౹) వ్యాక్సిన్లను రూపొందించారు. ఇంకా ఎదీ వ్యాధి నివారణ ప్రయత్నాల్లో భాగంగా క్షయవ్యాధి వ్యాక్సిన్ కోసం ముందడుగు వేసింది.ఇండో- అమెరికా ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యంతో స్వదేశీ రోటావైరస్ వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేయడం సంస్థ ప్రయాణంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది. ఇది లక్షలాది మంది పిల్లలను ప్రాణాంతక విరేచనాల వ్యాధి నుంచి రక్షించే లక్ష్యంతో తయారు చేశారు. ఇంకా ప్రజారోగ్య కార్యక్రమాల కోసం ఈ డోస్‌ను కేవలం ఒక డాలర్‌కే అందుబాటులో ఉంచుతామని వ్యవస్థాపకులు డాక్టర్ కృష్ణ ఎల్లా వెల్లడించారు.

# ఈ ప్రభుత్వ పథకాల్లో "పెట్టుబడి" పెడుతున్నారా

**మార్చి 31లోపు ఈ పని చేయకపోతే మీ ఖాతా క్లోజ్!**

**ఈ స్కీమ్స్‌లో ఇన్వెస్ట్ చేసే వారికి "మార్చి 31 డెడ్ లైన్"**

**లాస్ట్ వరకు వేచి చూస్తే పెనాల్టీ ముప్పు!**

ప్రస్తుత రోజుల్లో భవిష్యత్తు అవసరాల దృష్ట్యా మెజార్టీ పీపుల్ వివిధ రకాల సేవింగ్ స్కీమ్స్‌లో పెట్టుబడులు పెడుతున్నారు. అందులోనూ ముఖ్యంగా ప్రభుత్వ రక్షణ ఉండే వాటిల్లో ఇన్వెస్ట్ చేయడానికి ఎక్కువ మొగ్గు చూపుతుంటారు. మీరూ ఏదైనా కేంద్ర ప్రభుత్వ పొదుపు పథకంలో పెట్టుబడి పెడుతున్నారా? అయితే, మీకో బిగ్ అలర్ట్. మార్చి 31లోపు ఈ పని పూర్తి చేయకుంటే మీ అకౌంట్ ఇన్‌యాక్టివ్(ఫ్రీజ్) అయ్యే అవకాశం ఉంది. వెంటనే చెక్ చేసుకుని ఆ పని పూర్తి చేయండని సూచిస్తున్నారు నిపుణులు. ఇంతకీ, ఏంటి ఆ పని? చేయకపోతే ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందో ఈ స్టోరీలో తెలుసుకుందాం.నార్మల్‌గా అందరూ పొదుపు కోసం రిస్క్ లేని, అధిక వడ్డీనిచ్చే ప్రభుత్వ పథకాలను ఎంచుకుంటుంటారు. అందులో భాగంగానే మనలో చాలా మంది "సుకన్య సమృద్ధి యోజన, నేషనల్ పెన్షన్ సిస్టమ్(చీూూ), పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్" పథకాల్లో ఇన్వెస్ట్ చేస్తుంటారు. అయితే, ఆయా పథకాల్లో ఇన్వెస్ట్ చేసేవారు ఏటా ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు అంటే మార్చి 31 నాటికి మినిమం డిపాజిట్ పూర్తి చేయాల్సి ఉంటుంది. కానీ, కొన్నిసార్లు పని ఒత్తిడి వల్లనో, ఇంకేదైనా కారణం చేతనో ఆ అకౌంట్లలో వేయాల్సిన 'కనీస పెట్టుబడి' సంగతి మర్చిపోతుంటాం.అయితే, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025-26 ముగియడానికి మరికొన్ని రోజులే (మార్చి 31 వరకు) గడువు ఉంది. మరి, మీరు ఇంకా ఆయా పథకాల్లో మినిమమ్ డిపాజిట్ చేయకపోతే ఇప్పుడే ఆ పని పూర్తి చేయండని సూచిస్తున్నారు నిపుణులు. లేదంటే మీ పొదుపు ఖాతా ఇనాక్టివ్ అయిపోతుంది. ముఖ్యంగా పన్ను ఆదా కోసం ఇన్వెస్ట్ చేసే వారికి ఈ చిన్న మిస్టేక్ మరిన్ని ఇబ్బందులు తెచ్చిపెడుతుందంటున్నారు. మరి, ఈ మూడు సేవింగ్ స్కీమ్స్‌లో దేనిలో ఎంత మినిమమ్ డిపాజిట్ ఉంటుంది? సరైన టైమ్‌లో డిపాజిట్ చేయకపోతే ఏవిధంగా నష్టపోతారు? వంటి వివరాలు ఇప్పుడు చూద్దాం.

**సుకన్య సమృద్ధి యోజన**

ఆడపిల్లల భవిష్యత్తు అవసరాల కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన అత్యంత లాభదాయకమైన పొదుపు పథకం "సుకన్య సమృద్ధి యోజన". అయితే, ఈ అకౌంట్ యాక్టివ్‌గా ఉండాలంటే ఒక ఆర్థిక సంవత్సరంలో కనీసం రూ.250 డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. కాబట్టి, మీరు ఈ స్కీమ్‌లో ఇన్వెస్ట్ చేస్తున్నట్లయితే మార్చి 31లోపు మినిమమ్ డిపాజిట్ చేయకపోతే మీ ూూ్ ఖాతా ఇన్‌యాక్టివ్‌గా మారిపోతుంది. దాంతో మీరు వడ్డీ పొందలేరు. విత్‌డ్రా సౌకర్యం ఉండదు. అలాగే, ట్యాక్స్ బెనిఫిట్స్ కూడా లభించవు. ఒకవేళ అకౌంట్ ఫ్రీజ్ అయితే రూ.50 పెనాల్టీ చెల్లించి రియాక్టివ్ చేసుకోవాల్సి ఉంటుంది.

**నేషనల్ పెన్షన్ సిస్టమ్**

పదవీ విరమణ తర్వాత ఆర్థిక భద్రత కోసం చాలా మంది నేషనల్ పెన్షన్ సిస్టమ్(చీూూ)లో ఇన్వెస్ట్‌మెంట్ చేస్తుంటారు. పన్ను ఆదా చేసుకునేందుకు ఈ స్కీమ్ చాలా బాగా ఉపయోగపడుతుంది. అయితే, ఈ స్కీమ్ ద్వారా పొందే ట్యాక్స్ బెనిఫిట్స్ కొనసాగాలంటే ముందు అకౌంట్‌ను యాక్టివ్‌గా ఉంచుకోవడం చాలా అవసరం. అందుకోసం ప్రతీ ఆర్థిక సంవత్సరం మినిమమ్ డిపాజిట్‌గా రూ.1000 ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది. అదే, ఒక సంవత్సరంలో కనీస పెట్టుబడి డిపాజిట్ చేయకపోతే అకౌంట్ ఫ్రీజ్ అవుతుంది. అప్పుడు రూ.100 పెనాల్టీ కట్టి ఖాతాను యాక్టివ్ చేసుకోవాలి.

**పబ్లిక్ ప్రావిడెండ్ ఫండ్**

మీరు పబ్లిక్ ప్రావిడెండ్ ఫండ్(ూూఖీ) అకౌంట్ కలిగి ఉంటే అది యాక్టివ్‌గా ఉండాలంటే సంవత్సరానికి కనీసం రూ.500 పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. ఒకవేళ మీరు ఒక ఆర్థిక సంవత్సరంలో మినిమమ్ డిపాజిట్ చేయకపోతే ఆ అకౌంట్ ఇనాక్టివ్ అయిపోతుంది. ఒకసారి ఖాతా పని చేయడం ఆగిపోతే దానిపై లోన్, విత్‌డ్రా సౌకర్యాలు గానీ ఉండవని గుర్తుంచుకోవాలి. అప్పుడు మీరు అకౌంట్ రియాక్టివ్ చేసుకోవడానికి రూ.50 చెల్లించాల్సి ఉంటుంది. దాంతో అదనపు భారం పడుతుందని గుర్తుంచుకోవాలి.

**లాస్ట్ వరకు వేచి చూస్తే పెనాల్టీ ముప్పు!**

మీరు పైన చెప్పిన పొదుపు ఖాతాల్లో ఇన్వెస్ట్ చేస్తున్నట్లయితే ఇంకా మినిమమ్ డిపాజిట్ చేయకపోతే ఇప్పుడే ఆ పని కంప్లీట్ చేయండి. మార్చి 31 లాస్ట్ డేట్ వేచి చూడకండి. ఎందుకంటే చివరి రోజుల్లో టెక్నికల్ ఇష్యూ వల్ల ఇబ్బందులు తలెత్తవచ్చు. ట్రాన్సాక్షన్ ఫెయిల్ అయితే అనవసరంగా పెనాల్టీ కట్టటం కంటే ముందుగానే మినిమమ్ డిపాజిట్లను పూర్తి చేసుకుని అకౌంట్‌ను యాక్టివ్‌గా ఉంచుకోవడం బెటర్ అంటున్నారు నిపుణులు.

# వంట గ్యాస్ కొరత భయాలు

**ఇండక్షన్ స్టవ్‌లన్నీ సేల్ , ఆన్‌లైన్‌లో 'అవుట్ ఆఫ్ స్టాక్'**

**ఇండక్షన్ స్టవ్‌లకు భారీగా పెరిగిన డిమాండ్**

**అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌ల్లో విపరీతంగా ఆర్డర్స్ , ఎల్‌పీజీ గ్యాస్ కొరతే కారణం!**


పశ్చిమాసియా ఉద్రిక్తతలు మరింత తీవ్రమవుతున్న నేపథ్యంలో ఎల్‌పీజీ (వంట గ్యాస్) సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడవచ్చనే ఆందోళనలు దేశవ్యాప్తంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే వంట గ్యాస్‌కు ప్రత్యామ్నాయాల కోసం ప్రజలు ఎగబడుతున్నారు. ముఖ్యంగా ఇండక్షన్ స్టవ్‌ల కోసం విపరీతంగా ఆర్డర్లు పెడుతున్నారు. దీంతో అవి హాట్ కేక్‌ల్లా అమ్ముడపోతున్నాయి. దీంతో క్విక్-కామర్స్ సైట్లలో చూస్తుంటే చాలా వరకు 'అవుట్ ఆఫ్ స్టాక్' అనే బ్యాడ్జ్‌లు కనిపిస్తున్నాయి.ముఖ్యంగా బ్లింకిట్, జెప్టో, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్, బిగ్‌బాస్కెట్ లాంటి ప్రముఖ క్విక్ కామర్స్ ప్లాట్‌ఫామ్స్‌లో వెతికితే, 'అన్‌అవైలబుల్' (అందుబాటులో లేవు), 'సోల్డ్ అవుట్' (అమ్ముడైపోయాయి) అనే బ్యాడ్జీలు కనిపిస్తున్నాయి. చాలా నగరాల్లోనూ ఇలాంటి పరిస్థితే ఉంది. సాధారణంగా, ఆర్డర్ చేసిన నిమిషాల్లోనే డెలివరీ చేస్తామని ఈ క్విక్-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లు చెబుతుంటాయి. కానీ ఇప్పుడు ఒక్కసారిగా విద్యుత్‌తో పనిచేసే స్టవ్‌లు, పరికరాల కోసం డిమాండ్ పెరగడంతో వాటిని అందించలేకపోతున్నాయి. ఎల్‌పీజీ సిలిండర్లకు ప్రత్యామ్నాయాల కోసం గృహ వినియోగదారులు పెద్ద ఎత్తున ఒకేసారి ప్రయత్నిస్తుండడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది.


**30 రెట్లు పెరిగిన ఆర్డర్లు**


అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ లాంటి అతిపెద్ద ఈ-కామర్స్ సంస్థలు కూడా ఇదే విషయాన్ని చెబుతున్నాయి. తమకు ఒకేసారి భారీ మొత్తంలో ఇండక్షన్ స్టవ్‌ల గురించి ఆర్డర్లు వస్తున్నాయని పేర్కొన్నాయి. "గత రెండు రోజుల్లో ఇండక్షన్ కుక్‌టాప్‌ల విక్రయాలు సాధారణం కంటే 30 రెట్లుకు పైగా పెరిగాయి. ఇక రైస్ కుక్కర్లు, ఎలక్ట్రిక్ ప్రెజర్ కుక్కర్‌లకు సాధారణం కంటే 4 రెట్లు డిమాండ్ పెరిగింది. ఎయిర్ ఫ్రయ్యర్లు, మల్టీ-యూజ్ కెటిల్స్ విక్రయాలు 2 రెట్లు వరకు పెరగడం జరిగింది" అని అమెజాన్ ఇండియా ప్రతినిధి తెలిపారు.ఫ్లిప్‌కార్ట్ కూడా ఇదే విషయాన్ని చెప్పింది. గత కొన్ని వారాలతో పోల్చితే, గత నాలుగైదు రోజుల్లో ఇండక్షన్ కుక్‌టాప్‌ల విక్రయాలు నాలుగు రెట్లు పెరిగినట్లు తెలిపింది. భవిష్యత్‌లో ధరల హెచ్చుతగ్గులు, సరఫరా కొరత ఏర్పడవచ్చనే భయాలతో ఈ విధంగా డిమాండ్ పెరిగిందని అభిప్రాయపడింది. ముఖ్యంగా దిల్లీ, కోల్‌కతా, ఉత్తరప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాల్లో వంట గ్యాస్ ప్రత్యామ్నాయాల కోసం వినియోగదారులు ప్రయత్నిస్తుండడంతో డిమాండ్ ఒక్కసారిగా పెరిగిందని ఫ్లిప్‌కార్ట్ పేర్కొంది.పశ్చిమాసియాలో ఇరాన్ వర్సెస్ అమెరికా, ఇజ్రాయెల్ మధ్య భీకర యుద్ధం సాగుతోంది. మరోవైపు హర్మూజ్ నుంచి చమురు నౌకలు వెళ్లకుండా ఇరాన్ కట్టడి చేస్తోంది. అంతేకాదు కొన్ని నౌకలపై ఇప్పటికే దాడులు చేసింది. దీనితో వంట గ్యాస్ లభ్యతలపై గృహ వినియోగదారులకు, చిరు వ్యాపారాలకు ఆందోళన చెలరేగుతోంది. అందుకే వాళ్లు వంట గ్యాస్‌కు బదులుగా, విద్యుత్‌తో పనిచేసే ప్రత్యామ్నాయాల కోసం ప్రయత్నిస్తున్నారు. దీనితో ఇండక్షన్ స్టవ్‌లకు విపరీతంగా డిమాండ్ పెరుగుతున్నట్లు కనిపిస్తోంది.మరోవైపు విద్యా సంస్థలు, ఆసుపత్రులు లాంటి అత్యవసర సేవలు అందించే వాటికి గ్యాస్ సరఫరాలో ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూటర్లను కోరినట్లు సమాచారం.

**ఎల్‌పీజీ ఉత్పత్తి 25 శాతం పెంపు**

పశ్చిమాసియాలో యుద్ధం తీవ్రమవుతున్న నేపథ్యంలో మన దేశ గ్యాస్ సరఫరా 30 శాతం మేర తగ్గింది. ఈ నేపథ్యంలోనే చమురు మంత్రిత్వశాఖ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎల్‌పీజీ, సీఎన్‌జీ , పైప్డ్ వంట గ్యాస్ సరఫరాలకు ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేసింది. అంతేకాదు కేంద్రం ఇప్పటికే ఎల్‌పీజీ ఉత్పత్తిని సుమారు 25శాతం పెంచింది. ఈ ఉత్పత్తి మొత్తాన్ని గృహ వినియోగదారులకే అందించాలని ఆదేశించింది. పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ సమాచారం ప్రకారం, ఎల్‌పీజీ ఉత్పత్తిని గరిష్ఠం చేయాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వం మార్చి 8న రిఫైనరీలు, పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌లకు ఉత్తర్వులు జారీ చేసింది.







## మళ్ళీ సైన్స్ ఫిక్షన్ ప్రపంచంలోకి స్పీల్‌బర్గ్..

హాలీవుడ్ లెజెండరీ దర్శకుడు స్టీవెన్ స్పీల్‌బర్గ్ 79 ఏళ్ల వయసులో కూడా తనదైన మార్కు సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్‌తో అందరిని షాక్‌కి గురిచేస్తున్నాడు. ఆయ న దర్శకత్వంలో రాబోతున్న చిత్రం "డిస్క్లోజర్ డే" ఈ చిత్రానికి సంబంధిం చిన అధికారిక ట్రైలర్ గురువారం విడుదలై ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. 'ఈటీ', 'క్లోజ్ ఎన్‌కౌంటర్స్ ఆఫ్ ది థర్డ్ కైండ్', 'ఏఐ' వంటి ఆల్-టైమ్ క్లాసిక్స్ తర్వాత స్పీల్‌బర్గ్ మళ్లీ ఏలియన్స్ నేపథ్యమున్న కథను ఎంచుకోవడం విశేషం. ఈ చిత్రంలో ఎమిలీ బ్లంట్ వాతావ రణంకి సంబంధించిన విషయాలను చెప్పే రిపోర్టర్‌గా నట ిస్తుండగా, ప్రభుత్వం రహస్యంగా దాచిన గ్రహాంతరవాసుల నిజాలను ప్రపంచానికి వెల్లడించే క్రమంలో ఎదురయ్యే ఉత్కంఠభరిత పరిణామాలను ఈ సినిమా చూపించనుంది. ముఖ్యంగా ట్రైలర్‌లో లైవ్ బ్రాడ్‌కాస్టింగ్ సమయంలో ఎమిలీ బ్లంట్ అదృశ్య శక్తుల ప్రభావానికి గురయ్యే సన్నివేశాలు హారర్ మరియు థ్రిల్లింగ్ అనుభూతిని కలిగిస్తున్నాయి.



## 'కాలరే ఎత్తరా'.. అంటున్న 'ఉస్తాద్ భగత్ సింగ్'

'గబ్బర్ సింగ్' వంటి సంచలన విజయం తర్వాత పవర్ స్టార్ పవన్ కల్యాణ్, కల్ట్ కెప్టెన్ హరీష్ శంకర్ కలయికలో వస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమాపై అంచనాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఇప్పటివరకు ఇందులో నుంచి విడుదలైన ప్రతి పాట, టీజర్ ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందనను అందుకున్నాయి. ఆ ఉత్సాహాన్ని మరింత పెంచుతూ తాజాగా చిత్రబృందం మూడో గీతం 'కాలరే ఎత్తరా'ను విడుదల చేసింది. ఈ పాట విడుదలతో సినిమాపై ఉన్న ఆసక్తి మరింత పెరిగింది. భారీ స్థాయిలో రూపొందించిన ఈ పాటలో భారీ సెట్‌లు, కట్టిపడేసే విజువల్స్, అద్భుతమైన ఎనర్జీ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా పవన్ కల్యాణ్ తన ప్రత్యేకమైన స్టైల్, ఎనర్జీ, డ్యాన్స్ స్టెప్పులతో తెరపై వెలుగులు నింపారు. కాగా.. 'ఉస్తాద్ భగత్ సింగ్' ఇప్పటికే సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకుని యూ/ఏ సర్టిఫికెట్‌ను సొంతం చేసుకుంది. మార్చి 14వ తేదీన ఈ చిత్ర ట్రైలర్‌ను విడుదల చేయనుంది చిత్రబృందం. అనంతరం మార్చి 15వ తేదీన భారీ ప్రీ-రిలీజ్ వేడుకను నిర్వహించనున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ మూవీ మార్చి 19వ తేదీన థియేటర్లలో అడుగుపెట్టనుంది.



## యూత్ ఫుల్ ఎంటర్‌టైనర్‌గా 'యూత్'

కెన్ కరునాస్, అనిష్మ అనిల్ కుమార్, దేవదర్శిని చేతన్, సూరజ్ వెంజరముడు, ప్రియాన్షి యాదవ్, మీనాక్షి దినేష్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తమిళ మూవీ 'యూత్'. ఈ చిత్రాన్ని ఇదే పేరుతో తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు హౌస్ ఫుల్ వినీత్, సందీప్. ఈ చిత్రానికి కెన్ కరునాస్ అండ్ గ్యాంగ్ దర్శకత్వం వహించారు. త్వరలోనే 'యూత్' మూవీ తెలుగులో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతోంది. ఈ సందర్భంగా తాజాగా ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను హీరో కిరణ్ అబ్బవరం లాంచ్ చేశారు. అనంతరం టీమ్‌కు ఆల్ ది బెస్ట్ తెలిపారు. మలయాళ బ్లాక్ బస్టర్ ప్రేమలు తెలుగులోనూ ఘన విజయాన్ని అందుకుంది. అలాగే ఇలాంటి తరహా కంటెంట్ తోనే వచ్చిన లిటిల్ హార్ట్స్ కూడా పెద్ద సక్సెస్ దక్కించుకుంది. ఇప్పుడు తెలుగు ఆడియెన్స్‌కు కావాల్సిన యూత్ ఫుల్ రొమాంటిక్ ఎంటర్ టైనర్ జానర్‌లో వస్తున్న "యూత్" సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ తోనే అలాంటి వైబ్స్ క్రియేట్ చేస్తోంది.



## డెకాయిట్‌పై ఎక్స్‌పెక్టేషన్స్ పెంచేసిన హీరో కామెంట్స్

బ్యాక్ టు బ్యాక్ చిత్రాలతో అలరిస్తున్న హీరో అడివి శేష్ ఇప్పుడు కొత్త అవతార్‌లో డెకాయిట్'తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ చిత్రంలో శేష్ తొలిసారిగా మాస్, రగ్గ్‌డ్ పాత్రలో కనిపించనున్నారు. మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంతో షానియల్ డియో దర్శకుడిగా అరంగేట్రం చేస్తున్నారు. సుప్రియా యార్లగడ్డ నిర్మిస్తున్న ఈ మూవీ ఏప్రిల్ 10న రాబోతున్నది. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్‌కి అద్భుతమైన రెస్పాన్స్ రాగా.. షూటింగ్ పూర్తి చేసుకన్న సదర్భంగా సినిమా విశేషాలు పంచుకున్నాడు అడివి శేష్. 'డెకాయిట్ ఒక కొత్త జోనర్‌లో చేసిన సినిమా.



## మరోసారి అందాలతో ఎటాక్

మోస్ట్ బ్యూటిఫుల్ నటి సాక్షి అగర్వాల్ గురించి తెలుగు ప్రేక్షకులకు పెద్దగా పరిచయం లేకపోవచ్చు. ఈమె ఎక్కువ శాతం తమిళ సినిమాల్లో నటించింది. ఆ తర్వాత కన్నడ, మలయాళ చిత్రాల్లో నటించింది. 2013లో వచ్చిన రాజా రాణి చిత్రంతో ఈ ముద్దుగుమ్మ వెండితెరకు పరిచయం అయింది. అంతకుముందు పలు టీవీ షోలలో పార్టిసిపేట్ చేసి బుల్లితెర అభిమానులను బాగానే సంపాదించుకుంది. ఈమె ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చి చాలా సంవత్సరాలు అవుతున్నా చాలా తక్కువ సినిమాల్లోనే నటించింది. ఈ బ్యూటీ సినిమాల సంఖ్య తక్కువగా ఉన్నా అభిమానులను మాత్రం బాగానే సంపాదించుకుంది. సాక్షి సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటూ ఎప్పటికప్పుడు తనకు సంబంధించిన ఫోటోలను పోస్ట్ చేస్తూ రోజురోజుకు తన ఫాలోవర్స్ సంఖ్యను పెంచుకుంటూ వస్తుంది. ఈ బ్యూటీ ఇప్పటికీ అనేకసార్లు తన సోషల్ మీడియా అకౌంట్లో హాట్ ఫోటోలను పోస్ట్ చేసిన సందర్భాలు ఉన్నాయి. అందులో చాలా వరకు వైరల్ కూడా అయ్యాయి. దానితో ఈమెకు ఓ స్టార్ హీరోయిన్ రేంజ్లో ఫాలోవర్స్ ఏర్పడ్డారు. తాజాగా ఈ బ్యూటిఫుల్ నటి తన 'ఇన్ స్టా'లో కొన్ని హాట్ లుక్లో ఉన్న ఫోటోలను పోస్ట్ చేసింది. సాక్షి అగర్వాల్ తాజాగా ఉల్లిపొరలాంటి లైట్ బ్లూ కలర్ శారీని కట్టుకొని, గోల్డ్ కలర్ స్లీవ్ లెస్ బ్లౌజ్ను ధరించి తన బ్యాక్ అందాలు ఫోకస్ అయ్యేలా ఉన్న ఫోటోలను తన ఇన్ స్టా అకౌంట్లో పోస్ట్ చేసింది. ఈ ఫోటోలలో ఈ ముద్దుగుమ్మ ఎక్సలెంట్ గా ఉండడంతో ప్రస్తుతం ఈ నటికి సంబంధించిన ఫోటోలు వైరల్ అవుతున్నాయి. ఈ ఫోటోలకు అనేకమంది బ్యూటిఫుల్, ఆసమ్, లవ్, ఫైర్ ఎమోజీలను కామెంట్లుగా పెడుతున్నారు.



## ఓటీటీలో భారత్-పాక్ యుద్ధ సినిమా.. స్ట్రీమింగ్ ఎప్పుడంటే

బాలీవుడ్ హిట్ ఫ్రాంఛైజీ చిత్రం బోర్డర్-2 ఓటీటీలోకి రానుంది. ఈమేరకు అధికారికంగా ప్రకటన వచ్చేసింది. సన్నీ డియోల్ కీలక పాత్రలో నటించిన ఈ చిత్రం రిపబ్లిక్ డే కానుకగా థియేటర్లలోకి వచ్చింది. 1997లో రిలీజై భారీ హిట్ అందుకున్న బోర్డర్ చిత్రానికి సీక్వెల్ తెరకెక్కించారు. ఇందులో వరుణ్ ధావన్, దిల్జీత్ దొసాంజ్ తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు. ఈ మూవీని అనురాగ్ సింగ్ దర్శకత్వం వహించారు. 1971 ఇండో-పాక్ యుద్ధం తీవ్రతను, భారత సాయుధ దళాల వీరత్వాన్ని ఈ సినిమా చూపిస్తుంది. అందరిలో దేశభక్తిని రగిల్చేలా ఈ చిత్రం ఉంటుంది. బోర్డర్ 2 మూవీ మార్చి 20 నుంచి నెట్‌ఫ్లిక్స్ (చీవ్‌టశ్రీఅఇ) వేదికగా స్ట్రీమింగ్ కానుంది. అయితే, హిందీ వర్షన్‌లో మాత్రమే అందుబాటులో ఉంటుంది. సుమారు రూ. 275 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈచిత్రం ప్రపంచవ్యాప్తంగా దాదాపు రూ. 485 కోట్లకు పైగానే వసూలు చేసినట్లు తెలుస్తోంది. బోర్డర్ ఫ్రాంఛైజీని కొనసాగిస్తూ మరో చిత్రాన్ని కూడా మేకర్స్ ప్రకటించారు. పార్ట్-1 మాదిరే 'బోర్డర్ 2' కూడా దేశభక్తిని పెంచేలా ఉంటుంది. భారత్‌ను దొంగదెబ్బ కొట్టేందుకు పాకిస్థాన్ 1971లో ఎలాంటి కుట్రలు చేసిందో ఈ చిత్రంలో చూడొచ్చు. భారత్‌పై భూ, జల, వాయు మార్గాల ద్వారా కశ్మీర్, పంజాబ్, గుజరాత్ సరిహద్దుల ద్వారా భారీ దాడులకు దిగుతుంది. అయితే, భారత ప్రభుత్వం దీనిని ముందే గ్రహించి సైనికులను యుద్ధ రంగంలోకి దింపుతుంది. పాక్ సైన్యాన్ని ఎలా మట్టికరిపించారో ఇందులో చూపించారు.

The Publisher, Editor seggem kiran kumar 8-6-128/m,TKR collage road , Nandanavanam colony, kharmanghat,Rangareddy, Telangana - 500079.
mail : vaarthasandhya@gmail.com, www.vaarthasandhya.com epaper.vaarthasandhya.com. Cell : 73961 22101 , 99517 51662.